(8–14.) సప్తర్షితీర్థము :—ఆపైన సప్తఋషుల పేరిట యేడు తీర్థములు కలవు. సప్తఋషులనిన, భృగువు, అంగిరసుడు, మరీచి, అత్రి, పులస్త్యుడు పులహుడు, క్రతువు - అను పేరులతో ప్రసిద్ధిజెందిన బ్రహ్మమానసపుత్రులు.

(15.) కాపిలతీర్థము :—వేంకటాద్రికి దిగువ భాగమున పూర్వము పాతాలలోకమున కపిలమునిచే పూజింపబడిన శివలింగము కలదు. ఎట్టో పుణ్యావిశేష

ముచే పాతాలమునుండి భూమిని భేదించికొని యీ శివలింగము భూమిపై యవతరించెను. ఆ లింగము నాప్యాయనము సేయుటకై కామధేనువు అవతరించి యీ లింగము ఊర్ధ్వమునకు పెరుగకుండ తనఖురములచే యణచివైచెను. ఆ కాపిల లింగము భూమిని భేదించినందుచే యేర్పడిన రంధ్రమే కాపిల తీర్థమను పేరిట ప్రసిద్ధిజెందెను.

(16.) ఐంద్రతీర్థము :— కాపిలతీర్థమున కూర్ధ్వభాగమున శక్రతీర్థము కలదు. పతివ్రతాలలామమగు నహల్యయందపచారపడుటచే సంభవించిన పాపమునుండి ఇంద్రునకీ తీర్థస్నానముచే మోక్షము కలుగుటచే నీ తీర్థము శక్రతీర్థమని పిలువబడినది. దీనికే వజ్రితీర్థమనియు నామాంతరము.

(17.) విష్వక్సేనతీర్థము:—విష్వక్సేను డీ తీర్థతీరమందు తపస్సిద్ధినొంది విష్ణుసేనాపతియై విష్ణుసారూప్యమును బొందుటచే దీనికీ వ్యవహారము కల్గినది.

ఈ పట్టికలో ఇంద్రతీర్థమునకు బదులు వజ్రతీర్థమనుపేరు వామనపురాణమున కానవచ్చినది. వారాహపురాణమున నీతీర్థముల పట్టికలోని పేరులు వ్యత్యస్తముగ చెప్పబడినవి. అనగా, కాపిలము, శక్రతీర్థము, విష్వక్సేనతీర్థము, పంచాయుధతీర్థము, అగ్నితీర్థము, బ్రహ్మతీర్థము, సప్తర్షితీర్థము అని యచ్చటి క్రమము. ఈ క్రమముచెప్పి

'దశాధికఫలం తేషాం తీర్థానాముత్తరోత్తరమ్'

అనునట్లు యథాక్రమముగా మొదటిదానికంటె రెండవది దశాధికఫలము నీయగలదని మహిమవిశేషము ప్రస్తావించబడినది. అచ్చటి ప్రకృతశ్లోకము లివి.

సూతః :—

"తీర్థానాం చైవ మాహాత్మ్యం తేషాం వక్తుం చ కృత్స్నశః ।
న శక్యం లేశత స్తేషాముచ్యతే శ్రూయతామిదమ్ ॥ ४
గిరేరధఃప్రదేశే తు కాపిలం లింగముత్తమమ్ ।
పాతాలే పూజితం పూర్వం కపిలేన మహాత్మనా ॥ ५
తతశ్చిత్కారణాత్తత్తు లింగం పరమపావనమ్ ।
భిత్త్వా తు ధరణీం తస్మాన్నిర్గతం పూజితం సురైః ॥ ६

తల్లింగం స్థాపితం భూమౌ ప్రార్థితం సర్వదైవతైః ।
తదగ్రే భువనముద్భిద్య నిర్గతా కపిలా పురా ॥ ౭
తద్బిలం కాపిలం తీర్థం సర్వపాపప్రణాశనమ్ ।
తదూర్ధ్వదేశే శక్రస్య తీర్థం పరమపావనమ్ ॥ ౮
అహల్యాసంగసంభూతశాపమోక్షస్తు యత్ర తత్ ।
విష్వక్సేనసరస్తస్మాదూర్ధ్వం పుణ్యవివర్ధనమ్ ॥ ౯
వరుణస్యాత్మజో యత్ర తపః కృత్వా సుదుస్తరమ్ ।
సారూప్యం చ హరేః ప్రాప్య సేనాపత్యమవాప హి ॥ ౧౦
పంచాయుధానాం తీర్థాని తదూర్ధ్వే భాన్తి సత్తమాః ।
తదూర్ధ్వమగ్నికుండం స్యాద్దురారోహముపర్యతః ॥ ౧౧
బ్రహ్మతీర్థం మహాహత్యామోచనం పుణ్యవర్ధనమ్ ।
మునీనాం చైవ సప్తానాం పుణ్యతీర్థాని సన్త్యతః ॥ ౧౨
దశాధికఫలం తేషాం తీర్థానాముత్తరోత్తరమ్ ।
ఏతేషాం చైవ మాహాత్మ్యం మయా వక్తుం న శక్యతే ॥ ** ౧౩
తిస్రః కోట్యర్ధకోటీ చ తీర్థాని భువనత్రయే ।
తేషాం ప్రకృతిభూతాని తీర్థాన్యస్మిన్ హరేర్గిరౌ ॥ ౧౯
భూమిప్రదక్షిణే వాంఛా యద్యస్తి మునిసత్తమాః ।
సర్వతీర్థమయం సర్వపుణ్యక్షేత్రమయం గిరిమ్ ॥ ౨౦
వేంకటాహ్వం నరో గత్వా కుర్యాత్తస్య ప్రదక్షిణమ్ ।
భూమిప్రదక్షిణే పుణ్యం యత్తత్పుణ్యమవాప్నుయాత్" ॥ ౨౧

— వారాహపురాణము ౧-వ భాగము, ౪౦-వ అధ్యాయము.

ఈ సందర్భముననే ఒకానొక విప్రుడు తీర్థయాత్రకుబోవనుద్యుక్తుడై యుండ నాతనియందు కరుణించి భగవానుడు భూమండలమందలి సమస్తతీర్థములందు స్నానముచేసినఫలమిూ వేంకటాద్రియందలి పైజెప్పిన పదునేడు తీర్థములందు స్నానముచేసిన మాత్రమున లభించునని చెప్పగా ఆతడట్లుచేసి ఫలమొందిన చరిత్రము కలదు.

ఇట్లు బలరాముడు భూమండలమందలి తీర్థములన్నిటిలో మునుగుట కుద్యమించి శ్రీ వేంకటాద్రిని దర్శించిన మాత్రమున తా నుద్యమించిన సకలతీర్థ స్నానఫలమునొంది కృతకృత్యుడైన విధమును పాండవు లజ్ఞాతవాసమున వేంక టాద్రికేగి పుణ్యతీర్థములందు స్నానముజేయుటచే, యుద్ధమందు జయమందిన రీతియు ప్రశంసింపబడియున్నది.

వామనపురాణ త్రయోవింశాధ్యాయమున కపిలతీర్థప్రవృత్తి నిమిత్తము విస్తారముగ ప్రశంసింపబడినది. ఈ చరిత్రము చతుర్ముఖునిచే పూర్వము దుర్వా సునకు చెప్పబడిన రీతిని శంకరుడు పార్వతి కుపదేశించినట్లు కలదు.

అచ్చటి కథ ఇది. పూర్వకాలమందు కపిలమహర్షిచే శివలింగము పూజింపబడుచుండెను. అయ్యది కామధేనువుచే క్షీరములచే యభిషేకింపబడి భూమిని భేదించి పాతాలమునుండి పైకి వచ్చెను. సురభి కోపించుకొని యది పెరిగిపోకుండ లింగముయొక్క శిరస్సును తన డెక్కలతో అణచివైచెను. ఆ చిహ్న మిప్పుడును కలదు. ఈ లింగరూపము మూలమున రజితవర్ణముగను మధ్యభాగమున స్వర్ణవర్ణముగను ఊర్ధ్వభాగమున నరుణవర్ణముగను నుండును. కృతయుగమున నీ లింగమూర్తికి కపిలఋషి పూజించునప్పుడు కపిలేశ్వరుడను నామము కల్గెను. త్రేతాయుగమం దగ్నిదేవునిచే పూజింపబడగా ఆగ్నేయ లింగమను పేరు కలిగెను. అనాద్యన్తమగు నీ లింగమును ద్వాపరయుగమందు మహాచక్రదేవుడు పూజించెను. అనియు చెప్పబడినది.

మరియు వామనపురాణ చతుర్వింశాధ్యాయమున కథ ఇట్లు కలదు. ఒకా నొకప్పుడు కుమారధారాతీర్థమందు తపంబొనరించుచుండిన కుమారుని జూచు టకై పార్వతీ పరమేశ్వరులు వేంకటాద్రికేగి యాతనిజూచి స్వామిని సందర్శించి కపిలసరోవరతీరమున చక్రత్తాళ్వారులచే పూజింపబడుచుండిన కపిలేశ్వరుని జూచిరి. అక్కడ తపంబాచరించిన సుదర్శన చక్రమునకు పరమశివుడు దర్శన మీయగా సుదర్శనుడు సంతసించి ప్రణతుడై నిలచెను. శివుడును ప్రసన్నుడై వరమును కోరుమని సుదర్శను ననుగ్రహింప సుదర్శనుడు సంతుష్టుడై పరమ శివుని సదా తన యంతరాత్మయందు వసించునట్లు వరమడిగెను. శివుడును ‘ నన్ను గురించి నీవు తపముచేయనక్కరలేదు. నీవు మహానుభావుడవు. మన

మిరువురము సమానులము. సకలాత్మలయందు అంతర్యామియై యుండగల్గుట శ్రీ మహావిష్ణునికి మాత్రమే అసాధారణము. నాబోటుల కాశక్తి లేదు. నీవును ఈ రహస్యము తెలిసియు నాయందుగల ప్రీతిచే నన్ను గౌరవపరచి నిట్లు పలికితివి. నీ వొకప్పుడు మహావిష్ణునిచే నా (శివుని) వలన ప్రసాదము నొందునట్లు కోరబడి నాకై తపంబాచరించి నన్ను వరమడుగుచున్నావు ఈ వృత్తాంతమును జ్ఞానదృష్టిచే నే నెరింగితిని. నాకును ఒక్క కోరిక కలదు. నీవు నా కోరికను తీర్పవలయును. శుద్ధసత్త్వమయంబును సర్వయజ్ఞస్వరూపమునగు శ్రీ మహావిష్ణుని దివ్యమంగలవిగ్రహమును తమోమయుడ నగు నేను సాక్షాత్తుగ స్పృశియించుట కర్హుడను కాను. నేను సర్వశరీరియగు నా మహావిష్ణుని శరీరమందు వసియింప నాశించుచున్నాను. అట్టి మహానుభావునకు నిత్యకింకరుడవై యుండుటచే నీ పురుషకారమును ఆశించి నీ శరీరద్వారముగ నేను భగవానుని సంబంధము ననుభవింతును. దీనిచే చిరకాలము నాకు కల కోరికెయు నీ కోరికెయు ఫలించును. కావున నీవు జ్వాలామాలావృతుడవై నీ హృదయ ప్రదేశమందు నాకు తావిమ్ము. నీవు వైష్ణవతేజస్సుచే పూర్ణుడవగుటచే నీయందు వసియించెడి నన్ను శివవిష్ణ్వాత్మకమగు పరబ్రహ్మముగ జనులారాధింతురు. అని కోరి శ్రీ సుదర్శనమహాచక్రమున నంతర్హితుడై శంభుడు ఇష్టార్థసిద్ధి నొందెను. ఆవల చక్రదేవుడు చక్రతీర్థమున కేగి తనయాశ్రమమున తపంబాచరించుచుండెను. అని చెప్పబడినది.

(చక్రతీర్థమాహాత్మ్యము) చక్రతీర్థమహిమను స్కాన్దపురాణ త్రయోదశాధ్యాయ మందిట్లు కలదు.

పూర్వకాలమందు శ్రీవత్సగోత్రసంభవుడగు పద్మనాభుడను బ్రాహ్మణుడు నియమయుక్తుడై చక్రతీర్థ తీరమందు గొప్ప తపస్సుచేయుచుండెను. ఇట్లు పండ్రెండు సంవత్సరముల కాలము ఇతరులకు సాధ్యముకాజాలని మహాతపస్సునుచేసెను. భగవానుడనుగ్రహించి శంఖచక్రగదాపాణియై యొకనాడు పద్మనాభునికి సాక్షాత్కరించెను. పద్మనాభుడు శ్రీ శ్రీనివాసుని దివ్యమంగలవిగ్రహమును తనివిదీర సేవించి యనేక విధములుగ స్తుతియించెను. భగవానుడాతని స్తోత్రముచే సంతుష్టుడై యాతనికి కల్పాన్తమువరకు చక్రతీర్థ తీరమందు

నాసముచేయు మహాభాగ్యము ననుగ్రహించి యంతర్హితుడాయెను. పద్మనాభుడు భగవన్నియమనప్రకార మచ్చటనే నివసించుచుండెను. ఇట్లు కొంత కాలముగడచిన వెనుక ఒక్కనాడు భయంకర స్వరూపుడగు నొక్కరాక్షసుడు క్షుధితుడై పద్మనాభుని మ్రింగుటకుద్యుక్తుడై యాతని తనచేత చిక్కించికొనెను. రాక్షసుని చేతులబడి బ్రాహ్మణుడు దుఃఖించి భగవానుని శరణమువేడెను. భక్త పరాధీనుడగు భగవానుడు రాక్షసుని సంహారించుటకు తన చక్రాయుధమును పంపెను. అనంతాదిత్యసంకాశమగు శ్రీ సుదర్శనచక్రమును జూచి భయపడి రాక్షసుడు పరువిడెను. రాక్షసునివెంటబడి సుదర్శనచక్రము అతని శిరమును ఛేదించగా బ్రాహ్మణుడా యాశ్చర్యమును జూచి సంతోషముతో సుదర్శనుని స్తుతించెను. బ్రాహ్మణస్తోత్ర సంతుష్టుడగు సుదర్శనదేవుడు పద్మనాభు నుద్దేశించి ‘ ఓ మహానుభావా ! ఈ చక్రతీర్థము మిక్కిలి పుణ్యతమమైనది. నేనీ తీర్థమునందు నివసించువాడను. నీకు రాక్షసునివలన గలిగిన యత్యాహితమును పరిహరించుటకై శ్రీ నాథునిచే నేను పంపబడి త్వరితుడనై వచ్చితిని. రాక్షసుడు సంహారింపబడినాడు. లోకసంరక్షణము నుద్దేశించి సతతము నేనీ తీర్థమునందు వసియింతును. నా సన్నిధానముచేతనే ఈ సరోవరము చక్రతీర్థమని పిలువబడుచున్నది. ఈ తీర్థమున స్నానముచేయువారలకు రాక్షసబాధ కలుగదు. వారలసంతతివారలును తీర్థమహిమచే పుణ్యలోకముల నొందుదురు. అని యున్నది.

అచ్చటి ప్రకృత శ్లోకములివి :—

‘ చక్రతీర్థే మహాపుణ్యే సర్వపాపహరే ద్విజ
సతతం లోకరక్షార్థం సన్నిధానం కరోమి తే ॥ ౪౩

అస్మిన్మత్సన్నిధానాత్తే తథాఽన్యేషామపి ద్విజ ।
ఇతః పరం న పీడా స్యాద్భూతరాక్షససంభవా ॥ ౪౪

అస్మిన్ మత్సన్నిధానాత్స్యాచ్చక్రతీర్థ మితి ప్రథా ।
స్నానం యేఽత్ర ప్రకుర్వన్తి చక్రతీర్థే విముక్తిదే ॥ ౪౫

తేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ వంశజాస్సర్వ ఏవ హి ।
విధూతపాపా యాస్యన్తి తద్విష్ణోః పరమం పదమ్’ ॥ ౪౬

— స్కాన్దపురాణము ౨౮-వ అధ్యాయము.

పై కథయందలి రాక్షసుని పూర్వవృత్తము యిరువదియైదవ యధ్యాయమందిట్లు చెప్పబడినది :—

పూర్వకాలమందు వీరబాహునికుమారుడగు సుందరుడను గంధర్వుడు కలడు. అతడొక్కనాడు నూర్వురుగంధర్వస్త్రీలతో కూడినవాడై శ్రీరంగమున కావేరీజలములందు వస్త్రములను వీడి నగ్నుడై స్నానము చేయుచుండెను. ఆసమయముననే దైవయోగమున మహర్షులతో గూడి వసిష్ఠమహామునీంద్రులు మాధ్యాహ్నికకృత్యముల నాచరించుటకై కావేరీనదికి పోయెను. మహర్షులను చూచి గంధర్వాంగనలు లజ్జాభరితలై తమతమ వస్త్రములను కప్పికొనిరి. సాహసియగు సుందరుడుమాత్రము మహర్షులయందు వినయము చూపక వివస్త్రుడుగనే యుండిపోయెను. వాని దుర్నయమునకు కినిసిన వసిష్ఠుడు సుందరుని రాక్షసుడగునట్లు శపించెను. ముని శాపహతుడగు భర్తనుగురించి యాతనిభార్యలు పరితప్తహృదయములతో మహర్షి ననునయముజేసి శాపాంతము ననుగ్రహింపగోరి పతిభిక్షమును వేడిరి. కరుణావశంవదుడగు మహర్షి కనికరించి తన శాపము సాంతముగ వ్యర్థము కాజాలదనియు పదునారు సంవత్సరముల కాలము తప్పక అతను శాపఫలముగ రాక్షసత్వము ననుభవించి తీరవలయుననియు ఆ పదునారు సంవత్సరముల వెనుక నాతడు యాదృచ్ఛికముగ శ్రీ వేంకటాచలమునకు పోయి చక్రతీర్థ తీరమున తపంబొనరించెడి పద్మనాభుడను మహానుభావుని బట్టబోవుననియు ఆ పద్మనాభుని రక్షించుటకై భగవానుడు తన సుదర్శనచక్రమును పంపగా చక్రముచే వధింపబడి యాతనికి శాపమోక్షము గల్గి తన స్వస్వరూపముతో మరల సుఖించుననియు చెప్పి స్వస్థానమున కేగెను. వెంటనే సుందరుడు భయంకరమగు రాక్షసరూపమును పొందగా స్త్రీలందరును భయమంది తమ నెలవుల కేగిరి. సుందరుడును రాక్షసవేషముతో శాపకాలమంతయు లోకమందు తిరిగి తిరిగి మహర్షిచెప్పిన చొప్పున శాపాంతసమయమున వాయువేగముతో వేంకటాద్రి కేగెను. పద్మనాభుని బట్టుకొని చక్రాయుధహతుడై రాక్షసరూపము వీడి గంధర్వుడు స్వస్వరూపము చెంది సుదర్శనమును వివిధముల స్తుతించెను.

సుదర్శనచక్రము శంకరునిగూర్చి తపంబు సేయుటకు గతము కూడ శ్రీ వామనపురాణమున ద్వావింశాధ్యాయమం దిట్లు చెప్పబడినది :—

స్కందుడు వేంకటాద్రియందు బ్రహ్మహత్యనుండి మోక్షమునకై కుమారధారయందు తపంబుసేయుటను వినినపార్వతి తన కుమారుని ప్రవృత్తిని గురించిన

భవిష్యత్తును ప్రశ్నింపగా పరమేశ్వరుడామె నాశ్వాసపరచినప్పుడీకథ చెప్పబడినది. 'ఓ పార్వతీ! పూర్వము దుర్వాసుని కృత్యానిమిత్తముగ నా రాజధానియగు వారాణసీపురము దగ్ధము చేయబడినది. కొంతకాలము నాయందనుగ్రహించిన భగవానుడు వరమును కోరుమనగా నేనాత్రముతో, ప్రభూ! నా వారాణసీ పట్టణమును దహించిన చక్రాయుధమును నా వశము నుండునట్లు వరమీయుమని యడిగితిని. విష్ణుదేవుడు నవ్వి తన హస్తముతో నా హస్తమును పట్టుకొని చక్రాయుధము తనకు అసాధారణమైన యాయుధమనియు అయ్యది తననువిడచి వేరొకచోట యుండజాలదనియు అసంభావితమగు వరమును కోరుటచే నయ్యది సఫలము కాదనియు అయినను వరప్రదుడగు తాను చెప్పినమాట వ్యర్థము కారాదు గనుక నిత్యానపాయియగు చక్రము తనకు(శంభునకు)లభించుమార్గము నొక్కదానిని చింతించెదననియు, ఒకానొక సమయమున కారణాన్తరముచే చతుర్ముఖునిచే సృజియింపబడినచక్రము భూలోకమందవతరించి అప్పుడు శంకరునివశమున నుండ గలదనియు ఇట్లు వేయి దివ్యవత్సరములాచక్రము శంకరునివశమున నుండియావల శంకరునిచే తనకు (భగవానునకు) సమర్పింపబడి నిజరూపమును చెందగలదనియు వరమిచ్చెను. ఈవిధమున సహస్రార్కసమప్రభమగు సుదర్శనచక్రము నాకు లభించగా త్రిపురసంహారకాల మందది శ్రీనాథునకు ప్రత్యర్పణము సేయబడినది. అసురసంహారమునకు మంత్రము నుపదేశించుటచే గురుదక్షిణగ శ్రీచక్రమూర్తిని నేను నా గురువగు విష్ణుదేవున కర్పించితిని. ఆనాటినుండియు నా సాన్నిధ్య విరహముచే చక్రదేవుడు శ్రీవేంకటాద్రియందు చక్రతీర్థమున తపంబాచరించు చున్నాడు' అని చెప్పబడినది. కపిలతీర్థమునకు ఆళ్వార్ తీర్థము అనగా చక్రత్తాళ్వార్ తీర్థము అను ప్రసిద్ధికి యిది కారణము.

(వజ్రతీర్థ మాహాత్మ్యము) :—

ఈకథకూడ పై అధ్యాయమందే పార్వతీపరమేశ్వరసంవాదరూపముగ నిట్లు చెప్పబడినది. 'ఓ పార్వతీ! పూర్వమొకప్పుడు గౌతమపత్నియగు నహల్యను ఆశపడిన హేతువుచే గౌతమునిచే శపింపబడిన ఇంద్రునకు శరీర మంతయు సహస్రయోనులతో కూడినదాయెను. ఇట్లు శరమవికారస్వరూపముతో దేహయాత్రను సాగించుటకు లజ్జించిన శచీపతి యొరులకంటబడకుండ వివిక్తమగు నొక కొలని యందలి తామరనాళముతో దాగుకొనెను. ఆకాలముననే దేవతలు

ఇంద్రుని జాడ తెలియక వెదకిరి. వెదకి వెదకి యెచ్చటను కానక శచీదేవియొద్దకు వచ్చి భర్తయొక్క యుదంతము నడిగిరి. ఆమెయు భర్తయొక్క గమనము తనకు తెలియదని చెప్పి దేవగురువగు బృహస్పతి కీ సమాచారము తెలియదగు నని చెప్పెను. దేవతలందరును బృహస్పతి సన్నిధానమున నీ వృత్తాంతము పృచ్ఛింప నాతడు యోగదృష్టిచే శక్రునిజాడ నెరింగి యాతడు హిమవత్పర్వత మందలి కొలనిలో పంకజనాళమందు డాగియున్నట్లు చెప్పి దేవతలు వెంటరాగా అందరును హిమవత్పర్వతమందలి సరోవరమునకు జేరిరి. ఇంద్రుని స్తుతియించుట కారంభించిరి. మధురములగు గీతవాద్యములతో స్తోత్రములను వినుచుండిన ఇంద్రుడు దేవతలు తన జాడనెరిగి తన దగ్గరకు వచ్చినట్లు తెలసికొని తన వికృత స్వరూపముతో వారలయెదుట బడెను. వంచిన తలతో గురుడగు బృహస్పతి పాదముల కొరగి 'ఓ మహాత్మా! దేవతల హితమును కోరి గౌతమ మహర్షికి తపోవిఘ్నము సేయుటకు యత్నించిన నాకీ శాపఫలము సంభవించినది' అని పొరలెను. బృహస్పతియు శిష్యుని పరితాపమును గుర్తించి దేవతల నుద్దేశించి ఇంద్రుని శరీరమందలి యోనిచిహ్నములు పురుషచిహ్నములుగ నగునట్లు ప్రార్థించు డని యాజ్ఞాపించెను. వారట్లు కోరగా వారు కోరినట్లు చిహ్నములు మారెను. దేవ సీమంతినులు ఇంద్రుని నూతనరూపమునుజూచి తమకు కలుగబోయెడి విశేష సుఖసాధనములకు ఆనందించిరి. వారల హర్షమును జూచి ఇంద్రుడును సంతుష్టుడై పరిజనములగూడి యమరావతిని ప్రవేశించెను. చిరకాల మప్సరో వర్గములతోగూడి సుఖియింపుచుండెను. ఈవిషయ సుఖమనుభవించినకొలదియు తనివిదీరక వృద్ధియగుటను చింతించి తుట్టతుదకు తన కేర్పడిన యీ నూతన చిహ్నములహింసనుండి మోక్షము జెందవలయునను నాత్రమాతనికి కలిగి నిరంత రముగ నందుకై వ్యథపడుచు తపస్సుచేసి యీ హింసనుండి విముక్తి జెందుటకై సంకల్పించి పైచెప్పిన విష్వక్సేన సరోవరమునకు క్రిందిభాగమున తన వజ్రాయు ధముచే గర్తమును త్రవ్వి తన యనుష్ఠానమునకును దేవపూజకును ఉదకము పాతాళమునుండి యుద్భవించునట్లు చేసెను. ఆ తీర్థమే వజ్రాయుధహతిచే సృజియించబడి వజ్రతీర్థమను పేర వ్యవహరింపబడుచున్నది. ఆ తీర్థతీరమున వేయిసంవత్సరములు కాలము నియమయుక్తుడై పాకశాసనుడు ఘోర తపంబు సేయగా భూమిరాట్టితో శ్రీ వరాహభగవానుడు అతనియెదుట సాక్షాత్కరించి

వరమును కోరుమనెను. ఇంద్రుడు భగవానునికి నమస్కరించి తనకు గల్గిన వికారరూపమును బోగొట్టి క్రొత్తగా యేర్పడిన వేయి పురుష చిహ్నములు అదృశ్యమగునట్లు చేసి యనుగ్రహింపుమని వేడెను. వరాహదేవు డట్లే యగుగాక యని వరమిచ్చి యంతర్హితుడాయెను. ఇంద్రుని శరీరమందుండిన వేయి పురుష చిహ్నములు క్రిందపడగా నయ్యవి తేజోమయములగు బ్రాహ్మణశరీరములై ఇంద్రు నుద్దేశించి 'ఓ బలసూదనా! మేము అధ్యయనపరులమగు బ్రాహ్మణులము. మాకు దేవలోకస్త్రీలను ఇంద్రాణిని అనుభవించవలయునను కోరిక కలిగి గౌతమ శాపవ్యాజమున నీ శరీరమందు పురుషచిహ్నములై యింతకాలము యథేచ్ఛముగ నీ శరీరసంబంధముచే మా కోరికలను అవారితముగ తీర్చికొంటిమి. మా యాశలను తీర్చిన నీకు మేము కృతజ్ఞులము. నీకు వరమొసంగెదము చెప్పవే' యనిరి. అందుకు ఇంద్రుడు ప్రీతుడై యా భూసురుల నుద్దేశించి యా చిహ్నముల పాతమువలన కలిగిన వ్రణములు సహస్ర చక్షువులుగ తన కుపకరించులాగున వరమీయుడని ప్రార్థింప వారట్లనుగ్రహింపగా శక్రుడు కృతకృత్యుడై సుఖించెను. అని చెప్పబడినది.

(విష్వక్సేన తీర్థ మాహాత్మ్యము) :—

ఈకథకూడ వామనపురాణత్రయోవింశాధ్యాయమందు పార్వతీపరమేశ్వర సంవాదరూపముగ నుపదేశింపబడినట్లు నారదునిచే చెప్పబడినది. పూర్వకాలమున కృతయుగమందు ఇంద్రుని పనుపున కుంతలయను నప్సరసాంగన దుర్వాసుని తపోభంగ మొనరించుటకై దుర్వాసాశ్రమమునకు వచ్చి ముని యెదుట శృంగారనృత్యము చేయగా మహర్షి కోపించి యామెను కిరాత వనితయై భూమియందు జనించునట్లు శపించెను. శాపభీతయగు కుంతలయు మహర్షి ననునయించి తాను ఇంద్రప్రేరణముచే పరవశయై ఈ సాహసమునకు పాల్పడుటంజేసి తనకు శాపాంతమును అనుగ్రహింపుమని వేడగా మహర్షి కరుణించి 'ఓ బాలా! నా శాపము వ్యర్థము కాకూడదు. ఐతే నీకొక కుమారుడు జన్మించినవెనుక తిరిగి నీ పూర్వదేహమును పొందగలవు' అని శాపాంతమును చెప్పెను. కుంతలయు నమ్రముఖియై తనకు కలిగెడి పుత్రుడు దీర్ఘాయువుగను తపస్సంపన్నుడుగను నగుగాక యని ప్రార్థించగా మహర్షి అట్లే యగునని వరమిచ్చెను. శాపముగ్ధయగు కుంతలయు వీరబాహుడను కిరాతునికి పుత్రియై జన్మిం.

చెను. బిడ్డలులేని యా కిరాతదంపతులు యపరూప పుత్రికయందత్యంత స్నేహమున నుండిరి. ఆ బిడ్డసువర్చలయను పేరుతో క్రమక్రమముగ శుక్లపక్ష చంద్రునివలె పెరిగి పెద్దదయె యుక్తవయసురాగా యాయమ తండ్రియగు వీరబాహువు భద్రుడను నొక వరునకిచ్చి పరిణయము జేసెను. ఒకానొక ఫాల్గునమాస శుక్లపక్ష దినమం దామె ఋతుస్నాతయై నర్మదా నదియొడ్డున విహరించుచుండగా వరుణుడామెను జూచి మోహించి యామెను కలసి ప్రీతుడై వరమును కోరుమనెను. ఆయమ తనకు తనశాపాంతమును జేయుపుత్రు ననుగ్రహింపుమని కోరెను. వరుణదేవు డట్లు వరమిచ్చి యంతర్హితుడాయెను. అట్లే యాయమ సకల లక్షణపూర్ణుడగు కుమారుని గనెను. ఆ పుత్రునకు విష్వక్సేనుడను నామకరణము జేసిరి. ఆతని పదవయేటనే సువర్చల కాలధర్మము నొందెను. తండ్రియు నాతని విడువగా విష్వక్సేనుడు కాశ్యపు నాశ్రమమును జేరెను. కాశ్యపు డాతని నాదరించి సకలశాస్త్ర పారంగతుని జేసిపుచ్చెను. క్రమముగ నాతడు జ్ఞానోపపన్నుడై వృషభాచలమున కేగి పండ్రెండు సంవత్సరములు నియమయుక్తుడై తపముజేసి ఒకానొక యాశ్వయుజమాసమున పూర్వాషాఢానక్షత్రయుత పుణ్య దివసమున భగవానునివలన వరప్రసాదము నొంది శంఖచక్ర గదాపాణియై భగవత్సారూప్యమును విష్ణుసేనల కాధిపత్యమును పొంది పంచాయుధాశ్రమమునకు దిగువ భాగమున విష్వక్సేనాశ్రమమును జేరి కాలక్షేపము చేయుచుండెను. అని చెప్పబడినది.

పై చెప్పబడిన సప్తదశతీర్థములలో కాపిలతీర్థ స్నానకాలము లేక ముక్కోటి యను పర్వకాలమును వామనపురాణ మిట్లు చెప్పుచున్నది.

'త్రైలోక్యే సర్వతీర్థాని కార్తికే మాసి పర్వణి ।
మధ్యాహ్నే కాపిలే తీర్థే సాన్నిధ్యం యాన్తి పార్వతి ॥ ౫౦
తిష్ఠన్తి ప్రాణిరక్షార్థం మధ్యాహ్నే దశనాడికాః ।
తత్ర స్నాతాస్తు యే పాపాః పురుషా యోషితోఽమలే ॥ ౫౧
సర్వపాపవినిర్ముక్తా బ్రహ్మలోకం ప్రయాన్తి వై '

— ౨౩-వ అధ్యాయము

కార్తికమాస పూర్ణిమదివస మీ తీర్థస్నానమునకు ప్రశస్తము.

32–36. పంచతీర్థమాహాత్మ్యము :—

ఈకథ వామనపురాణ త్రింశాధ్యాయమున జనకునకు వామదేవుడుపదేశించినట్లు కలదు.

‘ కాపిలం నామ యత్తీర్థం తస్య పశ్చిమభాగతః ।
పంచతీర్థమితి ఖ్యాతం పావనం పుణ్యవర్ధనమ్ ॥ ౧౩

విప్రక్షత్రియ విట్ఛూద్రా యే చాన్యాః పాపయోనయః ।
తేషాం క్రమేణ తీర్థాని పంచైతాని నరోత్తమ ॥ ౧౪

దేవాస్తత్ర తపస్యన్తి పంచజాత్యభిమానినః ।
వసన్తి కాపిలం లింగం పశ్యన్తః పరయా ముదా ॥ ౧౫

వరాహరూపిణం దేవమంజనాద్రినివాసినమ్ ।
అర్చయన్తః స్తువన్తశ్చ సదా తద్భావభావితాః ॥ ౧౬

ఉపరి ప్రథమం తీర్థం బ్రాహ్మణానాం శుభోదకమ్ ।
సద్యః సిద్ధికరం తేషాం స్నానదానజపాదిభిః ॥ ౧౭

తస్యాధస్తాన్మహాతీర్థం క్షత్రియాణామభీష్టదమ్ ।
అనన్తరం చ వైశ్యానాం తీర్థమాశుఫలప్రదమ్ ॥ ౧౮

తస్య త్వనన్తరం తీర్థం శూద్రాణామఘనాశనమ్ ।
చతుర్ణామప్యధస్తాత్తు చండాలానాం చ పాపినామ్ ॥ ౧౯

తీర్థం పర్వతమూలే తు సద్యః పాపనిబర్హణమ్ ।
వరాహరూపీ భగవాన్ విష్ణుర్భక్తానుకంపయా ॥ ౨౦

తేషు పంచసు తీర్థేషు సాన్నిధ్యం కురుతే సదా ।
వర్ణాశ్రమాణామాచారవైకల్యం నాశయత్యహో ॥ ౨౧

కపిలతీర్థమునకు పశ్చిమభాగమున విప్రతీర్థము, క్షత్రియతీర్థము, వైశ్యతీర్థము, శూద్రతీర్థము, చండాలతీర్థమునను నైదుతీర్థములు క్రమముగ నొకదాని దిగువున నొక్కటిగ చాతుర్వర్ణ్యములను పంచములను ఉద్దేశించి నిర్మింపబడియున్నవి. ఆ యాతీర్థముల యందా యావర్ణములవారు స్నానదాన జపా

ములజేసి తరింతురు. శ్రీ వరాహరూపియై భగవానుడా తీర్థములందు సన్నిధానము జెందివారల యభీష్టముల ననుగ్రహించుచున్నాడు. (తక్కిన నాలుగింటి యొక్క వివరమిప్పుడు తెలియవచ్చుటలేదు గాని మాల వాండ్లగుండ మనుపేరిట నేటికి కపిలతీర్థమునకు పశ్చిమభాగమున నొక తీర్థధారయు సరోవరమును ప్రసిద్ధమైయున్నవి).

37_45 ధనదాది నవతీర్థమాహాత్మ్యము :—

శ్రీ స్వామిపుష్కరిణిని చుట్టి క్రమముగ ప్రాగాదిగ మార్కండేయ తీర్థము, ఆగ్నేయతీర్థము, యమతీర్థము, వాసిష్ఠతీర్థము, ఋణమోచనతీర్థము, వాయుతీర్థము, కౌబేరతీర్థము, గాలవతీర్థమునను నెనిమిది తీర్థములును మధ్య భాగమున సరస్వతీతీర్థమును నిట్లు తొమ్మిది పుణ్యతీర్థములు కలవనియు నవనిధులని చెప్పబడు నీ తొమ్మిది తీర్థములందు స్నానముచేయుట పుణ్యమనియు బ్రహ్మ పురాణమందలి యష్టమాధ్యాయ మందుచెప్పబడినది.

అచ్చటి శ్లోకములివి :—

'ఉత్తరే ధనదం తీర్థం ధనదేన వినిర్మితమ్ ।
యత్ర స్నాత్వాఽఘనిర్ముక్తో ధనసంపదమాప్నుయాత్ ॥ ౩౪
ఐశాన్యాం గాలవం తీర్థం గాలవేన వినిర్మితమ్ ।
యత్ర స్నాత్వా చ పీత్వా చ భుక్తిం ముక్తిం చ విందతి ॥ ౩౫
మార్కండేయం పూర్వభాగే మార్కండేయేన నిర్మితమ్ ।
తత్ర స్నాన్తి నరా యే తు తేషామాయుః ప్రవర్ధతే ॥ ౩౬
అగ్నినా నిర్మితం తీర్థమాగ్నేయ్యాం పాపమోచనమ్ ।
దక్షిణే యమతీర్థం తు నరకోత్తారకారణమ్ ॥ ౩౭
వసిష్ఠనిర్మితం తీర్థం రాక్షసే త్వృణమోచనమ్ ।
వారుణే వాయుతీర్థం చ సద్యః కైవల్యదాయకమ్ ॥ ౩౮
మధ్యే సరస్వతీతీర్థం మహాపాతకనాశనమ్ ।
య ఏషు నవతీర్థేషు స్నానమేకదినే నరః ॥ ౩౯
కృత్వా పశ్యేచ్ఛ్రీనివాసం న పునర్జాయతే తు సః ।
స్వామిపుష్కరిణీస్నానం శ్రీనివాసస్య దర్శనమ్ ॥ ౪౦

సహస్రనామపఠనం నాత్యల్పతపసః ఫలమ్ ।
అస్నాతుర్నవతీర్థే తు వరాహం చాప్యపశ్యతః ॥ ౭౧
సర్వం నిష్ఫలతాం యాతి శ్రీనివాసో న తృప్యతి ’ ॥ ౭౨

ఉత్తరదిక్కున కుబేరునిచే నిర్మింపబడిన తీర్థమున స్నానము చేయువారలకు పాపములునశించి సకలసంపత్తులు కల్గును. ఈశాన్యభాగమున గాలవునిచే నిర్మింపబడిన గాలవతీర్థమున స్నానముచేయు వారలకు భుక్తి ముక్తులు నిరాఘాటముగ సిద్ధించును. పూర్వభాగమున మార్కండేయునిచే నిర్మింపబడిన తీర్థమందు స్నానముచేయువారలకు ఆయుర్వృద్ధి కలుగును. ఆగ్నేయదిక్కున నగ్నిచే నిర్మింపబడిన యగ్నితీర్థము పాపములను నశింపజేయును. దక్షిణమందు యమనిర్మితమగు యమతీర్థము నరకయాతనలబడకుండ కాపాడును. నైర్ఋతి దిక్కున వసిష్ఠునిచే నిర్మింపబడిన తీర్థమందు స్నానముచేయుటవలన మోక్షఫలము గల్గును. వరుణదిక్కున వరుణునిచే నిర్మింపబడిన తీర్థము దేవర్షి పితరుల ఋణమునుండి విముక్తిని కలుగజేయును. వాయుదిక్కున వాయుదేవునిచే నిర్మింపబడిన తీర్థము కైవల్యమునొసంగును. మధ్యభాగమందలి సరస్వతీ తీర్థము సర్వపాపములను నశింపజేయును. ఇట్లే నవతీర్థములందును స్నానము చేసిన తరువాతగాని శ్రీనివాసుని దర్శనముచేయరాదు. ఆ యా తీర్థములయందు స్నానముచేయునప్పుడా యా ప్రదేశముల మహిమమును తెలిసికొనియే స్నానమాచరించవలెను. అని చెప్పబడినది.

46_48. జరాహరాది తీర్థత్రయమాహాత్మ్యము :—

జరాహరము, వలిఘ్నము, రసాయనము నను మూడుతీర్థములు స్వామి పుష్కరిణికి పూర్వభాగమున యిరువది రెండు బాణపాతముల దూరమున కలవు. ఈ తీర్థములు భగవన్మాయచే తిరోహితములై యుండుటచే యెల్లరకును దృష్టిగోచరములు కాజాలవు. అని వరాహపురాణ ప్రథమభాగమందలి నలువదయధ్యాయమందు చెప్పబడినది.

అచ్చటి శ్లోకములివి :—

‘ జరాహరం వలిఘ్నం చ రసాయనమితి త్రికమ్ ।
తీర్థానాం వర్తతే తస్మింశ్చింతామణిగిరౌ తథా ॥ ౨౬

స్వామిపుష్కరిణీపూర్వదేశే పర్వతగహ్వరే ।
ద్వావింశచ్ఛరపాతే తు కిం తు మాయాతిరోహితమ్ ॥ ౨౮

న జానన్తి బుధాస్తీర్థం తత్తు విస్మయకారకమ్ ।
అష్టానాం నిధయస్సన్తి లోహానాం కనకాచలే ॥ ౨౯

యుగభేదేన దృశ్యన్తే నరాణాం పుణ్యకర్మణామ్ ।
వేంకటాద్రౌ పరాం భక్తిం వహన్ గచ్ఛతి చేద్గిరిమ్ ॥ ౩౦

పంగుర్జంఘాల ఏవ స్యాదచక్షుః పద్మలోచనః ।
మూకో వాచస్పతిస్తూర్ణం శ్రావీ తు బధిరో భవేత్ ॥ ౩౧

వంధ్యా తు బహుపుత్రా చ నిర్ధనస్సధనో భవేత్ ' ॥ ౩౨

జరాహరమనిన ముసలితనమును పోగొట్టునది. వలిఘ్నమనుకూడ ముసలితనమును పోగొట్టుటనే భంగ్యంతరముగ చెప్పుచున్నది. రసాయనమనిన దేహము నీరోగముగ దృఢమై కామభోగములను నిర్వాణసుఖమును అనుభవించుటకు తగు యోగ్యతకలిగిన ఔషధమువలె యుపకరించునదని చెప్పవచ్చును. మానవునకు జరయనునది సమస్త విధములుగను అసహ్యమైనది. శరీర మొకనాడు జరకెర కాక తప్పదు. జర మరణమునకు సన్నిహితసోపానము. జరను జయించుట సాధారణముగ ప్రాకృతులగు జనులకు సాధ్యముకానిది. అకృతాత్ములగువారలకును కృతాత్ములగువారలకును జరనుజయించుట పరమోద్దేశ్యము. అట్టి జరను తచ్చిహ్నములగు వలీపతనము మొదలగు ననర్థములను పోగొట్టి నిత్యయావనమును ప్రసాదింపగల సరోవరమునందు స్నానమెవ్వరి కుద్దేశ్యము కాకుండును ? జరను గురించిన ప్రాస్తావికము నిందు కొంచెము ముచ్చటించుట యవసరమని యెంచెదను. అవకాశమునుబట్టి ముందుపుటలలో వ్రాతును.

49. వ్రతతీవర్తనీతీర్థమాహాత్మ్యము —

' ....స్మయమానో మహామునిః ।
వ్రతతీవర్తనీతీర్థమాససాద మహామునిః ॥ ౫౧

తత్రాఘమర్షణం చక్రే సూక్తం వైష్ణవముచ్చరన్ ।
స్మరన్ భగవతో విష్ణోర్జిష్ణోర్ద్వైపాయనాత్మజః ॥ ౫౨

జలే మగ్నతనోస్తస్యోదభూద్వ్యాగశరీరిణీ ।
అమృతోదన్వదుత్తుంగ తరంగమహిమావలీ ॥ ౫౯
శ్రీవత్సవక్షా నిత్యశ్రీరదృశ్యశ్చ మలాత్మనామ్ ।
అనన్తభోగాయతనోఽనన్తోఽనన్తఫలప్రదః' ॥ ౬౦

పాద్మపురాణము ౨౮. వ అధ్యాయము.

శుకబ్రహ్మర్షి వేంకటాచల మందలి తీర్థములందు స్నానము చేయుచు ఆకాశగంగకు సమీపమున ప్రతతీవర్తని యనునొక తీర్థమునకు విచ్చేసి అందు స్నానానుష్ఠానములను నిర్వర్తించుకొను నప్పుడు శ్రీనివాసుడు అశరీర వాగ్రూపముగ శుకబ్రహ్మర్షి నుద్దేశించి ఇచ్చటి కగ్నిదిగ్భాగమున నొకటిన్నర యోజనముల దూరమున వేంకటాద్రి పాదమూలమున సువర్ణముఖి నదియొద్దున పద్మసరోవరమను నొక్క సరస్సు కలదనియు ఆ పుణ్యదేశమున తపం బాచరింపు మనియు నానతిచ్చెనని కలదు. పద్మసరోవరము, శుకపురము, మహాలక్ష్మియవతారములకు మూలమగు శ్రీ శుకమహర్షి తపశ్చర్యకు ప్రతతీ వర్తనీ స్నానము అవ్యవహితపూర్వసాధనమైయుండుటను ఈ తీర్థమహిమముగ తెలియదగును. ఈ కథ దేవలునకు దేవదర్శనుడు చెప్పినట్లు పురాణము చెప్పుచున్నది.

50. కటాహతీర్థ మాహాత్మ్యము :—

శ్రీనారదః :— 'శృణుధ్వమృషస్సర్వే శౌనకాద్యా మహాజనః ।
కటాహతీర్థమాహాత్మ్యం కో వేత్తి భువనత్రయే ।
మహాదేవో విజానాతి తస్య తీర్థస్య వైభవమ్ ॥ ౯
యాని కాని చ పుణ్యాని బ్రహ్మాండాన్తర్గతాని చ ।
తాని గంగాదితీర్థాని స్వపాపపరిశుద్ధయే ॥ ౧౦
కటాహతీర్థే సేవాం చ కుర్వన్తి మునిసత్తమాః ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః శూద్రాశ్చేతరజాతయః ॥ ౧౧
స్పృశంతి తజ్జలమితి న పిబేద్యో విమూఢధీః ।
స హి చండాలతాం ప్రాప్య కుంభీపాకే పతిష్యతి ॥ ౧౨
బ్రహ్మచారీ గృహస్థో వా వానప్రస్థో యతీశ్వరః ।
సేవయా తస్య తీర్థస్య ప్రాప్నోతి పరమం పదమ్ ॥ ౧౩

శ్రుతిస్మృతిపురాణేషు తస్య తీర్థప్రశంసనమ్ ।
బహుధా వర్ణ్యతే పంచమహాపాతకనాశనమ్ '॥ ౧౪

— స్కాందపురాణము ౨-వ భాగము ౩౭-వ అధ్యాయము.

కటాహతీర్థమును తొట్టితీర్థమని వ్యవహరింతురు. ఇయ్యది

'తస్య వేంకటనాథస్య హ్యాలయస్య తథోత్తరే ।
కటాహతీర్థం విప్రేంద్ర వర్తతే మంగళప్రదమ్ '॥ ౮౧

అని ఈ యధ్యాయమందే చెప్పబడినట్లు ఈ కటాహతీర్థము శ్రీ శ్రీనివాసప్రభుని యాలయమున ఉత్తరమున మహామండపపు భిత్తిని ఆశ్రయించియే యున్నది. మరియు, ఈ యధ్యాయమునందే

'ఇదం తీర్థం మహాపుణ్యం భగవత్పాదనిస్సృతమ్ ' ౧౮

అనునట్లు ఇయ్యది సాక్షాత్తుగ శ్రీనివాసుని శ్రీపాదములం దుద్భవించినదని చెప్పబడినది. ఈ తీర్థ మంతర్వాహినియై యుండుటచే ప్రతి శుక్రవారము భగవానుని యభిషేకోదకములచే పూరింపబడుచుండును. శ్రీవారి యాలయపు ప్రదక్షిణమును జేయుభక్తులు ఈ కటాహమందలి యుదకములను చేతితో నెత్తి శిరమున ప్రోక్షించుకొని లోనికి త్రాగుటయు సంప్రదాయము. ఇందు స్నానము చేయుటకు వసతియుండదు. సుమారు మూడడుగుల చదరపు ప్రదేశమగుటచే ఇందలి తీర్థము ప్రోక్షణమునకును లోనికి త్రాగుటకును మాత్రమే పర్యాప్తమైనది. ఇందు బ్రాహ్మణాది నాల్గు వర్ణముల వారును నాలు గాశ్రమముల వారును స్త్రీలును బిడ్డలునుగూడ యథేచ్ఛముగ తమంతటతా మీ తీర్థమును స్పృశించుదురు. తీర్థము పరిమితప్రమాణము గలదగుటచే ఇతరజలము లందువలె ఈ తీర్థమునకు స్పర్శాదోషము కలుగదనియు అట్లు స్పర్శదోషశంకను చెందరాదనియు పురాణము చెప్పుచున్నది. ఈ జలము సాక్షాత్తుగ భగవానుని తిరుమేని సంబంధము కల్గుటచే విశేషించి సర్వపాపము లనపనోదనము చేయగల శక్తి కలదనియు

'కుష్ఠాదిరోగయుక్తో యః ప్రత్యహం చ పిబేదిదమ్ ।
పాపరోగవిహీనస్సన్ విష్ణులోకం చ గచ్ఛతి '॥ ౧౯

అనునట్లు కుష్ఠరోగము మొదలగు పాపరోగములుకూడ తీర్థపానముచే నివృత్తము లగుననియు చెప్పబడినది. ఈ తీర్థమహిమమును గురించి సందేహపడెడి వారలకు మహాపాతకము గల్గుననియు అచ్చటనే చెప్పబడినది.

తీర్థపానక్రమము కూడ ఇట్లుపదేశింపబడినది.

'మంత్రేణాష్టాక్షరేణైవ పిబేత్ తీర్థం మనోహరమ్ ।
అథవా కేశవాద్యైశ్చ నామభిర్వా పిబేజ్జలమ్ ॥ 30

యద్వా నామత్రయేణాపి పిబేత్తీర్థం శుభప్రదమ్ ।
అహోస్విద్వేంకటేశస్య మంత్రేణాష్టాక్షరేణ వై ॥ 30

పిబేత్కటాహ తీర్థం తద్భుక్తిముక్తిప్రదాయకమ్ ।
వినామంత్రేణ యో విప్రస్సం పిబేత్తీర్థముత్తమమ్ ॥ 32

పాపం మే నాశయ క్షిప్రం జన్మాంతరకృతం మహత్ ।
ఇత్యుక్త్వా స పిబేన్నిత్యం మోక్షమార్గైకసాధనమ్ ॥ 33

స్వామిపుష్కరిణీస్నానం వరాహశ్రీశదర్శనమ్ ।
కటాహతీర్థపానం చ త్రయం త్రైలోక్యదుర్లభమ్ '॥ 34

— స్కాందపురాణము 32వ అధ్యాయము.

ప్రసిద్ధమగు తిరువష్టాక్షరమహామంత్రమునుగాని కేశవాదిద్వాదశ నామములనుగాని అచ్యుతానన్తగోవింద యనెడి నామత్రయమునుగాని శ్రీ వేంకటేశాష్టాక్షరమహామంత్రమునుగాని ఉచ్చారణము సేయుచు కటాహ తీర్థమును పానము చేయవలయును. పై మంత్రములనుచ్చరించుటకు యోగ్యత లేనివారలు మంత్రము నుచ్చరించకనే 'ఓ తీర్థరాజమా! నీ పుణ్యోదకములచే నా జన్మాంతర కృతములగు పాపములను సైతము శమింపజేయుము' అని స్మరించుచు తీర్థపానము చేయునది. స్వామిపుష్కరిణీస్నానము, వరాహదేవుని దర్శనము, కటాహతీర్థ పానము నను నీ మూడును త్రైలోక్యదుర్లభములు అని చెప్పబడినది.

ఈ తీర్థమహిమకు చెప్పెడి యొక యాఖ్యానముకూడ నిచ్చటనే చెప్ప బడినది. ఆ కథ ఇది.

పూర్వము తుంగభద్రా నదీతీరమందు వేదాఢ్యమగు నొక సంపన్నమగు నగ్రహారము కలదు. సకలశాస్త్ర పారంగతులగు బ్రహ్మవేత్త లిందు వాసము చేయుచుండిరి. ఆ యగ్రహారమున పద్మనాభుడను నొక మహనీయునకు కేశవుడను కుమారుడుండెను. అతడు స్వకులాచారమును వీడి దైవయోగమున దుర్వ్యసనములకులోనై మాతాపితరులను, పతివ్రతయగు భార్యను త్యజించి వేశ్యాలంపటుడై తిరుగుచుండెను.

ద్రవ్యసంపాదనమునకై దొంగలగు కిరాతులతో చేరి తిరుగుట కలవడి యొక్కనా డొక బ్రాహ్మణునియింట ప్రవేశించి ఆ బ్రాహ్మణుని వధించి ఆ యింటియందలి ద్రవ్యమునంతను దొంగిలించి తెచ్చెను. మార్గమందే వానిని బ్రాహ్మణవధచే కల్గిన బ్రహ్మహత్యాపాతకము వెంటనంటి హింసింపగా కేశవుడు భయభ్రాంతుడై దేశదేశముల బరువిడి శరణముగానక స్వగ్రామమునకు మరలి తన తండ్రిగృహమునకు వచ్చెను. వెంటవచ్చెడి బ్రహ్మహత్యయు కేశవుని తండ్రియగు పద్మనాభుని బెదిరించుచు 'ఓయీ బ్రాహ్మణా! ఈ దుర్మార్గుడు మహాపాతకి యగుటచే నే నీతని వెంటనంటి వీని కశాంతిని కల్పించితిని. పుత్ర ప్రేమచే నీ వీతని నాదరింపరాదు. అట్లు చేసితివేని నిన్ను నీ కుటుంబమునంతను భక్షింతును. వీనియందు కరుణించక విడచితివేని నీవు క్షేమపడెదవు. ఈ దుర్మార్గుని కాపాడనెంచి నీ కుటుంబమును నీవు నశింప జేసికొనకుము' అనెను. హృదయ విదారకములగు నీ వాక్యములను వినుచుండిన పద్మనాభుడు దుఃఖించి పుత్రవాత్సల్యముచే బ్రహ్మహత్య ననునయించి పుత్రభిక్ష బెట్టుమని ప్రార్థించగా బ్రహ్మహత్యయు పద్మనాభుని వారించి యాతడు చూచుచుండగనే కేశవుని నొక్క చరుపు చరిచెను. కేశవుడు ప్రహారమునకు చకితుడై దుఃఖించగా తలిదండ్రులును భార్యయు నాతని దురవస్థకు వగచిరి. అదే సమయమున దైవ వశముగ నాచోటునకు భరద్వాజముని విజయముసేయగా పద్మనాభుడు పుత్ర రక్షణముకై మునిని శరణమొందెను. ఈ పుత్రుని వలననే తాను తరింపవలసి యుండుటచే వీనిని బ్రహ్మహత్యనుండి కాపాడి యాతడు వంశకరుడుగ వర్ధిల్లు నట్లనుగ్రహింప వేడెను. భరద్వాజుడును ధ్యానయోగముచే చింతించి కేశవుని పాపములకు ప్రాయశ్చిత్తము ధర్మశాస్త్రము లందు నిర్ణయింపలేదని తెలిసికొని శ్రీ వేంకటాచలమందలి కటాహతీర్థపాన మొక్కటి మాత్రమే ఇట్టి పాతకికి

కర్తవ్యమని నిశ్చయించి పద్మనాభుని కా ప్రకారమునుపదేశించెను. పద్మనాభుడు మహాప్రసాదమని సంతోషించి కుమారుడు వెంటరాగా శ్రీ వేంకటాద్రి కేగి ఉభయులును శ్రీ వరాహుని సేవించి శ్రీనివాసుని సన్నిధియందలి కటాహతీర్థమును ద్రావిరి. ఉత్తర క్షణముననే బ్రహ్మహత్య తొలగిపోగా వారలు బ్రహ్మానందముతో శ్రీనివాసుని సన్నిధికేగి శ్రీనాథుని దర్శించి కృతకృత్యులైరి. భగవానుడును వారలకు ప్రత్యక్షమై కటాహతీర్థ మాహాత్మ్యమును స్వయముగ ప్రశంసించి యంతర్ధానమొందెను. అని చెప్పబడినది.

అచ్చటి భగవద్వాక్యము లిట్లున్నవి.

'పద్మనాభ మహాబుద్ధే వేదవేదాంతపారగ ।
భరద్వాజస్య వాక్యేన ప్రాప్య వేంకటపర్వతమ్ ॥ ౭౯
కటాహతీర్థం త్వం పీత్వా కృతార్థోఽసి న సంశయః ।
తవ పుత్రః కేశవాఖ్యో విముక్తో బ్రహ్మహత్యయా ॥ ౮౦
తస్మాత్కటాహతీర్థం తు సేవనీయం ప్రయత్నతః ।
తస్మిం స్తీర్థే మహాభాగ పీత్వా జలమనుత్తమమ్ ॥ ౮౧
పాపినోఽపి కృతార్థాస్స్యుః సత్యం సత్యం న సంశయః ।
మామకం లోకమాగత్య సుఖీభవ మహామతే ॥ ౮౨
ఇత్యుక్త్వా వేంకటేశోఽసావన్తర్ధానం గత స్తతః' । ౮౩

ఈ కథ సూతశౌనకసంవాదరూపముగ చెప్పబడినది.

వేంకటాద్రి ప్రభావ వర్ణనమందు ప్రాయికముగ సువర్ణముఖరీ నదియొక్క ప్రస్తావము చెప్పబడుచున్నది. పుణ్యక్షేత్రమున నదిలేకుండుట యొక్క కొఱతగా భావింపబడినట్లును, వేంకటాచల పరిసరములను పుణ్యతమముల జేయుట కచ్చట నొక్క నదిని ప్రవర్తింప చేయుమనియు అగస్త్యున కాకాశవాణి యానతీయగా మహానుభావుడగు నగస్త్యుడు తన తపోమహిమచే స్వర్ణముఖీనదిని ప్రవర్తింప చేసినట్లు స్కాన్దపురాణము చెప్పుచున్నది. పుణ్యనదియగు సువర్ణముఖి కూడ వేంకటాద్రిని సందర్శించెడి భక్తులకు ఉద్దేశ్యమైయుండు నని శ్రీ వేంకటాచల మాహాత్మ్యమందు చెప్పబడుటచే ఆ నదిమహిమమును తత్తీరమందలి పద్మ

సరోవరము మొదలగు సరోవరములయొక్క మహిమను సంగ్రహముగ నిచ్చట వ్రాయవలసివచ్చినది.

51. సువర్ణముఖీమాహాత్మ్యము:—

పాండవు లజ్ఞాతవాస ముండిన కాలమున నవాంతరముగ నర్జునుడు ప్రాయశ్చిత్తార్థమై తీర్థయాత్రకు బోవవలసిన యవసర మేర్పడెను. అప్పుడాతడు దేశాటనముచేయుచు పుణ్యతీర్థములందు స్నానము చేయుచు ఒక్కసమయమున భరద్వాజుని ఆశ్రమమునకు చేరెను. ఆశ్రమమున కులపతియగు భరద్వాజుడు అర్జునున కాతిథ్యమిచ్చి యాదరించెను. అర్జునుడా యాశ్రమరామణీయకతకు ఆతిథ్యరీతికి ఆనందించి విశ్రాంతినున్న మహర్షి నుద్దేశించి అచ్చటి యాశ్రమమునకు ప్రాణమిచ్చెడి సువర్ణముఖరీనది చరిత్రమును చెప్పుమని భారద్వాజుని వినయావనతుడై ప్రార్థించెను. భరద్వాజు డర్జునుని వినయసంపదకు మెచ్చి యాతని గారవించి సువర్ణముఖరీమహిమ నిట్లు చెప్పెను. ఆ వివర మిట్లున్నది.

పూర్వము దాక్షాయణీదేవి దక్షునిచే చులకనగా చూడబడి ఆశరీరమును అగ్నియందు త్యజించి ఉత్తరజన్మమందు హిమవత్పర్వతమునకు పుత్రికయై జన్మించెను. శివుని ప్రేరణమున సప్తర్షులు ప్రార్థించగా హిమవంతుడు తన పుత్రికయగు పార్వతిని పరమేశ్వరునికిచ్చి వివాహము చేయ నంగీకరించెను. శివుడును పార్వతిని పరిణయమాడుటకు హిమవత్పర్వత మందలి యోషధిప్రస్థమునకు వచ్చెను. శివశాసనమున ప్రపంచమందలి స్థావరజంగమప్రాణు లందరును వివాహమున కేతెంచిరి. ప్రపంచమంతయు హిమవత్పర్వతముపైకి రాగా భూమి ఉత్తరదిక్కునకు ఒరగెను. అందరును భయమునెందిరి. భక్తుల భయమునుజూచి కనికరించి మహేశ్వరుడగస్త్యమునీంద్రుని బిలచి 'ఉత్తరమునకు ఒరగిన భూమిని యెప్పటివలె సమీకరణము చేయుము. ఈ కార్యమును సాధించుటకు నీవే శక్తుడవు. ఇది యితరులకు సాధ్యముకానిది. నా వివాహమంగళమును అందరు భక్తులవలె నీవును ఇచ్చటనుండి సేవించుట న్యాయమే అయినను నీ విచ్చటనుండుటచే మనకు కావలసిన భూసమీకరణము సిద్ధించదు. నీవు దక్షిణదిక్కునకు బయలువెడలి పోయి అచ్చట నుండినయెడల భూమి యెప్పటివలె సమమగును. నీకు నా వివాహమును చూడలేదను కొరత కలుగకుండ నా వివాహవేషముతో నీవున్నచోటున నేను ప్రత్యక్షము కాగలను', అని

బుజ్జగించి పంపెను. అగస్త్యుడు దక్షిణాభిముఖముగ బయలువెడలి వింధ్యపర్వతమును అతిక్రమించి నంతనే భూమి యెప్పటివలె సమీకృతమాయెను. దేవతలు అగస్త్యుని కొనియాడిరి. అగస్త్యుడును దక్షిణ దిక్పునం దొక్కచోట రమ్యమగు పర్వతము కనుబడగా దాని రామణీయకతకు హృదయముకరిగి తానా పర్వతమందు ఆశ్రమ మేర్పరచికొని వసియింప నభిలషించెను. క్రమముగ నీపర్వతము అగస్త్య పర్వతమని ప్రసిద్ధిజెందెను. ఒకనాడు అగస్త్యుడు నిత్యకర్మలను నిర్వర్తించి పూజాగృహమునకు పోగా ఒక అశరీరవాక్కు వినబడెను. ' ఓ మునీంద్రా ! ఈ పుణ్యప్రదేశమందు నదిలేని కొరత యొక్కటి కలదు. నదీజలములు దేవ తిర్యఙ్మనుష్యు లందరకు జీవనాధారములైనవి. నీ వీప్రదేశమున నొక్క పుణ్య నదిని ప్రవర్తింపజేయుము ' అని ఆ యశరీర వాక్కును విని శివపూజను పూర్తి గావించికొని తనయనుభవము నగస్త్యుడు తనసహచరులగు నాశ్రమవాసులకువినిపించెను. మునులందరును అగస్త్యుని నభినందించి నదీప్రవర్తనము నందలి యావశ్యకతను ప్రశంసించి అగస్త్యుని కార్యోన్ముఖునిగ జేసిరి. నాటనుండియు తపస్సంకల్పము చేసి యగస్త్యుడు ఘోరమగు తపమాచరించెను. మహర్షితపస్సుచే లోకములన్నియు తపించి దేవతలందరును చతుర్ముఖునికి నివేదింపగా చతురాననుడు త్వరితగతిని కుంభభవునెదుట సాన్నిధ్యమంది వరమును కోరుమని యడిగెను. అగస్త్యుడు తానుచేసిన నదీప్రవర్తన సంకల్పమును చెప్పి ఆ ప్రదేశమున నొక నదిని సృష్టింపుమని వేడెను. చతురాస్యుడు వల్లెయని వియద్గంగను స్మరింపగా గంగ ప్రత్యక్షమాయెను. గంగనుద్దేశించి మహర్షి కోరిన ప్రదేశమున నతని యాశయముమేరకొక్క నదిని ప్రవర్తింపజేయుమని యాతడు గంగ కాజ్ఞ యిచ్చెను. గంగయు మహర్షియెదుట నిలచి ఏయే ప్రదేశమున నా నది ప్రవహింపవలయునో తెలియజెప్పుమని యడుగగా అగస్త్యుడు ముందు నడువగా యాతని వెనుకనే గంగ ప్రవహించెను. దేవతలు మనుష్యులు అందరును ఆ పుణ్య జలములజూచి యానందించిరి. నది యవతరించిన శుభసమయమున బ్రహ్మచే ప్రేరితుడైన వాయుదేవుడు ఆ నదికి సువర్ణముఖరి యని నామకరణము చేసెను. బంగారువలె లోకులకు మహాభాగ్యలబ్ధమై యగస్త్యమునిచే భూనభోంతరాళములందు దివ్యనాదములతో మ్రోగుచు తేబడినదగుటచే నది కీ పేరు సార్థకమై యుండునని వాయుదేవుడు పలికెను.

వాయుః ‘సువర్ణమివ లోకానాం భాగధేయాదియం నదీ ।
సీతా భువమగస్త్యేన ముఖరీకృతదిఙ్ముఖా ॥ ౬
తస్మాద్యాస్యతి విఖ్యాతిం సర్వలోకాభినందితామ్ ।
సువర్ణముఖరీ నామ్నా ధామ్నా కైవల్యసంపదః ’ ॥ ౭

మరియు ‘అగస్త్యశైలాత్సమవాప్తజన్మా సీతా భువం కుంభసముద్భవేన ।
ప్రశస్తతీర్థౌఘవిరాజమానా సమాయయౌ దక్షిణవారిరాశిమ్ ’ ॥ ౧౯

స్కాందపురాణము ౫-వ అధ్యాయము.

అనునట్లు సువర్ణముఖీనది యగస్త్యపర్వత మందవతరించి యగస్త్యునిచే భూభాగమున ప్రవహింపజేయబడి దక్షిణసముద్రమున గలసెనని చెప్పబడినది. మరియు

‘నిత్యం స్మరేన్నమస్కుర్యాత్కీర్తయేన్మనసాఽర్చయేత్ ।
శుద్ధిక్షేమశివాపేక్షీ సువర్ణముఖరీం శుభామ్ ॥ ౪౧
అగస్త్యాచలసంభూతాం దక్షిణోదధిగామినీమ్ ।
సమస్తపాపహన్త్రీం త్వాం సువర్ణముఖరీం శ్రయే ॥ ౪౨
మహాపాతకవిప్లుష్టం గాత్రం మమ తవోదకైః ।
క్షాలయామి జగద్ధాత్రి శ్రేయసా యోజయస్వ మామ్ ’ ॥ ౪౩

అను నీ మంత్రములను జపించుచు స్నానమాచరించవలెననియు సంక్రాంత్యాది పుణ్యదినములందు స్నానము విశేషఫలదమనియు కూడ నచ్చటనే చెప్పబడినది.

మరియు అగస్త్యోదయమను పుణ్యకాలమందు సువర్ణముఖరీ తీరమందు అగస్త్య ప్రతిమాదానము విశేషఫలప్రదమని కూడ చెప్పుచు ఆ దానకల్పము కూడ విస్తరించి చెప్పబడినది.

మరియు ఈ నదీతీరమున అగస్త్యతీర్థము ఆ తీర్థతీరమున నగస్త్యేశ్వరుడను శివభగవానుని మందిరమును కలదు. మకరసంక్రమణ పుణ్యకాలమందీ తీర్థస్నానము దేవుని దర్శనము ఫలప్రదములు. ఇట్లే ఈ సరోవరమున కీశాన్యభాగమందు దేవతీర్థము, ఋషితీర్థము, పితృతీర్థమునను మూడు సరస్సులు కలవు. దేవతలు ఋషులు పితరులు అగస్త్యునిచే యారాధింపబడి ఈ చోటులందు వరము లిచ్చుటచే వారల వారల పేరిట ఆ యా పేరులు ప్రసిద్ధిచెందినవి. ఈ ప్రదేశముకు రెండు యోజనముల దూరమున వేణియను నొకనది సువర్ణముఖరితో

కలియుచున్నది. అచ్చటకు యోజనచతుష్టయదూరమున నదికి ఉత్తర భాగమున మరియొక శివాలయ మగస్త్యేశ్వరునిది కలదు. కొంతదూరము ప్రవహించిన వెనుక *వ్యాఘ్రపదీతీరమున శంఖుడను మహర్షిచే ప్రతిష్ఠింపబడిన శంఖేశ్వరుని దివ్యాలయముకలదు. ఇదియు సేవింపదగినది. శ్రీ వేంకటాద్రియం దవతరించిన కల్యయను మరియొకనది సువర్ణముఖితో కలియుచున్నది. అచ్చట బ్రహ్మశిలయను నొక పుణ్యతీర్థము కలదు. అచ్చటికి ఒకటిన్నర యోజనముల దూరమున శ్రీ వేంకటాచలమున్నది. సాక్షాత్తుగ పరబ్రహ్మమగు శ్రీనివాసుని సాన్నిధ్యముచే సువర్ణముఖి మరింత పవిత్రమైనది.

52. పద్మసరోవరమాహాత్మ్యము :—

తొండమాను చక్రవర్తికి శ్రీ శుకులు పద్మసరోవరమహిమను నీ దిగువ రీతిగ చెప్పినట్లు వారాహపురాణ ద్వితీయభాగమందలి నవమాధ్యాయమం దిట్లు చెప్పబడినది.

శ్రీశుకః :—'పురా దుర్వాససశ్శాపాదవతీర్ణా సురాలయాత్ ।
పద్మా పద్మాక్షదయితా విష్ణునా సహితా నృప ॥ ౧౦
సరః కాంచనపద్మాఖ్యమిదం ప్రాప్య మహేశ్వరీ ।
తపశ్చకార వర్షాణాం దివ్యానామయుతం రమా ॥ ౧౧
తతో దేవా విచిన్వన్తః శ్రియం విష్ణుసమన్వితామ్ ।
పురందరేణ సంయుక్తా రాజన్నస్మింత్సరోవరే ॥ ౧౨
స్థితాం సువర్ణకమలే ప్రణమ్యాంబుజధారిణీమ్ ।
కృతాంజలిపుటాస్సర్వే తుష్టువుర్లోకమాతరమ్' ॥ ౧౩

పూర్వమొకప్పుడు దుర్వాసునిశాపముచే శ్రీ మహాలక్ష్మి స్వర్గమునుండి భూమికివచ్చి తన భర్తయగు మహావిష్ణునితోకూడ ఈ సరస్సునందుండి యనేక సంవత్సరములు తపముచేయుచుండెను. దేవతలు లక్ష్మినికానక తమసంపదలు క్షీణింపగా కమలాలయను వెదకికొని పద్మసరోవరమందు వారిని దర్శించి స్తోత్రముచేసిరనియున్నది. స్తోత్రముచే ప్రీతురాలైన మహాలక్ష్మి దేవతల నను గ్రహించి తనయావాసమగు నీ సరోవరమందు స్నానముచేయువారలు సకల సౌభాగ్యములతో తులదూగుదురని యానతిచ్చి శ్రీ మహావిష్ణునితో గరుడారూఢయై పరమపదమునకేగెనను నంశమీ శ్లోకములలో, చెప్పబడినది.

* వ్యాఘ్రపది యను వేరొక నది సువర్ణముఖితో కలసినది.

'ఇదం పద్మసరో దేవా యే కేచన నరా భువి ।
ప్రాప్య స్నానం కరిష్యన్తి మాం స్తుత్వా విష్ణువల్లభామ్ ॥ ౧౦౬
తేఽపి శ్రియం దీర్ఘమాయుః విద్యాం పుత్రాన్ సువర్చసః ।
లబ్ధ్వా భోగాంశ్చ భుక్త్వాఽన్తే నరా మోక్షమవాప్నుయుః ॥ ౧౦౭
ఇతి దత్వా వరం దేవీ దేవేన సహ విష్ణునా ।
ఆరుహ్య గరుడేశానం వైకుంఠస్థానమాయయౌ' ॥ ౧౦౮

వరాహపురాణము ౨-వ భాగము ౯-వ అధ్యాయము.

మరియు పాద్మపురాణమున పద్మసరోవరమాహాత్మ్యము చెప్పబడిన రీతి ఇట్లున్నది.

ఒకానొకప్పుడు మేరుశిఖరమందు చతుర్ముఖుని సదస్సునందు కథాసందర్భములో శ్రీ వేంకటాచలమాహాత్మ్యము మహర్షులకు విషయమాయెను. ఆప్రసంగములను ఆలకించినశుకబ్రహ్మర్షి పరమాదరముతో దక్షిణాభిముఖముగ ప్రయాణముచేసి శ్రీ వేంకటాద్రికేతెంచి అచ్చటి పుణ్యతీర్థములందుస్నాతుడై ప్రసన్నుడై యొకనాడు అనుష్ఠానముచేసికొనుచుండగా శ్రీనివాసుడశరీరవాక్కుగ ప్రత్యక్షించి

'అతో ఽస్మాదగ్నిదిగ్భాగే సార్ధయోజనమాత్రకే ।
అస్య సానుమతః పాదమూలే కూలంకషద్రుమే ॥ ౬౧
నద్యాః సద్యోఽఘనాశిన్యాః స్వర్ణముఖ్యాస్తటే శుభే ।
పద్మమిత్యుత్తరే ఖ్యాతం పవిత్రం పరమం సరిత్ ॥ ౬౨
తస్య గత్వా తటే తూర్ణమత్యుగ్రం తప ఆచర ।
పశ్చాదచంచలత్వం తే మనీషాయా భవిష్యతి ॥ ౬3
తదా స్యాద్భగవాన్ విష్ణుః ప్రత్యక్షస్సర్వసాక్షిభూః ।
ఏవం సాదరముక్త్వా వాగ్జరానాం శృణ్వతామపి ॥ ౬౪
ప్రతిఘోలయన్తి శమలం మునేర్యాతాఽశరీరిణీ' ।

అనునట్లు 'ఓ శుకమునీంద్రా! ఇచ్చటికి ఒకటిన్నర యోజనముల దూరమందు స్వర్ణముఖీనదీతీరమున పద్మసరోవరమను నొక్క కొలనుకలదు. ఆ కొలని తీరమందు నీవుతపముచేసినయెడల నీకు జ్ఞానోదయముమగును. శ్రీ నాథుని

సేవాభాగ్యము లభించు'నని చెప్పి యంతర్హితుడాయెను. ఆతడట్లు భగవన్ని దేశమును శిరసావహించి యాసరోవరముజేరి యాశ్రమము నిర్మించికొని అందు వసియించుచు తపంబాచరించెను. తపంబు నానాటికి వృద్ధికాగా లోకములన్నియు తల్లడిల్లెను. ఆతని తపోవిఘ్నమునకై ఇంద్రప్రేషితయగు రంభ శుకాశ్రమమున మునిని ప్రలోభింప తలంపడెను. రంభవ్యర్థ ప్రయత్నయై శాపభీతిచే దేవలోకమునకు మరలిపోయెను. శుకముని భగవదనుగ్రహమునకు తుష్టుడై మరింత పట్టుదలతో తపస్సుచేయగా శ్రీనివాసుడు సాక్షాత్కరించెను. శుకబ్రహ్మర్షి నూరడించి సశరీరముగ నీకు మోక్షము నొసంగితినని చెప్పి భగవాను డంతర్హితుడాయెను. శుకుడు బ్రహ్మానందభరితుడై సరోవర తీరముననచ్చటనే యాశ్రమ మందుండి భగవదారాధనము చేసికొనుచు సుఖ ముండెను. తరువాత ఆ సరోవరము ననుసరించి నూట యెనిమిది గృహములను నిర్మించి వానిని శ్రుతవృత్త సంపన్నులగు బ్రాహ్మణశ్రేష్ఠులకు దానమిచ్చి యచ్చటనే రామకృష్ణుల దివ్యార్చాబింబములను కూడ ప్రతిష్ఠించి తిరిగి శేష శైలమునకు వచ్చెను. శ్రీ స్వామిపుష్కరిణీతీరమున చిరకాలము తపము సేయగా శ్రీనివాసుడు సాక్షాత్కరించి యనుగ్రహింపగా శుకమహర్షి భగ వానుని ననేక విధముల స్తుతించి మేరుపర్వతమునకు పోయెను.

మరియు పాద్మపురాణ చతుస్త్రింశాధ్యాయమున పద్మసరోవరమాహా త్మ్యము భంగ్యంతరమున దేవదర్శునిచే దేవలున కుపదేశింపబడినది. ఆకథ ఇది.

త్రిమూర్తులలో తరతమభావమును పరీక్షింపబోయిన భృగువు శ్రీవైకుంఠ మున శ్రీ మహావిష్ణుని వక్షః ప్రదేశమును తనకాలితో తన్నగా లక్ష్మి కోపించి పాతాలలోకమునకు పోయెను. పాతాలమందు కపిలమునిచే చిరకాలమారా ధింపబడెను. లక్ష్మిరహితుడైన శ్రీనాథుడు భూమినీలలు పరిచర్యసేయగా భృగువుననునయించి పంపి నీలాదేవిని శ్రీవైకుంఠమున విడచి శ్రీదేవిని వెదకుటకై భూపిరాట్టి తనవెంటరాగా భూలోకమునకు వచ్చెను. సకల దేశములను తిరిగి తిరిగి తుదకు కొల్హాపురమందు అర్చావతారరూపిణియై యారాధింపబడుచున్న లక్ష్మిని చూచెను. ఈ యర్చాబింబము నచ్చట అగస్త్యుడు ప్రతిష్ఠించినట్లు విని సంతోషించి అచ్చట మహావిష్ణువు పదిసంవత్సరములు వేచియుండెను.

అట్లుండగా నొక్కనాడొక యశరీరవాక్కు భగవానునకు వినవచ్చెను. 'ఓ విష్ణుమూర్తీ అనుగ్రహింపుము. నీవు లక్ష్మిని పొందుటకై యాశపడుచున్నావు. దక్షిణదిక్కుగపోయిన కృష్ణానదికి దక్షిణమున యిరువది రెండు యోజనముల దూరమున సువర్ణముఖినది కలదు. ఆనదికి ఉత్తరతీరమున గునపముతో త్రవ్వి ఒకసరస్సునునిర్మించి ఆ సరస్తీరమున తపస్సుచేయుచు దేవలోకమునుండి బంగారు తామరపూలనుతెచ్చి యా సరస్సునపైరుచేసి యావల ఆనదీతీరోద్భవములైనట్టి పుణ్యపుష్పములతోను ఇతరపుష్పములతోను లక్ష్మినారాధించుము. ఏకాక్షర మంత్రమునుగాని సహస్రాక్షరమంత్రమునుగాని జపించుచు లక్ష్మిని పద్మములచే పూజించుచు పండ్రెండు సంవత్సరములచ్చట నుండుము. నీకు నీలక్ష్మి ప్రసన్నము కాగలదు'. అని యా యశరీరవాణి చెప్పినపలుకులు. విష్ణుమూర్తి యట్లు చేయ నారంభించెను. సరస్సును త్రవ్వి దేవలోకపద్మములనుతెచ్చి ఆసరస్సునందు పైరు చేసెను. ఆ కమలములు వికసింపచేయునట్లు శ్రీ సూర్యభగవానుని యర్చాబింబ మునుగూడ ప్రతిష్ఠింపించి ఆకాశవాణి చెప్పినట్లు నియమయుతుడై తపంబుసేయుచు లక్ష్మినారాధించెను. తపోభంగమునకై దేవతల ప్రయత్నములుకూడ యథా ప్రకారముజరిగి వ్యర్థములాయెను. ఇట్లు జరిగిన పండ్రెండు సంవత్సరముల యనంతరపు కార్తికమాస శుక్లపక్ష పంచమీ శుక్రవార శుభదినమున ఉత్తరా షాఢానక్షత్రమున మైత్రముహూర్తమందు పద్మసరోవర మధ్యమున నొక జ్యోతిస్సు కనుబడెను. ఆ తేజస్సునడుమ ప్రలయభానువువలె ప్రకాశమైనట్టియు బంగారువన్నె గలిగినట్టియు కమలములతో చేయబడినట్టియు రథమును ఆ రథము నడుమ సహస్రపత్రములతో గూడిన బంగారు పద్మమును ఆ పద్మముయొక్క కర్ణికామధ్యమందు సకలావయవసౌందర్య శాలినియగు శ్రీమహాలక్ష్మియు అవత రించెను. దేవదుందుభులుమ్రోగెను. తనచేత నొక కల్హారమాలనుధరించి ఆయమ సకలదేవతలు చూచుచుండగా ఆ మాలనుయెత్తి శ్రీ మహావిష్ణునికంఠము నందర్పించి భగవానునాలింగనము జేసికొని హరివక్షః పీఠమునలంకరించి లోక కల్యాణ సంధాయినియై వెలసెను. భగవానుడు సంతుష్టుడై పద్మసరోవరము నుద్దేశించి

'హే సరస్తవ తీరేఽస్మిన్ పద్మకాన్తస్య భాస్వతః।
తపః కుర్వన్నహం పద్మామూప్తవానస్మి శాశ్వతీమ్॥ ౧౦

తస్మాత్త్వమద్య ప్రభృతి పద్మవాపీతి నామతః।
పాద్మం పద్మసరశ్చేతి పద్మాప్రీతికరం భువి॥ ౧౧

త్రిలోకీహృదయం భూయాః హృద్దేశకమలాలయమ్ ।
ఇత్యుక్త్వా గరుడే శానమధిరుహ్య రమాసఖః ॥ ౮౨
భోగిరాజగిరిం గత్వా స్వామిపుష్కరిణీతటే ।
రమతే రమయైకాన్తే రమణీయే శ్రియః పతిః ' ॥ ౮౩

అనునట్లు ఆ సరస్సునకు పద్మసరోవరమనుపేరు ప్రసిద్ధమగునట్లు ఆనతిచ్చి శేషగిరికేగి సుఖముగానుండెను. ఆవెనుక నారదాదులు పద్మసరోవరమును పొగడి యా సరోవరమందు స్నానానుష్ఠానాదుల జేయువారలకు పాపనివృత్తియు సకల సుఖానుభవ పూర్వకముగ శ్రీవైకుంఠ ప్రాప్తియుకలుగునని వరమిచ్చిరి. సప్తర్షుల ప్రశంస ఇట్లు చెప్పబడినది.

నారదః :— ' యః పద్మసరసి స్నాతస్సప్తజన్మాఘనాశనే ।
శ్రియమాప్నోతి విపులాం శ్రియఃపతిరివామలః ' ॥ ౮౫

వసిష్ఠః :— ' రుక్మాబ్జసరసి స్నాతో రుక్మనద్యాస్తటోద్భవే ।
కోటిజన్మకృతైః పాపైర్ముచ్యతే శ్రియమాప్నుయాత్ ' ॥ ౮౬

మరీచిః :— ' సువర్ణముఖరీకూలే స్నాతః పద్మసరోవరే ।
మహాపాతకయుక్తో యస్స ముచ్యేతాంహసః క్షణాత్ ' ॥ ౮౭

అత్రిః :— ' అత్ర పద్మసరస్స్నాతో యో రుక్మతటినీతటే ।
సర్వపాపవినిర్ముక్తః శ్రియమాప్నోత్యసంశయః ' ॥ ౮౮

అంగిరాః :— ' భ్రష్టరాజ్యస్తు యో రాజా స్నాత్యస్మిన్ మండలం యమీ ।
పద్మాకరాఖ్యే సరసి స రాజ్యం ప్రాప్నుయాచ్ఛ్రియమ్ ' ॥ ౮౯

పులస్త్యః :— ' విప్రాః యః పద్మసరసి వ్రాత్యో మన్త్రివివర్జితః ।
సోఽపి పూతస్త్రిషవణాద్దినేనైకేన శుద్ధ్యతి ' ॥ ౯౦

పులహః :— ' వైశ్యో యో వంచనాజీవీ వ్యవహారవిశారదః ।
స పద్మసరసి స్నాత్వా పూతో భవతి ధార్మికః ' ॥ ౯౧

క్రతుః :— ' శూద్రస్స్వాచారవిభ్రష్టో దేవబ్రాహ్మణదూషకః ।
స పద్మసరసి స్నాత్వా పూతో వైశ్యో భవిష్యతి ' ॥ ౯౨

దేవదర్శనః :— ' ఇతి ప్రస్తూయ మునయో యయుస్తే స్వాశ్రమాన్మునే ।
ఉత్పత్తిః పద్మసరసస్తవోక్తా దేవలామల ' ॥ ౯౩

పాద్మపురాణము ౩౮-వ అధ్యాయము.

శ్రీ

"భాగవత సారము" అను
శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

2-వ శతకము — 1-వ దశకము

మాడభూషి. గోపాలాచార్యులు, బి. ఏ. తిరుపతి

ఈ దశకమున శ్రీ విష్ణుచిత్తులు తమ్ము యశోదగాను గోపికగాను నెంచుకొని తన కుమారుండై శ్రీకృష్ణస్వామి తమ్ముంజేరి "అప్పా! బూచ్చి! బూచ్చి!" అనుచు తనపైంబడి యడలించు ననుభవమును వర్ణించియున్నారు. అమ్మలను వేడ్కతో నున్నట్టులుండి తటాలున "బూచ్చి" యనుచు భయము కలిగించి వెంటనే బిడ్డను నెత్తుకొని యాలింగనాదులు చేయుచు "బూచ్చి" యని వేడుకకై తామన్నట్లు బిడ్డలకుం దెలియజేయులీలలు సర్వసాధారణముగదా. దానిని వీరనుభవించి యీ దశకంబున వర్ణించిరి

1

సీ॥ సంశ్లాఘ్యముగ మ్రోగు శంఖంబు డాకేల
బొంకంబులొలుకంగ బూనువాడు,
వంశనాళంబైన వరవేణువుం బూని
యంచితంబుగసూది యలరువాడు,
వంచనామతితోడ వరలిన జూదమం
దోడిపోయియుంజాల నోర్పుతోడ
వర్తించినట్టి యా పాండుపుత్రులకుంగాం
బదియూరులైనను బడయలేక.

ఆ. వె॥ భారత రణభూమిం బార్థసారథియయి
వెలసినట్టిదూత, వేడ్కమెఱయ
"బూచ్చి, బూచ్చి" యనుచుం బొడసూపి ననుజేరి
"అప్ప, బూచ్చి" యనుచు నడలుంగొలుపు.

2

సీ॥ గుట్టలన్ బోలిన గట్టిరెట్టలవారు
రణరంగవీరులు రాజవరులు
ప్రబలమహారథుల్ పలువురు ప్రభువులు
నతిపరాక్రమవంతుల తిరథులును
దుర్యోధనాదులా ధూర్తులు నూర్గురు
గడగడవణకంగ గాండీవమును
వంచియేసెడురీతిఁ బార్థుని బురికొల్ప
నతి దృఢతమమైన యతనిరథము

తే. గీ॥ నెక్కి సూతకృత్యముఁజేసి యెమ్మెలొలుకు
పంకజాక్షుండు పరముఁడు వచ్చి తన్ను
పొగడికొనుచునన్ జేరి "ఆ బూచ్చి" యనును
అమ్మ! బూచ్చి, బూచ్చి," యనుచు నడలుఁగొలుపు.

3

సీ॥ సర్పవిషంబుచే సలసలమనిక్రాగు
జలముల దూరంగదలఁచి వేగఁ
గడిమిచెట్టును నెక్కి కాళియున్ బడగపై
పాదంబుపడునట్లు పఱచి దూకి
గండపెండేరముల్ గణ గణమనిమ్రోగ
ఫణి ఫణాంతరమందు భవ్యపణితి
నర్తనంబునజాల వర్తించి వర్తించి
వేణుగానముఁజేసి వేడ్కమెఱసి

తే. గీ॥ విస్మయాత్మకుఁడై చాలవెలసివెలసి
మాయగొల్లఁడువేడ్క నామదికెఱంగ
వచ్చి "అప్పూచ్చి" యనుచునన్ వలపుగొలుపు
"అమ్మ యప్పూచ్చి" యనుచుఁ దానడలుఁగొలుపు.

4

సీ॥ అంధకారంబున నవతరించినవాఁడు
ప్రేపల్లెఁదాఁజేరి వెలయువాఁడు
తన్నుఁ జేరినవారుఁ దనబల్మిఁ గలవారు
దనయందుఁ బ్రేమచే వెలయువారు
పేదగొల్లతనాన బీరంబులాడంగ
వారివారించుచు, వంచకుఁడగు
కంసుండు వెంటనే కడతేరునట్లుగా
శిఖఁబట్టి దిగనీడ్చి వెలఁగి, చావ
తే. గీ॥ నవనిపైఁ బొరలించిన యతిశయుండు
నాడు నీరాడు మాయొక్క నాణ్యములగు
చీరలను హరించినవాఁడు చేరవచ్చి
"అమ్మ ఆ బూచ్చి" యని నన్ను నడలఁగొట్టు.

5

ఉ॥ ఎద్దులచేత నీడ్వబడి యేపునఁ బైఁబడివచ్చు బండినిన్
బ్రద్దలుకాఁగఁ దన్నిఘృత భక్షణచౌర్యమునందు మాతచే
వద్దని త్రాటఁ గట్టబడి బంధితుఁడై వగలొల్కు బిడ్డనన్
ముద్దుగఁ "బూచ్చిబూచ్చి" యని పొంకములొల్కఁగఁ జేరవచ్చెడిన్.

6

చ॥ మొలకలు మరుజాళాకృతులు, పొంకపుగిన్నెలు, లేతచన్నులన్
జెలఁగెడు దేవకీసతికి శ్రీపరిపూర్ణుఁడు బుట్టి గొల్లతై
వెలసెడు మేముగూర్చినవి వెన్నెను, నేతిని బాలమెక్కుచున్
మెలఁగెడు తండ్రి "బూచ్చి" యన్ని మించిన వేడ్కనన్ను బూచ్చిఁ జూపెడిన్.

7

చ॥ తనమదిరీతి వర్తిలెడు తల్లి యశోదకుఁ దత్తపుత్రుఁడో!
తనయుని సింగపున్ గొందమఁ జూడగ గర్భముఁ దాల్చి గాంచెనో!
అనయముఁ బువ్వుగుత్తులను నందము లొల్కెడు కుంతలాళితో
నను గసి వచ్చి "బూచ్చి" యను నాయదు సింహము గేలిఁ గొట్టుచున్.

8

సీ॥ ఏపుపైఁ జన్నొందు పెరిగి వెల్గునో
నాగ-బలమైన గూనుతో వరలునాతి
మంథర మాటల మదిగొప్పగా నెంచి,
కువలయోత్తుంగమై గొనబుమీఱు
నురు గజేంద్రంబుల నుత్తమాశ్వంబుల,
భూరి రాజ్యంబును, బొంగుసిరుల
నపుడు తానుండిన యాశ్రమావనిగూడ,
పరమవాత్సల్యంబు వరల వేగ
తే. గీ॥ భరతుని కొసంగి యటనుండి తరలి యుగ్ర
కాననాంతరవాసియై గ్రాలె నెవఁడు
నతఁడె యందంపు కనులతో నలరువాఁడు
"అప్ప అప్పూచ్చి" యని నన్ను నడలఁగొట్టుఁ.

9

వృషభగీతి :—

క్రూరమకరము నోటిలోఁబడి - ఘోరరోదన మాచరించుచు,
సారెకుఁ గరమెత్తి మ్రొక్కుచు - "సాకు, కృష్ణా" యనుచుఁబిలుచుచు
ఘోరమైన విపత్తులోఁబడి - కుందుగజమును బ్రోవ గరుడుని
జేరి మడుగునుజేరి వేగమె - భూరి దుఃఖముఁ దీర్చి భక్తుని
గారవించిన యుత్తముండగు - కంజనయనుఁడు స్వామి! కృష్ణుఁడు
జేరి నన్నని "బూచ్చి" యను, నను - జేరి "బూచ్చ"ను నప్ప కృష్ణుఁడు.

10

తే. గీ॥ బల్లిదుల లంక కూలంగ బాణములను
త్వరగ సంధించినట్టి సుధన్వుఁగూర్చి
విష్ణుచిత్తుండు పలికిన వీనిఁ జదువు
వారు వైకుంఠమందుండు వారలెపుడు.

3-వ శతకము 1-వ దశకము సంపూర్ణము.

"భాగవతసారము" అను
శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

2-వ శతకము — 2-వ దశకము

ఈ దశకమున శ్రీ విష్ణుచిత్తులు తన్ను యశోద మాతగాను కృష్ణుఁడు తనయుఁడుగాను నారోపించుకొని, దీర్ఘకాలము చనుగుడువక నిద్రబోవుబిడ్డను లేపి చనుగుడుప నుద్యమించిన భావోద్రేకమును వివరించియున్నారు.

1

సీ॥ అహిశయ్య నిదురించు యదువంశ వృషభమా!
మేలుకో చనుగ్రోలం మేలుకొనుము
నిన్నరాతిరిగూడ చన్నుగుడ్వగలేదు
మిట్టమధ్యాహ్నంబు నేఁటిమీఁతె,
ఇంకను నీరాక కెదురుజూచుచునుంటి
నేల మేల్కొనవో కో నేనెటులుంగ,
పొంకంబు దొరఁగి నీబొజ్జవాడెనుగాదె,
పొంగారు చనుబాలు పొర్లునట్లు

తే. గీ॥ సుస్తనంబులపైన నీనోంపులోలుకు
చిన్నినోటిని జక్కఁగాఁ జేర్చినీవు
పాలుగ్రోలెదు నానందపరవశమునఁ
గాలదన్నుచు గ్రోలుమా కడుపునిండ.

2

ఉ॥ పెట్టినక్షీరముకే దధియు, వెన్నయు, నెయ్యియుఁగొంచెమేని, నీ
పుట్టిన నాటఁగోలెఁగన - బుద్ధికిఁ దోచిన నీదుచేష్టలం
జెట్టివిధమైననే నయితు - నేలరకోపము, సామి, ముత్యముల్
పుట్టెడు చిన్ని నవ్వ్వాలయ ముక్కున జుట్టుచుఁ జన్నుగ్రోలుమా.

3

చ॥ తమతమ బిడ్డలేడ్చుకొని తల్లులచెంతకుఁ బోవ, వారలుఁ గా
తమకముమీఱ నాపయికి దాడియొనర్తురి దెట్టులోర్తు ! తాఁ
గొమరునిచేష్టలారయదు, కోపముచేయ దటంద్రునందమై
యమరితివయ్య నందునికి నాత్మజుఁడై యికఁ జన్నుఁగ్రోలుచూ !

4

సీ। అమరుల తలమిన్న ! అతి వంచకుండైన
కంసుండు పంపగాఁ గపటమెసఁగ
వచ్చిన శకటంబు వ్రయ్యలై పోవంగఁ
దాడనమొనరించు తరుణమందుఁ
బ్రత్తిఁ బోలెడు చాలమెత్తని నీపాద
మెంత నొచ్చెనో యంచుఁ జింతపడితి
యాదవకులమెల్ల నడలిపోయెను-గాని
పడెనొకో నా పడ్డపాట్లనదియు.
ఆ. వె॥ కంసుఁడెట్లు మున్ను కపటంబునెఱపెనో
యటులె నీవుఁ గూడ నతని దేసను
కపటలీల నెఱపి కడతేర్చితివి వాని,
చాలు పాలుగ్రోల సామి ! రాధ !

5

సీ॥ దుర్బుద్ధిగలవాఁడు - దుష్టుఁడు, కంసుండు
కుపితుండు నీపైనఁ గూర్మితనయ,
అట్టిట్టులొంటిగానసహాయుఁడై యీవు
తిరుగుచుండఁగఁ జూచి తిన్నగాను
వంచించి గట్టిగాఁ బట్టుకొన్నంతట
బ్రతికి యుండఁగలేను, వాసుదేవ !
బుద్ధిఁజెప్పితి నీకుఁ బోవంగవలదని
తెలియఁ జెప్పితిఁ బోవ వలదు-వలదు.

6

ఆ. వె॥ తల్లినోటిమాట తనయునకెప్పుడుఁ
దప్పకుండఁజేయఁ దగినదయ్య
యదుకులమణి దీపమా! యోర్పుతోడను
చన్నుఁబాలుఁ గ్రోలఁ జక్కరార!

6

సీ॥ మించు తీవియలీల మిన్కు నెన్నడుముల
మెలఁత మిన్నలయొక్క మేటికొప్పుఁ
గొప్పఁగాఁ గప్పుచు నొప్పు బంభరముల
మధురగానముచేత మహిమఁ గన్న
శ్రీవిల్లిపుత్తూరఁ జెలఁగి నిల్చినవాఁడ!
చెన్నుమీఱుచునుండు నిన్ను గన్న
కడుపును గలయట్టి కల్యాణి యెటువంటి
నోము నోచెనో యంచు నోము జనుల
తే. గీ॥ వార్త చేఁ గల్గినట్టి సత్కీర్తి నాకు
గలుగఁజేసినవాఁడవు కావె నీవు
అయ్య యోహృషీకేశుఁడా! యప్ప, రమ్ము
రమ్ము చనుబాలు గ్రోలంగ రమ్ము, రమ్ము.

7

సీ॥ నిను బోలఁగలవానిఁ గనుభాగ్యమునుగోరి
నినుజూచు కులసతుల్ నిన్నువీడి
పోవ గాళ్లాడక పొదలి నీ సన్నిధి
నిలిచియుందురుగాని తొలఁగ రవల
మధుపసంకుల పుష్పమాలికాంచిత
దీప్త-కుంతలల్ నినుజేరి సంతతంబు
నేత్రపర్వంబుగా నీ యందచందంబు
లన్నింటి వేర్వేర నరసి నీదు

తే. గీ॥ మోవి పానక మానంగఁబూని నిన్ను
వారియిండ్లకుఁ గొనిపోవ వచ్చి యిచట
వేచియున్నారు, చూడు గోవింద, వేగ
రార, రారన్న చనుఁగ్రోల రాగదయ్య.

8

సీ॥ పర్వతాకారులై ప్రజ్వలించెడువారు
చాణూరముష్టికుల్ చతురమతులు
మల్లు లిర్వురు నిన్ను మడియించుటకు వచ్చి
నీముందు నిల్వంగ నీవు చెలఁగి
వారిని ద్రుటిలోన బరలోకమున కంపి
వరలిన యో చిన్నవాఁడ! రమ్ము
ఒడిపైన గూర్చుండి యొప్పులొల్కెడి నీదు
వక్షఃస్థలంబుపైఁ బాలుగాఱ
తే. గీ॥ నొక్క వక్షోజమును జేతఁ జిక్కఁబట్టి
యితరమును నోటనిడుకొనియిటులనటుల
నొకటి వెంబడి నొకటిగా నొనరమార్చి
స్తన్యపానంబు సేయంగ సామి, రార!

9

సీ॥ సొంపారు నరవింద సుమముందుఁ బొలుపార
జిందిన ముత్యాల చెలువులీల
స్వేదాంబు కణములు చెలఁగె నీవదనార
విందంబు నందెల్ల సుందరాంగ!
మాటిమాటికి నిట్లు మట్టి ముంగిటియందుఁ
బొర్లాడు క్రీడలు పొసఁగవయ్య!
ధూళి ధూసరితమై తోఁచు నీయంగముల్,
వలదురా యీ యాట వదలుమయ్య

తే. గీ॥ పూర్వ మమరుల కమృతంబుఁబోసి ప్రోచి
దేవతలకెల్ల దేవుఁడై తేజరిల్లు
వాఁడ! రారమ్మ నన్‌జేరవచ్చి పాలు
గ్రోలు మోయయ్య చనుబాలు గ్రోలుమయ్య.

10

సీ॥ పఱుగెత్తివచ్చుచో పదకింకిణులు చేయు
కలనిస్వనంబుల లలితగతికి
గానంబుసేయుచు గానానుసారియౌ
నృత్యంబుఁ దగురీతి నెఱపుకొనుచు
వచ్చు నీయందంపువగఁజూచి యాశ్చర్య
పరవశనై నిన్ను భావమందు
పద్మనాభుఁడె వీఁడు, పరుఁడెవ్వఁడునుగాఁడు
గా! యని నీరాకఁ గాచియుంటి

తే. గీ॥ ఆటపాటల నిట్లు నీవలసి యలసి
వెలయు నిన్‌జూచి యిటులనే నిలిచియుండ
పాఱిపోవుదె! ఉత్తమా! వలదు, వలదు
పాలుగ్రోలంగ రావయ్య, గ్రోలుమయ్య.

11

ఉ॥ కట్టునవెల్గుచంటిచెలి, గాదిలిబిడ్డనుజూచి “మాధవా!
పట్టిరో” పాలుద్రావుమనువాక్యము గైకొని పాట బాడెనా
భట్టరు, కల్పపూవలపు భాసిలు పుత్తురివాసి, కీర్తిచేఁ
బట్టినవాఁడు, దీనగురుభక్తి జనించును బద్మనేత్రుపై.

౨ వ శతకము 2వ దశకము సంపూర్ణము.

శ్రీ శ్రీ

శ్రీ

"బాగవతసారము" అను
శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

2-వ శతకము — 3-వ దశకము

ఈ దశకమున చెవులుకుట్టుట యను నుత్సవము జరిపించుటకు యాదవుల రప్పించి శ్రీకృష్ణునికి చెవులకుట్టించుటకుగాను నతని బిలుచు యశోదాదేవి యనుభవము వర్ణింపఁబడియున్నది.

1

సీ॥ పరిరక్షణా ధర్మపరతంత్రుఁడై నీదు-తండ్రి
యింకనురాక తామసించె
పోరున జతురుఁడౌ వీరుఁడు కంసుండు
కఠినుఁడై నిన్నట్టి గాచియుండు
కడలివన్నియవాఁడ, కావలినిఁ గాచి
కాపాడఁగలవారు కలరె నీకు ?
పైశాచి చనుబట్టి పాలుఁద్రాగినయట్టి
భ్రాంతచిత్తుండవై వరలువాఁడ !
తే. గీ॥ వచ్చియున్నారు వ్రేపల్లె వారలెల్ల
చెవులుకుట్టంగవలె నీకు సిద్ధమయ్యె
వక్కలాకులు మొదలైనవస్తు వితతి,
పోకు మెటకైన కేశవా ! పోవవలదు.

2

సీ॥ నినునమ్మి సేవించు నీ పాదదాసుల
చిత్తంబు వదలక చెలఁగువాఁడ !
నినునమ్మఁగాలేని నీ యొక్కవిముఖుల
కందంగరాని నారాయణుండ !
జిగిగుల్కుపగడాల సిరులొల్కు మొలనూలు
కటిసీమపైఁ జాలఁ గ్రాలుచుండ,

పంకేరుహోపమ పాదయుగ్మంబున
గ్రాలుమంజీరముల్ ఘల్లుమనగ.

తే. గీ॥ రమ్మ, మంటలేనట్లుగా రమ్యఫణితిఁ
జెవికివత్తి యెక్కించెదఁ జేరరార !
పైడియంటు జోళ్ళివి నేత్రపర్వముగను
జేసియుంచితి నీకు నన్ జేరరార !

3

సీ॥ మేటి యాకడలిలో మొలఁగెడు మకరంబు
వలెఁజాలవెలుఁగుచుఁ జెలఁగుదాని,
కువలయంబంతటిఁ గొనఁజాలగల్గిన
వెలగల్గినట్టిదై వెలయుదాని,
కుండలయుగ్మముఁ గొనియుంచియున్నాను
తాకి తాకక నొప్పితగలనట్లు
మెత్తఁగాఁ జెవిలోని వత్తి యెక్కించెద
నేమికోరిన దాని నిచ్చుదాన.

తే. గీ॥ పరమతేజస్వి ! యదుకుల పల్లవుండ !
భువనరక్షకై యదువంశమునను బుట్టి
గోపయువతుల చిత్తంబుఁ గొల్లకొన్న
మాధవా ! రార, రారమ్మ, మాన్యచరిత.

4

సీ॥ దిగజారియూగెడు వగఁజెవిఁ దగబెంచి
వజ్రాలయంటుల ప్రభలతోడ
గుణశీలయుతులైన గోపాలబాలకు
లెటువెల్గుచున్నారొ యిటులఁగనుమా !
గోవింద నామాటఁ గొననివాఁడవు నీవు !
అయ్యో వీక్షింపుమా యంటుజోడు
ఒకటితో నొక్కటి యొప్పారి యందమై
వెల్గుపీని ధరించి వెలిగితేని

ఆ. వె॥ తీపి పనసతొనలఁ దియ్యంగఁ దినవిత్తు,
తెలుపు నునుపువన్నె పొలుపులొలుకు
చన్నుగుడువనిత్తుసామి చయ్యనరార
యిటులరార మ్రొక్కులిడుదురార !

5

సీ॥ వంశాభ భుజముల భామామణుల్మెచ్చ
కృష్ణకుంతలుడైన విష్ణుదేవ !
దండంబులిడి నిన్ను దడవుగావేఁడితి,
వేఁడుకోల్వన కిట్లు వెడలఁదగునె
వలయంపు ముంగురుల్ వెలయు వెలందుల
చేతులఁ జెయిఁజేర్చి చిందుద్రొక్కి
ఇటువచ్చు టింపౌనె ! ఇదియెట్టి గుణమయ్య
రావయ్య వేవేగ రార ! రార !

తే. గీ॥ తిన్నగావచ్చి చెవికట్టుకొన్నయెడల
చిన్న విపియేల యని నీవు చెప్పునట్లు
పెద్ద "అప్పాలు" నిత్తు నీకె వేఁడుదాన,
రార నాస్వామి, యిటు నిట్లు రార సామి.

6

సీ॥ "మన్నదింటి వదేల మాన్యుఁడా" యని నిన్ను
తిన్నగాఁ దిట్టఁగ తివిరియేల
నాకాశవీధియే యడలిపోయెడురీతి
పెద్దపెట్టున నేడ్పు పెట్టితయ్య
మన్నున్నదో చూడ మదినెంచి నీ నోరు
పరిశీలనముఁ జేయవరుస నచట
భూర్భువరాదిక భువనంబులన్నియు
వెలుఁగుచుండుటఁ జూచి కలఁతఁ జెంది

తే. గీ॥ నీవు మధుసూదనుండని నిర్ణయంబుఁ
జేసికొంటినా కార్మోయిల్ చిన్నికృష్ణ!
పుండులేదింకఁ జెవిమానిపోయెఁజూడు,
కడలికార్వణ్ణ కాపరీ కుడువు చన్ను.

7

సీ॥ చన్నేమి వలదని చయ్యన బరుగెత్తి
యంటుజోళ్లనుదీసి యవలవైచి
గోవర్ధనమునెత్తి గొడుగుగా ధరియించి
గోపాలకులమును గోగణమును
గురుశిలావర్షంబు కొంతైన బడకుండ
సంరక్షణముచేసి సంతసించి
యుపమానరహితయై యొప్పిన విలువంచి
యదుకుల రక్షియై యలరువాఁడ!
తే. గీ॥ ఓ త్రివిక్రమా! నాయందె నుండె తప్పు
నేను నీ చిన్నితనమున నీదు శిరము
నిలువకుండిన యానాడె సులువుగాఁగ
నీకుఁ జెవిఁగుట్టి పెంచంగ లేకపోతి.

8

సీ॥ "నీదె తప్పని నిన్ను నిందించుకొనురీతి
తప్పుల నాపైన జెప్పనేల!
మన్నుభక్షింపని నన్ను దేరకుఁబట్టి
కొట్టి నల్గురిముందు తిట్టనేల"!
"బలమైన పుట్టల భయపడి దాగునా
యురగుల కరియైన గరుడుపడగ
గలయట్టి వామనా, కలదుఃఖములఁదీర్చు
నాశ్రితరక్షకా! అయ్య! రమ్ము"

తే. గీ॥ "పొగడవలదమ్మ నన్నట్టి తగనిరీతిఁ
జేయననిపల్కు సత్యంబు" "చెవులకుట్టు
పూడిపోవక వత్తిని బొందుపఱచి
యవల వచియింతు సత్య మోయయ్యరార".

9

సీ॥ "చాడిమాటలవిని సత్యంబుగా నెంచి
వెన్న దొంగతనంబు బెట్టి నన్ను
చెయిపట్టి పెనురోలు చెంతకులాగుచుఁ
గన్నవారును జూడఁ గట్టలేదె?"
"చేసిన యవ్వానిజెప్పి నవ్వుచు నన్ను
జేరకె యటు నిల్చు శ్రీధరుండ!
కాలయాపనమిట్లు కడఁగి చేసిన చెవుల్
పూడిపోవునుగాదె పొంక మెడలి?
ఆ. వె. నిన్ను విడువలేకనీ చెంతనుండు నీ
యన్నమిన్నలిపుడు నిన్నుఁజూచి
నవ్వకుండునటులు నయముగాఁ జెవులకు
వేసికొనుము వత్తి వేగవచ్చి.

10

సీ॥ పరిహాస మొనరించు వనితామణులకేమి?
నీకు మాత్రనదేమి నిజముఁజూడ
వాపు మంటలు నన్నె బాధించు, మఱిమిమ్ము?
తాళ్ళేవని చిన్నతనమునందె
నీ చెవుల్ కుట్టని నేరంబు నాదెగా!
వ్రేపల్లె బాలురు వీనులెటులు
పెద్దగా బెంచుచు వేడుకల్ మీఱంగ,
తిరుగుచుందురు నీవె యరసిచూడు

ఆ. వె॥ వృషభదైత్యుఁగూల్చి వెలఁగ రక్కసుఁబైన
వత్సకమును విసరివైచి వేగ
నసురజంటఁగూల్చినట్టి హృషీకేశ
ప్రియకుమార, కృష్ణ, వేగరార !

11

సీ॥ కనులతోడఁ గనులు కలయంగ మెలయంగ
నందునిందును నెందు నరసియరసి
చల్లగా వీక్షించు సరకసటాక్షముల్
చెలువులోలుక నిల్పి కలయఁజూచి
వలపుపూలకురుల వెలదుల మదినిండి
మధురవాసముజేయు మహితదేవ !
అమృతమై మమ్మెప్పుడలరించు మాస్వామి
తనివితీరగఁ బండ్లు తినఁగ నిత్తు
ఆ. వె॥ నొప్పిలేనియట్టులప్ప నీ చెవులకు
నంటుజోళ్లు నిడుదు నయ్యరార !
పట్లువిరిగినట్లు బండిఁ దన్నినవాఁడ !
పద్మనాభ రార వడిగరార !

12

సీ॥ "రారాయనుచుఁ బిల్చి రయమునఁ జైబట్టి
బలిమిని కర్ణకుండలము లిట్లు
చెవులందుఁ ద్రిప్పిన జెడుగు నీకేమమ్మ
చెవినొప్పి నాదెగా ! చెంతరాను"
సర్వరక్షక నీకు సంప్రీతికరమని
నీ యారగింపుకై నెమ్మితోడ
నేరేడిపండ్లివి నేడెచ్చియున్నాను
కడగంటఁ జూడుమా కడఁగివీని,

తే. గీ॥ వంచనా మతితో నీకుఁ బాలుఁగుడుపు
కుమతి చావంగ గ్రోలిన కుఱ్ఱవాఁడ!
శకటదైత్యుని కాలితో చావదన్ని
నట్టి దామోదరుండ నా యప్పరార.

13

సీ॥ సహజదైర్ఘ్యంబుతోఁ జానొందు చెవులకుఁ
గొలతకుఁ దగినట్లు కోరి పెంచి
మకరకుండలముల మాపటికిడనెంచి
పొలుపుమీఱ యశోదపలుకు నుడుల
చిరచింతనముచేసి చిత్తంబులో నిల్పి
భువిలో ననాదిగా భూరి కీర్తి
పొందినయా మేటి "పుదివె"కు ప్రభువైన
భట్టరు శ్రీపతి పదియురెండు
తే. గీ॥ భవ్యనామంబు లంతాదిపద్యములుగ
తనివితీరని యానందదాయకముగ
గూర్చి చెప్పిన యిద్దానిగోరి చదువు
వారలచ్యుతుదాసులై వరలగలరు.

2_వ శతకము 3_వ దశకము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీ

"భాగవత సారము" అను
శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

2-వ శతకము — 4-వ దశకము

శ్రీ యశోద శ్రీకృష్ణుగుణగణముల ప్రశంసించుచు నతని జన్మనక్షత్రదినమున మంగళస్నానమునకు పిలుచునట్లు భావించుకొని యా భావోద్రేకమును నీ దశకమున వర్ణించియున్నారు శ్రీ విష్ణుచిత్తులవారు.

ఉత్సాహవృత్తములు

1. వెన్నయందు దొంగులాడి - వేడ్కనాటలాడు వో
మన్ను, జిడ్డు మేనగలియు - మాన్పరాత్రిఁ బడకపై
నిన్ను నీవు రుద్దుచుండ - నేనదొప్పియుందునే ?
అన్న ! నూనె, పులుసుఁ - దెచ్చి యధికకాలమాగితిన్
నిన్ను స్వేచ్ఛజేర నీవు - నీవె రమ్మ రక్షకా !
నిన్ను జలకమార్తు రార ! నీరమాడ, నారనా !

2. దూడచెవుల గండుచీమ - దూర్చితేని బెదర, తాఁ
గూడిపోకఁ బెదరిపోవు - కూర్మిసామి ! నీవు నే
గూడుఁబెట్టు వెన్నయంత - గొల్లపెట్టఁ జూతుగా !
ఏడుసాలములనుగూల్చి - యింపుమీరినట్టిడా !
నేడు నీదు జన్మతార ! నీరమాడవలయునా !
నిన్ను జలకమార్తురార ! నీరమాడ, నారనా !

3. అసురచన్ను గుడుచుచుండ - నాలనుందయాంద్రమ నిన్
విసముఁగుడుచువాని జూచి - వేగనన్ను బిలువ, నీ
దెసకు భయమును వీడివచ్చి - తీపిచన్ను గుడిపితిన్
ఉసరికెలిడి నీరుగాచి - యుంచినాను కాగునన్
అసలునీలమణివి ! రార ! అమితకీర్తిశోభితా !
మసలకుండ నీరమాడ - మాన్యరార ! నారనా !

4. కంసుఁడెక్కుపెట్టి వేగ - గడుసుమీరవచ్చునా
హింసకారి శకటుఁడన్ని - యీల్గునట్టు లసురశాల్
కంసహారి! క్రోలినావు - కాటుకయును బసుపురక్
శంసనగన్న కలువరము - చందనంబుఁ గూర్చితిక్
హింసయిడక, సుందరుండ! యిపుడేరార, నారనా!

5. చాల మృదువులైన లేత - చన్నుగవలచెలులు నీ
లీలఁజూచి వెన్కనిక్ భ - లీయటంచు నవ్వరే!
నేఁలివగల వంటకముల - మెసవనిచ్చి యున్నచో
పాలు, బెల్లములను గలిపి - వంటదినుసు లప్పముల్
చాల వండిపెట్టినాను - సామి! నీరమాడఁగా
నేలజాగు? వేడుకొందు - నిటులరార, నారనా!

6. నూనెకుండ దొర్లఁబెట్టి - నొవ్వగిల్లి పిల్లలక్
బూవిలేపి కంటిగ్రుడ్లఁ, బొర్లఁద్రిప్పి దౌష్ట్యముక్
మానకెపుడుఁ జేయుసామి! మంచిఫలము లిత్తురా!
మానవట్టి యలలరొదల - మలఁగుకడలి వన్నెలక్
మేఁగులుకు నందకాడ! మజ్జనంబు లాడఁగా
బూని వేగరార యిపుడె - పొంకమొలుక, నారనా!

7. హితకరుండ! సామి! నీవు - ఇలను బుట్టినది మొదల్ 6
పితికినట్టి మంచిపాలు - పెరుగు, చిలికి యట్టిపై
స్థితముచేయబడిన వెన్న - చేతికంది యెఱుఁగరా!
సుతుని గిప్పిపుచ్చు తల్లి - సుతునిదిట్టెనని పరుల్
అతిశయించి పలుకుదురని - అనవు నేని మఱచియోక్
సుతుఁడ! రమ్మ జలకమాడ - సొంపులొలుక, నారనా!

8. వాలమునకు మట్టఁగట్టి - వత్సములను దఱుమవే!
నేలపైన వెలగదొర్ల - నిగిడి దూడరువ్వవే!
చాల తఱిమి పాముఁబట్టి - చక్కడాని నూపవే!
పలుసామి! నీ నడతల - నే నెఱుంగఁ జాలరా!

బాల ! నేడు జన్మదినము - పాఱిపోవ వలదురా !
హాయిమీఱఁగాఁగ జలక - మాడ, రార, నారనా !

9. పసలమేపు చాటలాడఁ - బరగు దుమ్ముతోడ, నీ
పసిడిమేను జూడఁగాను - వరలు ముదము, నైన, నఱ
గసరి తిట్టగలరు, నిన్ను - గాంచు వారలెల్లరున్
అసలు సిగ్గులేనివాఁడ - వయ్య ! నీలనవ్వదే
పసలఁ జిల్కుమరకతంబ - వరలునామ రత్నమా ;
వెసను రమ్ము జలకమాడ - వేగరమ్ము, నారనా !

10. కాలమేఘ ములను మించ గలుగుమేని వన్నెతో
గ్రాలుకృష్ణ, నీవుఁ బోగడి, కట్టుకణఁగకుబుసుచున్
జాలవెలయు వలుద చంటి చానయౌ యశోద, యె
లీల జలకమార్చెనట్టి లీల మేటి "పుదువె" ము
న్నేలినట్టి భట్టరుకడు నింపులొలుకు ద్రావిడిన్
మేలి వగలఁబాడినట్టి మేటిపాట నెవ్వరేన్
జాలభక్తిఁ బాడఁ దొలఁగు సర్వదుఃఖ జాలముల్.

2.వ శతకము 4.వ దశకము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీ

"భాగవత సారము" అను
శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

2-వ శతకము — 5-వ దశకము

ఈ దశకమున శ్రీకృష్ణునికి శ్రీ యశోదాదేవి తిరుమంజనము గావించిన యనంతర మాతని తలదువ్వుటకు ప్రయత్నించి యతని నిలుపుకొనుటకు గాను "ఓ కాకి! నాబిడ్డకు తలదువ్వ రావే" అని పిలుచుచు నాతని మనస్సునకు వినోదము గల్పించుచు కాకిని సంబోధించు భావమును నారోపించుకొని శ్రీ విష్ణుచిత్తులవారు తమ యనుభావమును వర్ణించియున్నారు.

1. నీల పెండ్లికొడుకుం డితండు - నిత్యసూరి వరుల మేటి,
ఆలయంబు "పేట్టి" లోన - నరయ, లేరు వీనిసాటి,
పలు మాధవుండువీడె - యేడు నేడు తరములకును,
శ్రీలలనకు దయితుండు, వీని - సిరి కురులను దువ్వుటకును
పలు వీనికురులనువ్వ - నిచటికల్ల రావె కాకి !
నీల పెండ్లికొడుకు కురుల - నీవెవచ్చి దువ్వు కాకి !

2. పూని క్రోధ రక్కసియగు - పూతనచను బాలువీండు,
దానవుండగు మాయశకటుం దన్నికూల్చినాడు నాండు
పూనిమద్ది జంటవిరిచె - పొలుపులొలుకు నంజనివలె
మాననీయకాంతివరలు - మంచి నీలరత్నమువలె
మేనిడాలు లొలుకుకృష్ణు - మెఱయు నల్లకురుల దువ్వ
చానకాకి ! రావె ! రావె ! చక్కగాను గురుల దువ్వ.

3. బటువుగైన త్రాళ్ళయుట్టి - పైన బెట్టిపట్టి వెన్న
నెయిలోం గెలుపులేక మ్రింగి - యెఱుంగనట్లు చూచుచున్న
మేటిసామి, అమరవిభుండు - మించి యొప్పు గొల్లఱేండు
నీటికోడ నిండియుండు - నీలిమబ్బు వన్నెవాండు
సాటిలేని వీనికురుల - చక్కగాను దువ్వ, కాకి !
నీటులొలుకు వీనికురుల - నీవె వచ్చిదువ్వు కాకి !

4. పల్లమందు మేయుచుండఁ - బకము లీల రూపమూని
కల్ల బొల్లిరక్కసుండు - కపటమొప్పఁ జేరువాని
సల్ల సల్లఁ జూచి యపుడె - యద్దిమొక్క కొంగగాఁగ
నల్లమందు నెంచి నోటి - నొక్కమొగిని జీల్చి వేగ
నల్లసిల్లి యొప్పువాని - యొప్పులొలుకు కురులదువ్వ
పిల్లవాని కురులదువ్వ - వేగ, కాకి ! రావెనువ్వ.

5. దూడలందుఁ జేరి మేయు - దూడ యసురకాలుఁబట్టి
జాడగాఁగ వెలగయసుర - జారి చచ్చునటులఁ గొట్టి
ప్రోడయైన పరము ముడిని - భయద చక్రహస్తు ముడిని
వేడుకలర రావె దువ్వ - వెడలిపోవకిపుడె యతని
ఈడులేని సొగసుకురుల - నింపుగదుర దువ్వరావె !
ఆడకుండజాతిపలుకు లలరి - కాకి ! దువ్వరావె !

6. వరబలంబు, భుజబలంబు - ప్రబలినరకుఁ డాదిగాఁగ
వరలు తూర్పుజోతి ప్రోలి - ప్రభులఁ జంపఁదలఁచి వేగ
నరసి కన్నుమూసి తెఱచు - నంతలోన చక్రగతిని
నరుల మూల మట్టుగాఁగ - హతమొనర్చినట్టి యతని
కురుల కందమొసఁగురీతి - గురులదువ్వరావె, కాకి !
నిరతమాలఁ బ్రోచువాని - నీలుకురుల దువ్వు, కాకి !

7. తినఁగఁగోరి పిండములకుఁ దిరుగనేల, రావె, కాకి !
పెనుపిశాచి సీటికూడు - వెదుకనేల, రావె, కాకి !
ఘనులు నిత్యసూరి వరుల - గణమునేలు వాని కురులఁ
మనసు కతిశయంబు గూర్చు - మాయగాని సొగసుకయల
గనఁగ నళుల రీతివంగి - గ్రాలు నల్లకురుల దువ్వ
వినవె, కాకి ! రావె, కాకి ! వినికురుల, రావె, దువ్వ.

8. అందమొలుకు నాభికమలమందు నలుమొగాల దొరను
చందమలరఁ గన్నయట్టిసామి కురుల పులుముపగను
బొందినట్టిపులుము చిక్కుపోవునట్లు విరియఁదట్టి
వింపలొలుకు దంతమునను - వెలుఁగు దువ్వెనఁ దగఁబట్టి

సుందరముగదువ్వ, కాకి! చుట్టుత్రాటి బొజ్జగాని
క్రందుకొనెమ కురులనువ్వ - కాకి! రావె, సొగసులూని.

9. అలబలీంద్రుదేవి చిత్త - హర్షజనక రూపమూని
తొలుత మూడులోకములను - దొడరి కొలిచిట్టివాని
పొలుపులొలుకు సొగసుకురుల - పూలపొన్నుపైన బెట్టి
వలనుగాగ వెనుకనిలిచి - బాగు మీఱ చేతఁబట్టి
వెలయు వెయ్యిపేర్లవాని - పెంపుకురులదువ్వు, కాకి!
చెలువులొలుకు పీనికురుల - చేరఁబట్టి దువ్వు, కాకి!

19. ఘనసమాను, సుందరాంగు - గ్రాలు భ్రమరకుంతలముల
జనులు మెచ్చునటులదువ్వ - చాన, కాకిఁ బిలుచునడుల
బూని, మింటెనంటు ప్రహరిఁ బొదలు విల్లిపురముతేవ
గానమొనరఁజేసె చదువు - ఘనులఁ బాపమతు కదెపుడు.

2_వ శతకము 5_వ దశకము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీ

"భాగవత సారము" అను
శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

2-వ శతకము — 6-వ దశకము.

శ్రీ యశోద శ్రీ కృష్ణునికి తలదువ్విన యనంతరము జడవేయుటలోఁ బిల్లవాఁ డవసరపడి దూడలవెంట పోవలయు ననుచుండ నతని నిలుపుటకై "ఓ కాకీ! మా కృష్ణునికి మంచి ముట్కోల తీసుకొనిరమ్ము" అని కాకమును సంబోధించునట్లు కుమారుని మనసును త్రిప్పుచు నిలువఁబెట్టి జడవేయుచున్న ఘట్టమును నీ దశకమున శ్రీ విష్ణుచిత్తులు తమ్ము యశోదగా భావించి యనుభవించి వర్ణించియున్నారు.

1

లయ॥ ఆటలకు పంపుగడ - నీకొసఁగ పించిపిలు
త్రాటబిగియించి తన - నేటి మెడలోఁదాఁ
బేటినగ, "తాలి" యను - సాటి గనరాని నగ
మాటి, శిఖిపింఛపుది - నీటొలుక వెన్కఁగా
వాటముగ నూఁగ, వన - వాటి కలఁగాల్నడల
నూటిగను దోలుపెను - నీటియల వన్నెల్
వేటివగ లొల్కఁ మెయి - నేటియగు వానికొక
వాటమగు కోలగడు - నీటొలు కఁ దెమ్మా!

2

లయ॥ పరిమళ యుతంబగుచు - వరలెడు "కుడందె" యను
సిరుల "తిరుక్కోట్టి" యను పురవరములందుఁగా
వరలు "తిరుపేర" నెడు - తిరునగరమందు, మఱి
ధరణిగల పుణ్యమగు - తిరుప్పతుల యందుఁగా
దరుగు చెపుడాటలను - ధరఁజెలఁగు నా సుతుఁడు
గుఱునదశంఖమును - దిరముగను బట్టఁగా
వరలు ఘనహస్తమున - కరసి యొకలక్కఁగల
యరుదయిన దండమును - త్వరితముగఁ దెమ్మా!

3

లయ॥ మిట్టిపడు కోపమున - గట్టిదుటఁ జేరఁజను
నట్టియరి కంసుఁ గడు - బెట్టలుకఁ గూల్చెన్
రట్టెసఁగ వచ్చుబకుఁ గట్టిగ - నెదిర్చి యొక
పెట్టుననె నోటినటు - పట్టుకొని చీల్చెన్
దట్టమగు పెన్గురులు - కట్టువిడ పర్వులిడి
చుట్టుకొని దూడలటు - లిట్టు చనకుండన్
దిట్టముగ మేపజను - నట్టి సురవర్యుఁడగు
నట్టిమన వాసికొక -గట్టి గడదెమ్మా !

4

లయ॥ ఒకరొకరు కూడరసు - నొకపలుకె పల్కి మాటి
యొకటియును నివ్వనని - యొకనుడువెనుష్వన్
వికటుని సుయోధనుని - ప్రకటనవరత్నముడి
యొకట వెలుగొందు ప్రభు - నికటమున యుద్ధం
బికఁజరుగు సత్యమని - ప్రకటనముఁజేసి పశు
నికరమును మేపుకొన - మకరసధి వర్ణం
డీకఁజనఁగఁ బూనుకొనె - నొక తగిన దండమును
నొక సొగసు కోలనిటు - ప్రకటముగఁ దెమ్మా !

5

లయ॥ తనచరణ దాసులకు - దనయభయ ధర్మముచు
దనమనమునందలఁచి - వినయమున ధుర్యో
ధనని నొక యూరొసఁగ - మనవి యొనరించియును
వినని పెనురోషమున - ఘనసమరమందున్
మునుకొనుచుఁ బార్థునికిఁ దనెరథముఁ దోలుదని
నని మొనను నిల్చి జయమును గలుగజేసెన్
ఘనుఁడితఁడు వీనికొక - ఘనమయిన కోలనిటు
గొనసయొసగు మమ్మ, సుగ - జన వరునికీమ్మా !

6

లయ॥ మునుపు వటపత్రమున - గనికి బహుకాలముగ
దన నలుపు మేనిపస - గొనివెలుఁగు సంద్రం
బున దనకు శయ్యగను - వనగనుఁ శేషుపయి
ఘనమయిన నిద్రగని - తన చిఱుతప్రాయం
బున దనకటాక్షమున - మనిచితగ నర్జునిని
గనులకును విందొసఁగు - ఘనమయిన రూపం
బున "తిరుకొండందె" పురిఁ - దన నెలవుగాఁగొనిన
ఘనుఁడితఁడు, వీనికొక - మునిగడను దెమ్మా!

7

లయ॥ అందముగు కూతులుల - విందొలుకు చిత్రనగ
మందుఁ గుమమ్మట్టముగు - డెందమున జూడక్
ముందెకొనఁగనొక్కటి - యందముగు పెన్నెఱులు
సుందరుఁడు క్రూరుఁడిక - నెందుఁ జననిన్నుఁక్
తొందరగఁ బట్టుకొని - సందడక రెఁడవది
డించు వడఁజేయు మును - పెంపు జనియైనక్
అందముగు నీలమణి - చందముల మేనిపసఁ
జిందుదొర కొక్కగడ - నందిమము వేగక్.

8

లయ॥ మించువలె మిన్కుగమ - నంచితపు మధ్యమున
మించు జనకాత్మజను - గాంచరణమందుఁక్
మంచిమణి శిర్లకము - దంచితుఁడు రావణుని
గాంచి తనమేటివెలు - వంచి తల లొక్ట్
మొంచినటు రాల్చెగద - అంచితగతిఁక్ జలధి
గాంచి యనకట్టి కమ - మించె గనవేగక్
కాంచి తగినట్టివొక - మంచిముని కోలగొని
మంచిమణి శిర్లకకు - దంచి తునకిమ్మా!

9

లయ॥ పదితలలు రెట్టలిరు - పదులుగల రావణుని
గదనమున రెట్టలును - బదితలలు భూమిఁబ్
సోదరి పడఁగొట్టి తన హృదిఁగల విభీషణుని
సదనుల విభూషితుని - ముదములర తేఁజై
కుదురఁదవ పేళ్లలను - బదిలముఁగ నుంచువర
కదినిలుచు సంచుభువ - పదమును నొస ఁగెఁ
పొదలు మణిహారమును - నెనరుఁగల వేంకటుని
మది కెనఁగు కొలఁగొని - కదిసియిటు లిమ్మా!

10

తే. గీ॥ కాకమా, పూర్ణనికిఁ గోలఁ గాంచితెమ్మ
అను యశోదమ్మ నుడులను నరవగీతి
భట్టరార్యుర్లు పాడిరి భక్తితోడఁ
జదువ, పుత్రభాగ్యంబు పొవలునెపుడు.

4_వ శతకము 6_వ దశకము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ
శ్రీ శ్రీ

శ్రీ

"భాగవతసారము" అను

శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

(2-వ శతకము — 7-వ దశకము)

ఈ దశకమున శ్రీకృష్ణుని జడయందు మల్లి, విరజాజి, చంపకము మొదలగు పుష్పములు ముడిచి యలంకరించుటకై యాతని పిలుచు యశోదాదేవి యనుభవమును శ్రీ భట్టనాథులవారు (శ్రీ విష్ణుచిత్తులు) వర్ణించియున్నారు.

1. సీ। మకరందమాధుర్య మహిమంబునునిమ
సరళార్ద్రగుణములు వరలుదేవ!
భాండంబులోనుండు పచ్చిపాలనువెన్న
భాండంబులోఁ ద్రావఁ బరులునగరె!
సాంద్రకాననమున జక్కనిపచ్చిక
పట్టుల నెమకుచుఁ బశుగణముల
మేపుచుఁ దిరుగనీ మేఘవర్ణపుమేను
వాడిపోవును బోవవలదు వలదు.

తే. గీ॥ కానలోపల నీజాడ గాంచుముందు
నరయజాలము, మాజాడలరయవీవు।
పూలముడిచెద, చంపక పుష్పమిదిగో
రమ్ము, సంపంగిముడిచెర రార, సామి॥

2. సీ॥ జలపరిపూర్ణమై చదలంట నెగసిన
జలద సంపదలీల చల్లగాను,
గాంచుకన్నులకెల్ల ఘనమోదమొనగూర్చు
నందంపుమేనితో నలరువాఁడ!
సప్తలోకంబుల సంరక్షణార్థమై
యవతారమొనరించి నట్టివాఁడ,

తన సౌవర్ణసంపదక్ తనకెప్పు డీవను
సిరికి వల్లభుడౌచు చెలఁగువాఁడ,

తే. గీ॥ అల్ల శ్రీరంగవాసివై యలరువాఁడ !
కొల్లగా నెల్లయెడలను నల్లికొనుచు
స్థిరతఁగాంచు నీ మల్లికా పరిమళంబు,
రార యీమల్లి ముడుతును రాగదయ్య !

3, సీ॥ పరగృహంబులఁజొచ్చి వరగృహోపరిభాగ
శుద్ధాంతములఁదూరి చొఱవ నెఱయు,
యువతీమణులఁజేరి యొప్పారు స్తనయుగ్మ
వరబంధనంబుల బట్టిచీల్చి
వలిపెంపు పైతాణి పట్టాంబరము గీఱి
చిత్రాలయంచుతోఁ జెన్నులొలుకు
చీనాంబరంబుల జించి చెండాడుచు
నిచ్చలుదౌష్ట్యంబు నెఱపువాఁడ !

తే. గీ॥ ఆకసంబును దాకుచు నెఱుచున్న
వెంకటాద్రినివాసివై వెలయుస్వామి !
చిగురువవనాలవలపుతోఁ జెలఁగుచుండు
పాదిరీ పువ్వు ముడుతు - పట్టిరార !

4. సీ॥ కాముని విలులీల కమనీయమౌగసంగి
యింపారు కనుబొమ సొంపుతోడ,
నీలాలకురులొల్కు నెఱసిటు తనముతోఁ
చేరిన యీరెంటి సిరులనడుమ
తేజరిల్లుచునుండు దివ్యలలాట సౌ
భాగ్యంబు సరయంగ భవ్యలీల
జీమూత మీరిన చిన్నారి బిడ్డనీ
వసజెల్లు సంతటి యందగాడ !

తే. గీ॥ దివ్యదేహుండ వౌస్వామి ! తెరువునందు
నిలువ మలేగొల్లపడుచుల నలఁచు వేళ ?
వలపుదనంబు మరువముల్వెలయుమాల
మనసులో మెచ్చి ముడిచెద వౌన్యరార !

5. సీ॥ బకరూపమును దాల్చి - వచ్చిన రాక్షసు
వదనంబు జీల్చిన వాఁడ వీవు,
ఘోరంబుగా బోరు కువలయాపీడము
గజము దంతము నూడ్చి గ్రాలినావు,
వంచనామతితోడ వచ్చిన యాముష్ట
దానవి ముక్కును దఱిగినావు,
దానిరక్షకుఁడైన దానవు పదితలల్
ధరపైన బడగొట్టి వరలినావు

తే. గీ॥ నేను, నవనీతమును మ్రింగు నిన్ను జూచి
కొంచెమేని యు జంకక గొట్టినట్టి
దాసి, మంచినీటను బుట్టి తనరుచుండు
వలపు చెంగల్వ ముద్దుతును పట్టిరార !

6. ఉ॥ పోరున నెద్దులం దునిమి — పూర్ణుఁడవై యుల కంసునెత్తిపై
ధీరత దన్ని చంపి బహు — ధీరుల మల్లుల నుక్కడించి, నీ
దారిని దౌష్ట్యముల్ నెరపి — దర్పమె సంగగవచ్చు స్వర్ణమూ !
రార, యిదేర, పొన్నవిరి — రంజిలి నీకురులందు నుంచెదన్.

7. బిం దేవలవృత్యమున్నెఱపు విస్మయము నిన్గని తల్లడిల్లరే
ఇందునిభాస్యలో సుతుఁడ ! ఈవు హిరణ్యు విశాలవక్షముఁ
మందిరు వంక జీల్చితివి పూని "కుడెంద"ను నుండు సుందరా !
అందపు "కుర్కుతీ" కుసుమ మందముమీఱ ముడుంతురాగదే.

8. అసురుఁడు మాలికుఁ గదిసి యంచితమైత్రిస జూపి వానిపై
విసరుచుఁ జక్రముఁ శిరము వేగమొంటివి మంచిచెడ్డలన్

వసలకఁ గాంచి రతుయిశీ మాపెతఁదీరిచి రంగవాసివై
యొసఁగెదు దేవ! సీకరుల కింపుగనీ "యిరువాయ్పు" నంతురా!

9. పరమపదంబులో నమరవర్గము మధ్యవసించి, భక్త హృ
ద్వారిజదవాసివై కమలవాసినినేలుచు నేమలోకముల్
వరమతిఁ గుక్షినిల్పి వట - పత్రముపై శయనించి తూఁగ నీ
కరుదగు చిన్ని "సంపగిని" నాసలుతీర ముసుంతు గాఁగదే.

10. అక్కరతోడ దెచ్చితిని నాదరమొప్ప ముడుంతువార, యీ
చక్కనిమల్లి, చెంగలువ, సంపెగలుఁ జమంతిపూవి, నన్నయా
నిక్కపు మక్కువల్ గలుగ నిటుగఁబల్కు యశోదవాక్యమున్
జొక్కపు ద్రావిడీఁ బలికె సువ్రతుఁ డార్యుఁడు భట్టుకే పదన్.

2_వ శతకము 7_వ దశకము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ
శ్రీ శ్రీ శ్రీ

శ్రీ

"భాగవత సారము" అను
శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

2-వ శతకము — 8-వ దశకము

శ్రీయశోదాదేవి శ్రీకృష్ణునికి కురులుదువ్వి, జడవల్లి, పూలముడిచి యలంకరించిన పిదప నాతని సౌందర్యమునకు దృష్టి తాకునని భయపడి యతనికి రక్షఁగట్టు నుద్యమించి పిలుచుభావమును శ్రీ విష్ణుచిత్తులనుసంధించుకొని యీ దశకమున వర్ణించియున్నారు

1. తే. గీ॥ చంద్రసంచార రమణీయసౌధరాజ
విలసితంబయి, చతురులౌ విబుధవరుల
వాసమౌ "వెళ్ళత్తై"లోని పరమపురుష!
బ్రహ్మరుద్రేంద్రులమరులు భక్తితోడఁ
బరులకంటి కప్పుత్తై వచ్చినారు
దివ్య తిరువంత్ర పుష్పముల్ దెచ్చినారు
సంధ్యపూజకు వచ్చిరీ సంధ్యయందు
రక్షఁగట్టెద, సుందరా! రార రార!

2. తే. గీ॥ పశువులెల్లను దూడల పజ్జఁజేరి
యఱచుచున్నవి, నిన్ననే నఱచి యఱచి
యలసి నిలిచితి, స్నేహంబు కలదేనీకు!
ప్రహరిగల "వెళ్ళత్తై"దివ్య భవనమందు
దర్శనంబిమ్ము నోదేవ, తగదు, క్షుద్ర
దేవతలు తిరిగెదరు సంధ్యఁ దిరుగరాదు
మంచిదే పల్కు నామాట మదినిగొనుము
రక్షఁగట్టెద రావయ్య, రక్షఁగొనుము.

3. తే. గీ॥ వన్నెబంగారుగిన్నెల ప్రభలలీలఁ
జెన్నలొలికెడు లేలేత చన్నుగవల
చిన్నపిల్లల చిరుతిండ్లఁ జిట్టియిండ్లఁ
జెఱచు నిట్టిట్టు, భయపడిపఱచి, మంచి

భక్తగణంబుల మెచ్చినవాఁడ వీవు,
మూఁడుసంధ్యల నమరులు పూజఁజేయు
మునుల "వెహ్కా" లోననీమనికి గొనవె !
రార, నిన్నేమియుననింక - రక్షయిడుము.

4. తే. గీ। సుందరా ! జలధరవర్ణ, అందఱట్లు
"కంటిలోజల్లెమున్న" నక, "కాలఁదన్నె"
నని యసంఖ్యాకులై పిల్లలఱచుచుండఁ
గన్నవారల నిటుసేయఁ గార్యమగునె ?
సులభ దర్శనమొసగంగఁ దలఁచినీవు
"వెహ్కా" దివ్యతిరుపతిన్ వెలుఁగుచుందు
వయ్య, నీయందచందము లమితముగద !
రక్షగట్టిన నోదేవ, రార, రార !

5. తే. గీ। వేనవేలుగదుష్టు లిచ్చోటఁగలరు,
వారి దుడుకులు నీతలఁ బెట్టబడును
నీదు సుగుణముల్మెచ్చి నిన్ నిరతభక్తిఁ
గొలుచువారుండు "వెహ్కా" నిలయమందు
నిలుచు సుజ్ఞాన తేజమా ! నీమమేని
యందచందాల నోరారు నట్లుపొగడి
మంగళాశాసనముచేసి మహితవిధిని
రక్షఁ గట్టిన నిచటికి రాగదయ్య !

6. తే. గీ। మునుపు కంసుండు పూతన యనెడుదాని
నలుపుమెయిదాని శోణకుంతలముదాని
దయ్యమగుదాని నీపైకిఁ దఱిమెనెడు
మాటకలదయ్య, యాచోటు మామమయ్య !
ప్రహరితో వెల్గు "వెహ్కా" భవనవాసి
రక్షఁగట్టిన సుందరా ! రాగదయ్య !

7. తే. గీ॥ బండిరక్కసుఁ దన్నిన బాలరాజ !
మద్ది జంటను విరిచిన మానసీయ !
అసుర చనుబాలు గ్రోలినదాదిగాఁగ
నెప్పుడెటులౌనో యనుచునే నెదదలంతు
నిత్యతేజోనిధానమై నీటులొలుకు
"వెళ్ళత్రై" లోన వసించుచు విమల, రార !
పడకపై వ్రాలుసమయమో పరమపురుష !
రక్షఁ గట్టంగవలయురా ! రాగదయ్య !

8. తే. గీ॥ అసురులకుఁ గూడనందని సామి ! నన్ను
సతత మానందమున ముంచు దేవ ! క్రూర
కంసు హృదిలోన యమునృత్య హింసగూర్చి
గొప్పమదదంతి దంతంబు గూల్చి, చుట్టు
పైడి గోడల "వెళ్ళరై" భవనమందు
శ్రీలఁ బెరిగిన నాబిడ్డ ! శ్రీశ ! యిచట
భయదమై దుర్గ తిరుగును, పలుగులెత్తి
రార, రక్షఁగట్టెద, వేగ రార, రార !

9. తే. గీ॥ పురుషసూక్తాది ఋక్పరిపూత శుద్ధ
వారిదెచ్చిరి సంకులన్ బాలురిదిగో !
దాష్ట్యపూర్ణుఁడ ! గర్వంబు దాల్చకింక
గొన్ని నాళ్లకునామాట గొనఁగవలయు
తేజులొలికెడు "వెళ్ళరై" దేవ ! రార !
సంధి యగుచోట్ల నిలువకు సంధివేళ,
హారతివెలుఁగు లోననీ యందములను
జూచి రక్షఁ గట్టెదరార సొంపుమెఱయ.

10. తే. గీ॥ పద్మగేహిని, శ్రీనిధి, ప్రథమభార్య,
లక్ష్మి కౌఁగిలి సిరుల విలక్షణుఁడగు
"వెళ్ళరై" స్వామికిడ రక్ష వెలఁదిమిన్న
అల యశోదమ్మ తనయుని పిలుచునుడుల
వేద ఫలములఁ గాంచిన విష్ణుచిత్తుఁ
డలరి పాటగ బాడిన పాటలగొని
పాడి యనుభవ ఫలముల వడయుచుండు
భక్తజనములకంటదు పాపమెపుడు.

2_వ శతకము 8_వ శ్లోకము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ
శ్రీ శ్రీ శ్రీ
శ్రీ

శ్రీ

"భాగవత సారము" అను
శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

2-వ శతకము — 9-వ దశకము

శ్రీకృష్ణుఁడు గొల్లయిండ్లదూర స్వేచ్ఛావిహారక్రీడ లొనరించుచుండ నోర్వలేని వ్రజకాంతలకును శ్రీ యశోదకును జరుగు సంభాషణలను శ్రీ విష్ణుచిత్తులవారీదశకమున వర్ణించుచున్నారు.

1. తే. గీ॥ వెన్నదిగమ్రింగి కుండల విఱుఁగఁదన్ని
విఱుఁగు కుండలమ్రోతల వినుచు నిలిచి
నేలు లొనరించు నీకృష్ణు మేటివగలు
నాపలేమమ్మ, నీబిడ్డ నాపుకొనుము.
పుండులో చింత పండును బోయునట్లు
దుడుకు లింటింట నొనరించు దొరలకంటి
వానినెటు గంటివో కాని పిలిచియింట
నిలుపుకొనుమో యశోదమ్మ నిలుపుమమ్మ.

2. తే. గీ॥ నెఱికురులు, కెంపుమోవియు నీటుమోము
వగలఁగులికెడు పూర్ణుఁడా! వామనుండ!
తల్లి దండ్రులమాటల దాటనట్టి
రామ, కాకుస్థకులరామ, రార యన్న!
తప్పు లొప్పుల నెఱుఁగని తనయునేమి
యనుదు నోతల్లి! బిడ్డలఁ గనినతల్లి!
అయ్యొ! అంజనసమవర్ణ! అన్యులిట్లు
పరిభవింపంగ నెట్లోర్తు పాపినైతి.

3. తే. గీ॥ తఱుగని సిరులవాఁడయ్యు దప్పుపనులె
తనకుఁ తేజస్సుగా నెంచు ధన్యుఁడితఁడు!
నీ మఱుంగున మనుమమ్మ నీవెయిట్లు
చేయ ధర్మమానె యశోద! న్యాయమిదియె!
కలఁగ నుంచినవెన్నను గడుపునిండ
మ్రింగి భాండంబుఁబడగొట్టి మెల్లఁగాను
వచ్చు మధుసూదనుని వేగ వచ్చునట్లు
భామ, పిలువుమా! లేకున్న వాదగలమె!

4. నీలజీమూతవర్ణుఁడా! బాల! రార - రార శ్రీరంగనిలయుఁడా! ఆరగింప
నిర్మలాంబుపూరంబుల నీటులొలుకు - "ప్సేరి"లోనుండు నారనా వేగరార॥

"ఆరగించితి"నని యింట దూరువాని - గాంచి యెదురేగి యాగోపకాంత తన్ను
నెత్తుకొనునట్లుచేసిన యెత్తు, కృష్ణు - సులభ వాత్సల్యవిద్యల కలిమి కాదె॥

5. సీ. యంత్రేక్షురసమొల్కు - నత్యంతమధురమా
వాఙ్మహిమాఢ్యయై - వరలుదేవి!
స్త్రీత్వసంపూర్తితోఁ జెలఁగు యశోదమ్మ!
వేగరమ్మని సుతుఁ బిలువుమమ్మ!
పాలంతయునుబిండి భాండమ్ము నిండించి
పొంగించుటకుగాను బొయిని పెట్టి
బహుళకంకణముల భాసిల్లునాసుతుఁ
సంరక్షణార్థంబు జక్కనిలిపి
తే. గీ॥ అగ్గికై ప్రక్కయింటిలో నడుగుబెట్టి
వచ్చునంతలో భాండంబుపాల గ్రోలి
నిలిచె నీదుసాలగ్రామ నిలయుఁడమ్మ!
పిలువు మమ్మరో వాని బిలువు వేగ.

6. సీ॥ సర్వజనంబుల - సంస్తుతికర్హమా
వైభవంబులతోడ వరలువాఁడ!
గోవర్ధనంబును గూర్మి నెత్తినవాఁడ!
భాండనృత్యంబుల బరగువాఁడ!
వేదంబులకునెల్ల - విషయమై వెల్గుచు
నుభయవిభూతుల నొప్పులొలుక,
వేంకటనగమందు వెలయునాబిడ్డడా
ఆశ్చర్యచరితుఁడై యలరువాఁడ!
తే. గీ॥ రార వేవేగరావయ్య! రార యిపుడె
ఇదిగొ వచ్చెదనని రాకయేచవలదు,
పరులు చేసెడు నిందల వినగలేను
తామసింపకరావయ్య తనయరార!

7. సీ॥ ఉత్తమక్షేత్ర సముత్పన్నమైనట్టి
యెఱ్ఱనిబియ్యంబు నింపుమీఱు
సన్నని పప్పును శర్కరయును నెయ్యి
పాలును సమకూర్చి పక్వపఱచి

ద్వాదశశ్రవణమర్క వ్రతనిష్ఠతో నేను
దేవతార్చణముగా దీర్చియుంటి,
గాని, యశోదమ్మ నేను నీబాలుని
దివ్యలీల మునుపె తెలిసియుంటి,

గీ॥ శేష మొకయింతయును లేక చెలఁగి మ్రింగి
ఇంతయేగద, భక్షింతు నింకగూడ
ననుచు నిలిచియున్నాడుని వతనిబిలువు
మమ్మ, బిడ్డలఁ బెంచుటో యమ్మ యిటులె.

8. సీ॥ రావయ్య కేశవా ! రానని చెప్పక
రావయ్య యిచటికి రయముగాను
చెలిమిలేనటువంటి చెలువలయిండ్లలో
దిరిగియాడఁగరాదు - తిరిగిరమ్మ
దూషణంబులొనర్చు తొత్తులుండెడిచోట,
బానిసపనివారు బరుగుచోట్ల,
వదలి యచ్చటినుండి కదులుమా ! వారలు
నిలిచెడిచోట్లలో నిలువరాదు

గీ॥ వినర నాపలుకు లిప్పుడే వేగరమ్మ !
తల్లి వాక్యంబు తనయులు తప్పకెప్పు
డాచరించుట ధర్మమం చరయుమయ్య
రార, దామోదరా రార రయముమీఱ.

9. సీ॥ చక్కెర, లడ్డును, చిట్టుంద్రములు కారు
నూగులయుండ్రాలు బాగుమీఱ
పక్వంబుగాఁజేసి పాత్రలోఁదగనుంచి
నాయిల్లెగదయని పోయితెటకో,
తిరిగి యింటికివచ్చి తేరిజూచితినమ్మ
ఇంతి యశోదమ్మ - యేమనుందు
నీబిడ్డ యిలుదూరి నేబెట్టియుండిన
మంచి భక్ష్యంబుల మాయఁజేసి

గీ॥ ఉత్తమంబైన నవనీతముంచి యున్న
యుట్టిని బరీక్షచేయుచు నట్టెనిలిచి

యున్నవాఁడమ్మ ! పిలువుమా చిన్నవాని
బిడ్డనీరీతిఁ బెంచుట దొడ్డతనమె !

10. సీ॥ ఉత్తమ గుణముల నొప్పు యశోదమ్మ !
నీబిడ్డ దుడుకుల నే బలికిన
నాగ్రహింతువు గాని యాబిడ్డఁ బఱికింప
మాయచేష్టల లోన మేటియమ్మ
నాయింటిలోదూరి నాపుత్రికఁ బిల్చి
యాబిడ్డ కడియాల నట్టెయూడ్చి
ఉపవనంబుననుండి యోర్తుతెచ్చిన మంచి
నేరేడిపండ్లకు మారుగాగ
గీ॥ కడియములనిచ్చి ఫలముల వడసి తినుచు
నుండు నీబిడ్డ నేజూచి యోరి యిట్లు
చేయఁ దగదన, "నేనేమి జేయలేదు"—
అనుచు నవ్వుచున్నాఁ డేమియనుదు నేను.

11. సీ॥ పూఁదేనియలఁ గ్రోలి పూర్ణంబుగా జొక్కి
పొంకంబుగాఁ బాడు పొగరుతేంట్లు
మధురారవంబుల మలఁగు తోటలవెల్గు
కావేరిమధ్యలోఁ గ్ర లుచుండు
శ్రీరంగమున ముందు శ్రీరంగనాథుండు
క్రీడించినటువంటి క్రీడలెల్ల
బ్రాహ్మణశ్రేష్ఠుఁడా బట్టభిరానుండు
పాటగాఁ బాడెను వానినెల్లఁ
గీ॥ బాడి వివశులై నర్తించు వారితేజ
మష్టదిక్కుల దీపమై యలరుచుండ
నట్టి గోవిందభక్తుల యడుగుఁదమ్మి
యెపుడు నాశిరోభూషయై యెసఁగుచుండు.

2_వ శతకము 9_వ దశకము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ
శ్రీ శ్రీ శ్రీ
శ్రీ శ్రీ

శ్రీ

"భాగవత సారము" అను
శ్రీ విష్ణుచిత్తుల "మొదలాయిరం"

2-వ శతకము — 10-వ దశకము

పరువము గాంచిన గొల్లకన్నెలు శ్రీకృష్ణస్వామి తమ్మనేకవిధముల హింసించుచున్నాఁడనియు నతనివలన నింక తాము బ్రతికియుండుట దుస్తరము గాన నేటితో తమ బ్రతుకు ముగిసెనని శ్రీయశోదాదేవితో మనవిఁజేసుకొనుటను శ్రీవిష్ణుచిత్తులవారీదశకమున వర్ణించియున్నారు.

1. ఏటియిసుకల నాడు మాపయి - నేటి బురదల విసరివైచెను
నీటనుండ కడెంబు, చీరను - నీతి వదలుచు నపహరించెను
దాటిపోవుచు గాలికంటెను - త్వరితగమనముతోడఁ బఱచెను
బోటులందరు వాని వెంబడి - పోవ నింటను దూరి నిలుచును
మాటిమాటికి నెంతవేడిన - మారుపల్కఁడు సొమ్ములివ్వఁడు
నేటితోనిక బ్రతుకు ముగిసెను - నెలఁత! మమ్మిక బ్రతుకనివ్వఁడు.

2. కుండలంబులు గునిసియాడఁగ - కుంతలావళి సంచలింపఁగ
మెండుగా మణిహారమూగగ - మేనియందము లింపులీనఁగ
దుండగీఁడటు వలువలెల్లను - దొంగలించెడు సొగసుగాంచుచు
మెండుగాగను నష్టదిక్కుల - మెలఁగునమరులు నుతులొనర్చుచు
తండ తండములగుచు నొప్పఁగ - దానునింగిని దాకువృక్షము
చండుఁడై యటు లెక్కిపోయెను . చాన! మేమిక బ్రతుకఁజాలము.

3. మేటితామర మడుగుఁజొరబడి - మిక్కుటంబుగఁ గలతపెట్టెను
సూటిగాఁబెను పామువాలము - చొఱవతోఁ దగఁబట్టియాడ్చెను
ఘాటు మీఱెడు గరళమున్ వెలి - గ్రక్కుచెగసిన దాని శిరమున
నీటు లొలుకఁగ నొడలు కదలఁగ - నృత్యమాడిన వానికతమున
మేటికాళియునుచ్చి పైగడు - మించి నిలిచిన వానిచే నిక
నేటితో నిలఁ బ్రతుకఁజాలము - నెలఁత! ముగిసెను బ్రతుకుమాకిక!

4. ధేనుకాసురుఁ దిగిచి వడివడిఁ - ద్రిప్పి నింగికి మీటి చంపెను
కానయందలి తాటి యసురను - గాంచి పండ్లను నెగరఁజిమ్మెను
వాన నాపగ గిరిని గొడుగుగఁ - బట్టియెత్తుచు నాలఁగాచెను
వానివలననె నేడు మొదలిక - బ్రతుకు మాకిక ముగిసిపోయెను.

5. బృందయువతులు చిలుకఁబెట్టిన - పెరుగుపాలను ద్రాగుచుండగ
సుందరంబగు వంశనాళము - సొగసులీనెడు భుజములన్ దగ
సుందరాంగులు పట్టి త్రాటను - జుట్టి గట్టిగఁ దన్నుఁ గట్టఁగ
నందె చౌర్యముఁ జేయఁజాలక - నటుల నిలిచెడు వానికతమున
సుందరీ! యిల బ్రతుకఁజాలము . సుదతి! ముగిసితమతని కతమున.

6. తప్పటడుగులఁ బెట్టునాటికె - దైత్యకాంతను పూతనాఖ్యను
మెప్పులొలికెడు తల్లివేషము - మెఱయవచ్చెడు దాసిగాంచెను
తప్పుతలఁపుల గాంచిపాలను - దాని ప్రాణముతోడఁ జుఱ్ఱెను
ఇప్పుడాతని వలన మాకిక - నిలను జీవన మంతరించెను
అప్పుడంటిన పాలవిషమిటు - లమ్మరో! మము ముంచివైచెను.

7. చెన్నులొలికెడు చిన్నిరూపున - శ్రీమహాబలిఁ జేరివేఁడెను,
మన్నుమూఁడే యడుగులొసఁగవె మాన్యుఁడాయని చేయిఁజాపెను
మన్ను నంతయు నొక్కయడుగున - మహిమ మెఱయఁగఁ గొలిచివైచెను
మిన్ను రెండవ యడుగులోఁబడ - మేటిరూపము దాల్చిమెఱసెను,
అన్నమిన్నరో! అతనివలననె - యవనిమాబ్రతు కంతమొందెను
మన్నుగొలిచిన యతనివలననె - మాకుబ్రతుకీల నంతమొందెను.

8 పొలుపులొలికెడు మొగిలిపువ్వుల - పొదలు వెలుపలఁ బొదలుచుండఁగఁ
జలువలీనెడు కమలవనములు - సలిలమందెపు డలరుచుండఁగ,
వెలయు మడుగున మకరివలఁబడి - పెన్వగన్ విలపించు యేనుగఁ
దలఁచి చక్రమునేసి యాపగఁ - దఱుమఁగొట్టిన, యంత నింపుగఁ
కలువపూవులఁ గరమునంగొని - కరియొసంగిన భక్తిపూజల
కలరి పూజల గొన్నయాతడె - అతిశయంబుగ నిత్యసూరుల
కొలువుఁగొనియెడు పరమపురుషుఁడె - కొమ్మరోయిపు డతనివలననె
నిలను మాకిల బ్రతుకుముగిసెను - ఇంతిరో యిపు డతనివలననె.

9. మిన్నుముట్టెడు కారుమబ్బుల - మేలిరంగుల మేనితోడను
జెన్నుమీఱఁగఁ గానమేపుచు - జెలఁగియాడుచు పీకతోడను
మన్నుచేడియ నెత్తి నెలవున - మహిమవెలయఁగ నిలిపిచెలఁగెనె,
సన్నుతుండు మహావరాహుఁడు - చానమాకిక నతనివలననె
మన్నుపై బ్రతు కంతమొందెను - మహినినెత్తిన యతనికతమున
నెన్నడింకను బ్రతుకలేమిల - ఇంతి! బ్రతుకము వానికతమున.

10. అందమా నరవిందనయనుని - యతిశయంబగు దివ్యలీలల
చందమంత యశోదమాతకు - సరసతన్ వినుపించువేళల
సుందరాంగులు నూత్నయావన - శోభతో వెలుగొందుకాంతలు
బృందలో మును పాడినట్టివి - వేడ్కతో మొఱవెట్టుపల్కులు
డెందమందిడి పాశురంబుల - తీవిమెఱయఁగ భట్టరల్లెను
ఎందు దీని బఠించువారల - కెపుడులేదిల నెట్టిచెడుగును.

2_వ శతకము 10_వ దశకము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

భగవద్గీతోపదేశములు

శ్రీ వెలిదండ శ్రీనివాసరావు.

ఇత్యాది శ్రీమాన్ పరవస్తు లక్ష్మీనరసింహాస్వామివారి 'వ్యాసగీత' యందలి శ్లోక క్రమము ననుసరించి సంక్షేపింపబడి భావవిభజన చేయబడినది.

పురుషకాండము — 1. సాంఖ్యద్వికము.

(1. అర్జున విషాదము)

అన్నదమ్ములగు ధృతరాష్ట్ర పాండురాజులకు సమానముగా చెందవలసిన రాజ్యము, పాండురాజ మరణానంతరము, ఇద్దరి సుతబృందములకు కొంత కొంత యివ్వబడినను, ధృతరాష్ట్ర కుమారులగు దుర్యోధనాదులు ఇతరుల ఆస్తిని తాము పొందవలయునను లోభగుణముచే పాండుకుమారుల భాగమును గూడ తాము పొంద దలచి అప్పటి రాజుల యాచారమగు జూదమునకు వారిని పిలిచి ఆ జూదమున ఓడిపోవువారలు తమభాగమును గెలుచువారలకు వదలిపెట్టి అరణ్యముననను, అజ్ఞాతముగను కొన్నియేండ్లు గడపి, తిరిగి వచ్చినచో తమభాగ మును తాము తిరిగి పొందవచ్చునను నొక ధర్మనిర్ణయమును తామే (దుర్యోధ నాదులే) నిర్ణయించిరి. అయినను స్వయంనిర్ణయ ధర్మమును తామే నిర్వ హింప కుండుటచే రాయబారముల వలన ప్రయోజనమేర్పడ నందున, గత్యం తరములేక పాండుపుత్రులు, ధర్మనిర్వహణమునకై యుద్ధమార్గ మవలం బించిరి. యుద్ధభూమిలో అర్జునుడు తమరక్త బంధువులగు దుర్యోధనాదులను, గురువులగు భీష్మ ద్రోణాద్యాచార్యులను, చూచిన వెంటనే ఆవరకు ధృత రాష్ట్రుడు సంజయుని ద్వారా యుధిష్ఠిరునకు బంపిన యీ క్రిందివాక్యములు అతనికి జ్ఞాపకమునకు వచ్చెను.

చం॥ "అఖిల జనక్షయంబయి జయాపజయంబులు రెండునున్ దుదిన్
సుఖములుగాని యీపనికి జొత్తురె యుత్తము లట్లుగాక యీ
నిఖిల సుఖంబు లేమిటికి, నీవని, వృద్ధజనంబు బాలురన్
సఖులను బంధులన్ గురుల జంపితివేని దయాపయోనిధీ॥"

ఉద్యోగ పర్వము. 1 — 296.

క॥ "పా లీక కౌరవులు దు
శ్శీలతఁ జెడఁ దలఁచిరేని జెప్పెద రుధిరా
భీలాన్నంబునకంటెను
మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్ ॥"

ఉద్యోగ. 1 — 329.

అందుచే నతఁడు ప్రకృతి సంబంధమైన, యహంకార మమకారములకు లోఁబడి ధర్మనిర్వహణ దృష్టిని మఱచి, తన సారథియైన శ్రీకృష్ణునితో నీ విధముగా సంభాషించెను.

అధ్యాయ శ్లోకములు. 1 — 28, 29, 30.

అర్జునుఁడు:— ఓ కృష్ణా! యుద్ధము చేయగోరి యిచ్చటఁ గూడియున్న యీ నా బంధువులను చూడగా నా అవయవములన్నియు పట్లుతప్పుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది. శరీరము వడకుచున్నది. ఒడలు పులకరించు చున్నది. గాండీవము చేతినుండి జారిపోవుచున్నది. రథమునందు నిలువజాలను. మనస్సు భ్రమించు చున్నది. (కార్పణ్యదోషము).

2 — 2, 3.

శ్రీకృష్ణుడు:— ఓ అర్జునా! నీ వ్యాకులము అజ్ఞానులకు తగినది. అపకీర్తి కరమైనది. అది యుద్ధ సన్నద్ధమైన యీ సందిగ్ధ సమయమున నీ కెట్లు కలిగినది. నిశ్చేష్టతను పొందకుము. ఇది నీకు తగదు. నీచమైన మనోవ్యాకులతను విడిచి లెమ్ము.

1 — 38, 39, 40.

అర్జునుడు:— సరేకాని; అజ్ఞానులైన దుర్యోధనాదులు రాజ్యలోభము చేత వంశనాశనమువలన కలుగు దోషమును, మిత్రద్రోహమువలన గలుగు పాపమును తెలిసికొన లేకున్నను, అట్టి దోషమును, తెలిసిన మేము ఇట్టి పాపకార్యమునుండి యేల మఱలగూడదు. కులనాశనమువలన పరంపరా గతములైన సదాచారములు నశించుచున్నవి. సదాచారములు పోవుటవలన దురాచారము లేర్పడును.

2 — 31.

శ్రీకృష్ణుడు :— నీవు అంత ఎక్కువగా ఒత్తిచెప్పుచున్న కులాచార ప్రాముఖ్యమును బట్టియే, నీ క్షత్రియ కులధర్మమును బట్టియే ధర్మయుద్ధ విషయమున సందేహించుట నీకు తగనిపని. అది స్వవచన వ్యాఘాతము.

ఇందుమూలమున అర్జునునకు అధర్మ ప్రవర్తకులపై యుద్ధము చేయవలసిన యావశ్యకత బోధపడెను.

2 — 4, 5.

అర్జునుడు — సరి బాగున్నది. అయితే, యుద్ధమునందు పూజ్యులైన భీష్మ ద్రోణాదులమీద నే నెట్లు బాణములను ప్రయోగింపగలను. మహానుభావులైన గురువులను చంపి, నెత్తురుతో గూడిన యర్థకామభోగములను అనుభవించుటకన్న వారిని జంపకుండ బిచ్చ మెత్తుకొని జీవించుట మేలుకదా. అని, తాను మున్ను వినియుండిన ధృతరాష్ట్రుని వాక్యములకు తనకు గలిగిన మనోవ్యాకులత చేత, తారుమారుజేసి యేకరువు పెట్టెను. ఇందు దేహి దేహ ఐక్యభావనగలదు. ఇది యొకప్రత్యేక సమస్య. కావున దీనింగూర్చి యథార్థమును బోధపరుపవలసిన యావశ్యకత యేర్పడుచున్నది. ఇదియే భగవద్గీత యొక్క ముఖ్యోద్దేశము.

(2. సాంఖ్యోపదేశము.)

2 — 11, 12, 13,

శ్రీకృష్ణుడు :— అర్జునా ! నీవు శోకింప నవసరములేని వారిని గూర్చి శోకించుచున్నావు. మఱియు నీ శోకమునకు పండితునివలె కారణములను సైతము తెలుపుచున్నావు. కాని నిజమైన పండితులు బ్రతికియున్నవారిని గూర్చియు, చనిపోయిన వారిని గూర్చియు, నీవలె శోకింపరు. ఎందువలన ననగా, నేనుగాని, నీవుగాని, ఈ రాజులుకాని యెప్పుడును లేనివారముగాము. ఇకముందు లేకబోవు వారము గాము. దేహికి ఈ దేహమునందు బాల్యము యావనము, ముసలితనము కలుగునట్లే వేరొక దేహము మరణానంతరమున గలుగుచున్నది. సత్యమైన యీ విషయమును తెలిసిన జ్ఞాని నీవలె మోహావిష్టుడై శోకింపడు.

2 — 23, 24, 25.

దేహియైన యాత్మ శాశ్వతమైనది. అట్టి ఆత్మను ఛేదించుటకును, కాల్చుటకును వీలులేదు. అది యనాదియైనది. కావున నట్టి యాత్మజ్ఞానమును పొంది దుఃఖమును వదలుము.

13 — 12.

దేనిని తెలిసికొనిన వానికి, ఉత్తమపురుషార్థమైన మోక్షము కలుగునో, ఏది అనాదియైనదో, ఏది పరబ్రహ్మమో అట్టి తెలిసికొనవలసిన విషయమును నీకు జెప్పెదను.

13 — 15.

ఏది సమస్త ఇంద్రియములచే బ్రకాశించుచున్నట్లున్నను, సకలేంద్రియ రహితమైనదో, త్రిగుణానుభవమును పొందుచుండునట్లున్నను త్రిగుణాతీతమైనదో, అదియే తెలిసికొనవలసిన విషయము. అది ఆత్మ.

13 — 6, 7. ; 7 — 4.

అట్టి క్షేత్రజ్ఞుడగు ఆత్మయొక్కయు, క్షేత్రమైన దేహము యొక్కయు లక్షణము లివి.

13 — 35.

ఎవరుజ్ఞాన దృష్టిచేత పైన సూచించిన విధముగ క్షేత్ర, క్షేత్రజ్ఞ భేదమును, క్షేత్రజ్ఞుడు ప్రకృతి సంబంధమైన క్షేత్రవాసనలనుండి విడివడు సాధనమును తెలిసికొనునో అతడు ఉత్తమపురుషార్థమగు మోక్షమును పొందును.

13 — 20, 22.

క్షేత్రసంబంధమైన ప్రకృతి, క్షేత్రజ్ఞ సంబంధమైన ఆత్మ (పురుషుడు) ఈ రెండును, అనాదులే. ప్రకృతినుండి పుట్టుచుండు వికారగుణములను పురుషుడు తానుచేయు కర్మలద్వారా అనుభవించును. అట్టి గుణసంగము కారణముచే నతనికి క్రొత్తజన్మములు కలుగుచుండును.

13 — 24.

అయినను, ఎవరు ఇట్లు ఆత్మ స్వరూపుడైన పురుషుని గుణయుక్తమైన ప్రకృతిని, వేరు వేరుగా చూడగలరో వారు ఎట్టి కర్మల జేయుచున్నను మరల జన్మించరు.

2 — 20.

ఆత్మకు చావు పుటుకలులేవు. శరీరము నాశనమగుచుండగా ఆత్మ నాశము నొందదు.

పురుషకాండము — 2. కర్మచతుష్కము.

(3. బుద్ధి యోగోపదేశము.)

— 39.

ఓ అర్జునా! నీ కింతవరకు సాంఖ్యశాస్త్రము నందుగలఆత్మతత్వమును గురించిన ఆత్మా నాత్మ వివేకమును దెలిపియుంటిని. ఇక నే బుద్ధి యోగశాస్త్రము చేత, నీవు కర్మబంధమునుండి విడిపించు కొనగలవో దానిని దెల్పెదను వినుము.

2 — 47.

నీకు కర్మలయందే యధికారముగలదు కాని వానిఫలములయం దధి కారము లేదు. నీవు కర్మఫలములకు కారణము కావలదు. కర్మలను చేయ కుండుటయందా సక్తిగలవాడవు కాకుండుము అట్టివారు కర్మయోగులు లేక ఆత్మయోగులు అనబడుదురు.

5 — 12.

అట్టి ఆత్మయోగి కర్మలను జేయుచున్నను ఫలమును ఈశ్వరార్పణము చేయుచు. ఆత్మ యోగశాంతిని పొందును.

3 — 27.

ప్రకృతి యొక్క గుణములచేత నానావిధములుగా చేయబడుచున్న కర్మ లకు, తానే కర్తయని యహంకారముచేత ఆత్మజ్ఞానము లేనివాడు తలచును.

3 — 29

ప్రకృతివలన కలిగిన సత్వాది గుణములచేత సమ్మోహమును బొందిన వారు, ఫలాపేక్షచేత కర్మములను జేయుదురు. మందమతులును, కించిద్జ్ఞులును నైనట్టివారలను ఆత్మజ్ఞులు చలింపజేయ గూడదు.

4 — 19.

ఎవని సకలకర్మములును, కామసంకల్పములు కాకుండునో, మఱియు నా కర్మములు అతని జ్ఞానాగ్నిచే దహింపబడినవో అట్టివాడు జ్ఞాని.

4 — 22.

అయాచితముగా లభించిన దానితో తృప్తి జెందినవాడు, ద్వంద్వముల నతిక్రమించినవాడు, వైరమును విడచినవాడు, కార్యముల ఫలా ఫలముల యందు సమబుద్ధిగలవాడు, ఏకర్మలను జేసినను బంధింపబడడు.

(4· సన్యాసోపదేశము.)

9 — 27

నీవు చేయు సమస్తకర్మలను అనగా భుజించెడి యాహారమును, చేసెడు హోమములను, ఇచ్చెడి దానములను, ఆచరించెడి తపస్సును, ఇంత యేల, సకలమును నాకు అర్పించుము.

9 — 28.

ఈ రీతిని సకల కర్మలను నాకు అర్పణము చేయుటవలన పుణ్యపాపఫల రూపములైన కర్మబంధములనుండి నీవు విముక్తబడుదువు. సన్యాస యోగ యుక్తాత్ముడవై నన్ను పొందగలవు.

5 — 10

ఎవడు తాను చేయు సకల కర్మలను, అనాసక్తితో బ్రహ్మార్పణముగ చేయుచున్నాడో అట్టివాడు తామరాకు నీటిలోనున్నను ఏవిధముగా నీటిచేత అంట బడదో అదేవిధముగా కర్మలను చేయుచున్నను వానిపాపముచేత నంటబడడు.

18· — 56.

సకల కర్మలను ఎప్పుడును చేయుచును నన్ను పూర్ణముగా శరణుబొందిన వాడు, నా యనుగ్రహమువలన నిత్యమైనట్టిదియు, నాశనములేనట్టిదియు, నగు మోక్షమును పొందును.

2 — 51.

సమత్వబుద్ధి యోగముతో గూడిన బుద్ధిమంతులు కర్మలను జేయు చున్నను ఫలాపేక్షయుండదు గాన జన్మబంధము వీడినవారై దుఃఖరహితమైన మోక్షమును పొందుదురు.

(5. కర్మనియోగోపదేశము.)

3 — 2.

అర్జునుడు :— ఓ కృష్ణా! నీవు రెండు విధములుగా చెప్పుచున్నావు. మొదట ఆత్మా నాత్మ వివేకమగు ఆత్మజ్ఞానము గొప్పదని చెప్పితివి. తరువాత ఫలాపేక్షలేని కర్మ గొప్పదని చెప్పితివి. ఆ రెంటిలో నాకు ఏది శ్రేయోదాయకము? నుడువుము.

3 — 3.

శ్రీకృష్ణుడు :— అర్జునా! ఈ లోకమునందు సాంఖ్యులకు జ్ఞానయోగము, యోగులకు (నాతో సంయోగము నొందదలచిన వారికి) కర్మయోగము ఈ రెంటి నిష్ఠలను నీకు జెప్పియుంటిని.

3 — 5.

ప్రతి మనుజుడును ప్రకృతివలన బుట్టిన గుణములచేత, అవశ్యముగా కర్మమును చేయింప బడుచున్నాడు. అనగా ప్రతివాడును కర్మమునుచేయునట్లు చేయబడుచున్నాడు. కావున, ఎవడును, ఒక్కక్షణమైనను కర్మను చేయకుండ నుండడు.

3 — 6.

ఎవడు కర్మేంద్రియ వ్యాపారములను అరికట్టి, విషయములను జ్ఞానేంద్రియముల ద్వారా మనస్సునందు కోరుచుండునో అతడు ఆత్మజ్ఞానము లేనందున మిథ్యాచారు డనిపించుకొనును.

3 — 7.

ఎవడు జ్ఞానేంద్రియములను గూడ మనస్సుచే నరికట్టి కర్మేంద్రియములచే ఫలాసక్తిలేక కర్మయోగమును (కర్మల ద్వారా నన్ను పొందుటకు) చేయుచున్నాడో అతడు విశేషమును పొందుచున్నాడు.

3 — 8.

కావున నీవు నీ నియతకర్మలను చేయుచుండుము. కర్మచేయకుండుట కంటె కర్మచేయుటయే మేలు. ఏలననగా కర్మచేయని వానికి శరీరయాత్ర బాగుగా సిద్ధింపదు.

3 — 19.

ఫలాసక్తిలేక కర్మచేసెడి పురుషుడు మోక్షము నొందును. కావున నీవు ఎల్లప్పుడును ఫలాపేక్షలేక నీ నియత కర్మను చేయుము.

3 — 25, 26

మూఢులు ఫలము నాశించి ఎట్లు సంగముతో పనిని జేయుదురో అట్లే జ్ఞానియు, నిస్సంగియై లోకపు మేలు దలంచి తన పనిని గూడ ఉత్సాహముతో జేయవలెను. ఆశతోగూడి పనిచేయు అజ్ఞానులకు జ్ఞానియైనవాడు బుద్ధి భేదమును గలిగింపగూడదు. తాను కర్మయోగమార్గమున నిలిచి పనిచేయుచు ఇతరులుగూడ నెల్లపనులను ఆసక్తితో చేయునట్లు తాను నడుప వలయును.

18 — 45.

మానవుడు తనకు సహజమైన కర్మమును శ్రద్ధతో జేయుచు మోక్షసిద్ధి పొందెడి విధమును తెలిపెదను వినుము.

18 — 46.

ఈ సమస్త భూతములకును కారణమైనవాడును, సర్వ ప్రపంచము నందును నిండియున్నవాడును అగు నీశ్వరుని మానవుడు తన కర్మలచేత నారాధించుటవలన మోక్షసిద్ధి పొందును.

18 — 47. ; 3 — 35

ఏకర్మచేసినను ఫలత్యాగము అవసరము, అని యిదివరలో బోధించి యుండుటచే, మానవుడు తన స్వభావమునకు అనుకూలమైన యేకర్మ తనకు లభించినను, అట్టికర్మ యితరులకు, వారి వారి స్వభావములను బట్టి లభించిన కర్మకంటె పైకి లౌకికముగ హీనముగ కనబడుచుండినను అట్టి యితరుల కర్మలను తాను చేయుటకై ప్రయత్నించుటకంటె తనకు లభించిన కర్మనే చేయుట వలన మోక్షార్హుడగును.

18 - 1.

అర్జునుడు :— నీవు చెప్పిన కర్మ సన్యాసము, కర్మఫల త్యాగముల యొక్క యాథార్థ్యమును వేరు వేరుగా చెప్పుము.

18 — 2

శ్రీ కృష్ణుడు :— ఆత్మానాత్మ వివేక జ్ఞానులు (1) కామ్య కర్మలను వదలుట — కర్మ సన్యాసము. (2) సకలకర్మ ఫలమును వదలుట — కర్మఫల త్యాగము.

18 — 7, 8, 9.

మనుజులు తమ కర్మలయెడ జూపు స్వభావములు మూడు విధములు. (1) తామసము:— బుద్ధిపూర్వకముగా చేయుటకు నిరాకరించుట. (2) రాజసము — కష్టముగా నున్నదని చేయకుండుట. (3) సాత్వికము — ఫలాపేక్ష లేక చేయుట.

18 — 12.

ఫలాపేక్షను విడువక, కర్మలను చేయువారికి, మరణానంతరము అనిష్టము, ఇష్టము, ఇష్టానిష్టము అను మూడు విధములగు కర్మఫలములు కలిగి పునర్జన్మమును గలిగించును. ఫలాపేక్ష విడిచినవారు జన్మరహితు లగుదురు.

4 — 13.

జన్మకాలమందు, పూర్వజన్మము ననుసరించి యేర్పడిన సత్త్వరజస్తమో గుణముల భేదముల ననుసరించియు, పూర్వకర్మ వాసనల భేదముల ననుసరించియు, మానవులను నేను నాలుగు తరగతులుగ సృష్టించితిని. అనగా వారే ఆ యా భేదములను బట్టి పుట్టుచుందురు.

4 — 15.

మోక్షాసక్తులగువారు పూర్వకాలమునందు గూడ కర్తృత్వాభిమానములును, ఫలాసక్తతయును, తమకు లేవని గ్రహించి కర్మలను చేసిరి. వారి వలె నీవును చేయుము.

(6. కర్మవివేకోపదేశము)

4 — 18.

కర్మయందు అకర్మను, అకర్మయందు కర్మను జూచువారు మనుష్యులలో బుద్ధిమంతులు. అనగా ప్రకృతిబద్ధుడైన జీవాత్మ కర్మచేయుచుండగా అసలైన ఆత్మ తానుచేయుచుండుట లేదని తెలిసికొనుట, మఱియు నా జీవాత్మ ఏకర్మను జేయనపుడు, తాను, అసలైన యాత్మతో నైక్యము ననుభవించుట అను కర్మను జేయుచుండు నట్లు తెలిసికొనుట.

18 — 13, 14, 15,

లోకములో ప్రతికర్మకును ఐదు అంశములు, (Factors) కలవు. (1) శరీరము (2) కర్త (3) ఇంద్రియములు (4) వేర్వేరు క్రియలు. (5) దైవము. మఱియు ప్రతికర్మ మూడు విధములుగ జేయబడుచున్నది. (1) మనస్సుచేత, (2) వాక్కుచేత, (3)శరీరముచేత.

18 — 18.

కర్మప్రవృత్తికి మూడు అంశములు (factors) (1) జ్ఞానకారణమైన బుద్ధి — కరణము లేక జ్ఞానము (2) బుద్ధిచేత దెలియదగిన విషయము — కర్మ (3) విషయము నెఱుగువాడు — కర్త.

18 — 19.

సాంఖ్యశాస్త్రమును బట్టి పై జెప్పిన జ్ఞాన, కర్మ, కర్తలు ప్రకృతి సంబంధమైన సత్వరజస్తమో గుణభేదముల బట్టి మొదటి మూడును, ఒక్కొక్కటి మూడు విధములుగా నుండును.

18 — 20 నుండి 28 వఱకు.

పై జెప్పిన 3 × 3=9 రకముల కర్మప్రవృత్తి, కారణవిషయముల లక్షణములు ఈ క్రింది విధముగా నుండును.

విషయము.	సాత్వికము.	రాజసము.	తామసము.
జ్ఞానము.	విభక్తములైన సకల భూతములయందు, అవిభక్తమైనట్టియు, అవ్యయమైనటియు, ఏకమునైన పరమాత్మను చూచుజ్ఞానము.	సకలభూతముల యందును, రూపములందును, భావములందును గనబడుచున్న వానిని వేరు వేరుగా నున్నవని తెలిసికొను జ్ఞానము.	హేతు యుక్తము గానిదయు, పరమార్థము గానిదియు, అల్పమైనదియు నగు నొక విషయము నందే సకల జ్ఞానము ఉన్నటుల తలచు జ్ఞానము
కర్మ.	ఫలమును కోరకుండ, రాగ ద్వేషములులేక నియమితముగను, మమకారము లేకుండగను చేయబడెడి కర్మ.	కోరిక గలవాని చేత గాని, అహంకారము గల వాని చేతగాని విశేషమైన శ్రమతోగూడునటుల చేయబడు కర్మ.	కర్మములయొక్క పర్యవసానమును, దానివలన గలిగెడి నష్టమును, హింసను, తనసామర్థ్యమును, తెలిసికొనకుండ అవివేకమున చేయబడు కర్మ.
కర్త.	ఫలాపేక్షరహితుడును, అభిమాన రహితుడును, ధైర్యోత్సాహములు కల వాడును, ఫలా ఫలముల వలన చలింపనివాడును.	దారా పుత్రాదులందు మాత్రము ప్రత్యేకముగా ప్రీతిగలవాడును, కర్మఫలమును గోరువాడును, పరధనాభిలాషియు, హింసించుటయే స్వభావముగాగల వాడును, విహితమైన శౌచములేనివాడును, లాభనష్టములు గలిగినప్డు హర్ష శోకములు గలవాడును.	యుక్తుడుగాని వాడు, పామరుడు, జడుడు, మోసగాడు, వంచకుడు, ఆలస్యము చేయువాడు, శోకస్వభావముగలవాడు, కాలయాపనము చేయువాడు.

17 — 7. నుండి 22. వఱకు.

మానవ కర్మములు నాలుగు విధములు. అవి (1) ఆహారమును జఠరాగ్నిలో హోమము చేయుట—కర్మచేయుటకు శక్తిని బొందుట. (2) యజ్ఞము చేయుట—ప్రాపంచిక కర్మలకై శక్తిని వెచ్చించుట. (3) తపస్సుచేయుట—కర్మచేయుటకు శక్తిని సమకూర్చుకొనుట. (4) దానముచేయుట—తన శక్తి నితరులకొఱకు వినియోగించుట. ఈ నాలుగు విధములగు కర్మములకు సత్త్వరజస్తమో గుణభేదములు గలవు.

విషయము.	సాత్త్వికము.	రాజసము.	తామసము.
(1) ఆహారము.	ఆయువును, సత్త్వగుణమును, బలమును, ఆరోగ్యమును, సుఖమును, సంతోషమును, వృద్ధిపొందించునవియు, రసవంతములు, చమురుగలవి, చిరకాలముండునవి, చూచుటకింపైనవి, సాత్త్విక స్వభావులకు ఇష్టము లగును.	చేదు, పులుపు, ఉప్పు మిక్కిలివేడి, కారముగలవి, ఎండినవి, దాహముగలుగజేయునవి, దుఃఖమును, శోకమును, రోగమును, కలుగజేయు ఆహారములు రాజస స్వభావముగలవారికి ఇష్టము లగును.	వండినతరువాత మూడు గంటలు నిలువయున్నది, రసములేనిది, పాసిపోయినది, ఒకరోజు నిలువయున్నది, తినగా మిగిలినది, తాను కష్టపడకుండ వచ్చినది యగు నాహారము తామస స్వభావము గలవారి కిష్టమగును.

(2) తపస్సు:— శారీరకతపస్సు, వాక్తపస్సు, మానసికతపస్సు అని మూడు విధములైనది.

శారీరకతపస్సు.	వాక్తపస్సు.	మానసికతపస్సు.
దేవతలను బ్రహ్మజ్ఞానులను గురువులను పూజించుట, శుచిత్వము, సత్ప్రవర్తనము, బ్రహ్మచర్యము, అహింస వీనిని కలిగియుండుట.	పరులమనస్సు నొప్పింపకుండునట్లును, సత్యము, ప్రియము, హితము నయిన సంభాషణము చేయుట, జ్ఞానబోధక గ్రంథములు చదువుట.	ప్రసన్నమైన మనస్సు, సౌమ్య స్వభావము, మౌనము, ఆత్మనిగ్రహము, అంతఃకరణ శుద్ధిని గలిగియుండుట.

ఈ మూడు విధములైన తపస్సు, త్రిగుణభేదముల గల్గియున్నది.

విషయము.	సాత్త్వికము.	రాజసము.	తామసము.
తపస్సు.	ఉత్తమమైన శ్రద్ధను బూనువారగుచు ఫలమును గోరక కర్మజేయువారును, యోగయుక్తులును జేసెడి కర్మలు.	ఇతరులు, తనను సత్కరించుటకును గౌరవించుటకును డంబముగా జేయబడు కర్మలు.	మూర్ఖపు పట్టు పట్టి తనకు కష్టము కలిగించునవి, ఇతరులకు హాని జేయునవి యగు కర్మలు.
(3)యజ్ఞము	విధియని మనసున నిశ్చయించుకొని ఫలాపేక్ష లేక చేయబడు కర్మ	ఫలాపేక్షతో గాని దంభముకొఱకుగాని చేయబడు కర్మ.	సరియైనది కానటువంటిది, ఇతరులకు కొంచెమైనను ఉపయోగించని, శ్రద్ధతో కూడియుండని కర్మ
(4)దానము	ప్రత్యుపకారము చేయుటకు శక్తిలేనివానికి, దేశకాల పాత్రలకు తగినట్లు చేయు దానము.	ప్రత్యుపకారముకొఱకు గాని, ముందుఫలమును కోరి గాని, అతికష్టముతో చేయబడునది గాని అగు దానము.	దేశకాల పాత్రలకు తగనిదియును, అసత్కృతమును, నిర్లక్ష్యభావముతో నీబడునదియు నగు దానము.

4 — 13.

ఈ వరకు చెప్పినట్లు పూర్వజన్మ సంబంధమైన సత్త్వరజస్తమో గుణములను బట్టి పుట్టిన మానవుల స్వభావములు మొత్తముమీద నాలుగువిధములుగా విభజింపబడి అట్టివారికి సాంకేతిక నామము లొసగబడినవి.

18 — 41 నుండి 44 వఱకు.

1 సాత్త్వికప్రధానులు. (బ్రాహ్మణులు)	2 రాజసప్రధానులు. (క్షత్రియులు)	3 తామసప్రధానులు. (వైశ్యులు)	4 తామసోత్కృష్టులు. (శూద్రులు)
బాహ్యాభ్యంతర శేంద్రియ నిగ్రహము, శుచిత్వము, తపస్సు, ఓరిమి, ఋజుత్వము, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్యము.	శూరత్వము, తేజస్సు, ధీరత్వము, దక్షత్వము, ధైర్యము, దానము, సత్పరిపాలనము.	వ్యవసాయము పశుపాలనము, వాణిజ్యము.	సంఘ పరిచర్య.

పుట్టుకతో వ్యక్తులకు ఏర్పడిన పై స్వభావకర్మలు, క్రమక్రమముగా ఆయా వ్యక్తుల కుటుంబములకు, ఆ కుటుంబముల సమూహములైన కులములకు, వృత్తులుగా నియమింపబడినవి.

పురుషకాండము — 3. జ్ఞాన చతుష్కము.

(7. దైవాసుర సంపద్వివేకోపదేశము.)

16 — 6.

ఈ లోకమున మానవులు దేవస్వభావముగల వారనియు, అసురస్వభావము గల వారనియు రెండు విధములు.

16 — 1, 3.

దేవస్వభావ లక్షణములు కొన్ని :— 1. అచాపలము, 2. అద్రోహము, 3. అభయము, 4. అహింస, 5. ఓర్పు, 6. క్రోధరాహిత్యము, 7. జ్ఞానయోగనిష్ఠ, 8. దానశీలము, 9. ధైర్యము, 10. నమ్రభావము, 11. నిగ్రహము, 12. పిశునత్వ రాహిత్యము, 13. భూతదయ, 14. లజ్జ, 15. విషయచాపల్యరాహిత్యము, 16. శాంతి, 17. శుచిత్వము, 18. సత్యము, 19. సత్యసంశుద్ధి, 20. సత్ప్రవర్తనము, 21. స్వాతిశయ రాహిత్యము.

16 — 4, 7 నుండి 17 వఱకు.

అసురస్వభావ లక్షణములు కొన్ని :— 1. అజ్ఞానము, 2. ఆత్మజ్ఞాన రాహిత్యము, 3. అన్యాయవర్తనము, 4. అశుచిత్వము, 5. అసత్యము, 6. అసహ్యవ్రత పరత్వము, 7. అహంకారత్వము, 8. కపటము, 9. కాఠిన్యము, 10. కామ క్రోధ మోహపరాయణత్వము, 11. కోపము, 12. గర్వము, 13. డంబము, 14. దురాచారము, 15. దురాశా పరత్వము, 16. బలదర్పము, 17. వినయ విహీనత, 18. స్వాతిశయము.

16 — 5.

దేవ స్వభావము మోక్షమును గలుగజేయును; ఆసుర స్వభావము బంధమును గలిగించును.

(8. గుణత్రయ విభాగోపదేశము.)

14 — 1.

శ్రీ కృష్ణుడు :— అర్జునా ! ఏజ్ఞానమును పొంది మునులెల్లరును సంసార బంధము (పునర్జన్మము) నుండి, మోక్షమును పొందిరో, అట్టి పరమాత్మ విషయక జ్ఞానమును గూర్చి మఱల జెప్పుచున్నాను, వినుము.

14 — 2.

ఈ జ్ఞానము నాశ్రయించి నా స్వరూపమును బొందినవారై సృష్టికాలమందు మరల పుట్టరు. ప్రళయకాలమందు నశింపరు.

14 — 3.

'మహత్ బ్రహ్మ' యనబడు ప్రకృతియే సమస్తజీవకోటిని పుట్టించు క్షేత్రము. దానియందు నేను బీజము నుంచుచున్నాను. అందువలననే సమస్త భూతములును పుట్టుచున్నవి.

14 — 5.

సత్త్వము, రజస్సు, తమస్సు, అను మూడు గుణములు ప్రకృతినుండి పుట్టును. అవి అవ్యయుడగు ఆత్మను దేహమునందు బంధించును. ఆ మూడు గుణముల చర్యలు నీ క్రిందివిధమున నుండును.

	సత్త్వము.	రజస్సు.	తమస్సు.
14 — 6, 7, 8, 9.	1. నిర్మలమైన దగుటచే ప్రకాశించునది.	1. అనురాగరూపమైనది.	1. వివేకహీనునిగ జేయునది.
	2. నిరుపద్రవమైనది.	2. విషయవాంఛను సంగమును గలిగించునది.	2. మఱపు, మాంద్యము, నిద్రలను గలిగించునది.
	3. జ్ఞాన సంపాదనమునందును, సుఖసంపాదనమునందును, ఆసక్తిని గలిగించునది.	3. కర్మములందు అభిమానమును గలిగించునది.	3. అజ్ఞానమునందు దేహిని జేర్చును.
14 — 10.	మూడు గుణములను గూడ తప్పక కలిగియున్న ప్రకృతిసంబంధమగు దేహమునందు ఒకప్పుడు ఈ సత్త్వగుణము మిగిలిన రెంటికంటె వృద్ధిగా నుండవచ్చును.	అదేవిధముగా ఒకప్పుడు ఈ రజోగుణము మిగిలిన రెంటికంటె వృద్ధిగానుండ వచ్చును	అదేవిధముగా ఒకప్పుడు ఈ తమోగుణము, మిగిలిన రెంటికంటె వృద్ధిగానుండ వచ్చును.

14 — 11 నుండి 15 వఱకు.	ఎట్లనగా :— బుద్ధిరూపమగు జ్ఞానము దేహమందలి జ్ఞానేంద్రియములన్నిటియందును, ఎప్పుడుపుట్టునో అప్పుడు సత్త్వగుణము వృద్ధినొందును. ఆ గుణముతో మరణించిన వాడు పుణ్యలోకములను బొందును.	ద్రివ్యలోభత్వము, ప్రవృత్తి, కర్మారంభము, అశాంతి, ఆశ, మొదలగు గుణములు ఏర్పడినపుడు రజోగుణము వృద్ధినొందును. ఆ గుణములు రజోవృద్ధి సూచకములు. ఆ గుణములతో నురణించినవాడు మఱల నీ లోకమున జనించును.	అజ్ఞానము, నిర్వ్యాపారము, మదోన్మత్తత, మూఢభావము, తమోగుణ వృద్ధి సూచకములు. ఈ గుణములతో మరణించిన వాడు మఱల నీ లోకమున మూఢ ప్రాణులందు (జంతువులందు) జనించును.

(9. స్థితప్రజ్ఞత్వోపదేశము.)

14 — 21.

అర్జునుడు :— ఓ కృష్ణా ! నీవు ఇంతవఱకు జెప్పినట్లు ప్రకృతిగుణములగు సత్త్వరజస్తమో గుణములను జయించిన పురుషుని లక్షణము లెట్లుండును.

14 — 22.

శ్రీ కృష్ణుడు :— అర్జునా ! మానసికముగ త్రిగుణాతీతుడైన ఆత్మయోగి తన దేహమునందలి సత్త్వగుణమువలన గలుగు ప్రకాశముగాని, రజోగుణము వలన గలుగు కర్మప్రవృత్తిగాని, తమోగుణమువలన గలుగు మోహముగాని తనకు తటస్థించినపుడు వానివలన తనలో మార్పును అనుభవింపడు.
మఱియు,

12 — 13 నుండి 19 వఱకు.

ఈ క్రింద పేర్కొనబడిన గుణములుగలవారు ఆత్మయోగులు, నా భక్తులు మోక్షార్హులు.

1. అందరియెడ మైత్రిగలవాడు. 2. ఆత్మ నిగ్రహముగలవాడు. 3. ఉదాసీనుడు. 4. ఓర్మిగలవాడు. 5. కర్మఫలత్యాగి. 6. కోరికలులేనివాడు. 7. నిత్యసంతుష్టుడు. 8. నిందా స్తోత్రములయందు సమబుద్ధిగలవాడు. 9. నేర్పరి. 10. పరిశుద్ధుడు. 11. అహంకార మమకార రహితుడు. 12. లభించినదానితో తృప్తిబొందువాడు. 13. లోకమునకు తనవలనను తనకు లోకమువలనను భాధ

లేనివాడు. 14. విచార రహితుడు. 15. శత్రుమిత్రులయందు సమబుద్ధి గలవాడు. 16. శుభాశుభములను వీడినవాడు. 17. శోక మోహములు హర్ష ద్వేషములు లేనివాడు. 18. సకలభూతములను ద్వేషింపనివాడు. 19. సంతోషము, క్రోధము, భయము, తొందరలేనివాడు. 20. సుఖ దుఃఖములయందు సమత్వముగలవాడు. 21. (మొత్తముమీద) స్థిరచిత్తుడు.

2 — 54.

అర్జునుడు:— ఓ కృష్ణా! నీ విప్పుడు చెప్పిన నీ భక్తుడును, మోహాస్పదుడును, అగు స్థిరచిత్తుని లక్షణములేమి ?

2 — 55 నుండి 59 వఱకు.

శ్రీ కృష్ణుడు:— ఎప్పుడు పురుషుడు తన మనస్సునందు గలిగెడి కోరికలన్నిటిని విడిచి తాను ఆత్మయందే ఆనందించుచుండునో అప్పుడు అతడు స్థిరచిత్తుడు లేక స్థితప్రజ్ఞుడు అనబడును. అతడు:—

1. దుఃఖములు సంభవించినపుడు శోకింపడు.

2. సుఖములు గలిగినపుడు సమ్మోదమును బొందడు.

3. స్వజనులపట్లను, పరజనులపట్లను అనురాగ క్రోధములను గలిగియుండడు.

4. ఎప్పుడును తన యింద్రియములను, సమస్తమైన యింద్రియ విషయములనుండి కూర్మము తన యంగములను మఱల్చుకొనునట్లు మఱల్చుకొనును.

5. ఇంద్రియార్థములగు శబ్దాది విషయములను మానినంతమాత్రమున విషయగ్రహణము మఱలునుగాని విషయవాంఛ మఱలదు. పరమాత్మను దర్శించుటవలననే ఆ విషయవాంఛా సంబంధమైన రాగము సైతము పోవును. స్థితప్రజ్ఞుడు ఆ విధముగా రాగమును విడుచును.

2 — 62. 63.

పురుషుడు ఏ యే విషయములయందు తన మనోలక్ష్యమును నిల్పునో ఆ యా విషయములయందు ఆతని యింద్రియములు సంగమును పొందును.

అట్టి మనస్సంగము వలన కోరికపుట్టును. కోరిక విఫలమైనపుడు కోపముపుట్టును. కోపమువలన వివశత్వము ఏర్పడును. అందువలన మఱపు, తద్ద్వారా సర్వ నాశనము గలుగును.

2 — 64 నుండి 67 వఱకు.

రాగద్వేషములు లేక తనవశమందున్న యింద్రియములద్వారా తాను విషయములయందు ప్రవర్తించుచున్నను నిష్కామ కర్మయోగి యెప్పుడును నిర్మలభావమును గలిగియుండును. సముద్రములో గాలి, యందలి యోడను పెడదారిని బెట్టునట్లు విషయాసక్తములైన యింద్రియములను అనుసరించెడి మనస్సు, అట్టి మనస్సులో నోలలాడెడి పురుషుని పెడదారిని బెట్టును. అనగా వివేకమును బోగొట్టును.

5 — 22.

విషయేంద్రియ సంయోగమువలన బుట్టిన భోగములు ఆద్యంతములను గలిగి దుఃఖహేతువు లగుచున్నవి. కావున స్థితప్రజ్ఞుడైన జ్ఞాని విషయభోగము లందాసక్తుడు కాడు.

3 — 36.

అర్జునుడు:— ఓ కృష్ణా! లోకములో కొందరు తమకు ఇష్టము లేక పోయినను బలవంతముగ పాపము చేయవలసి వచ్చుచున్నది. కారణమేమి?

3 — 37.

శ్రీ కృష్ణుడు:— ప్రకృతి సత్త్వరజస్తమో గుణమయమైనది. అట్టి దేహధారి జ్ఞానయోగమును ప్రారంభించినను పూర్వజన్మ ప్రారబ్ధముచే గలిగినట్టి అప్పటి శబ్దాదివిషయ సంబంధమైన కామము, ఇప్పుడు ఆపురుషుని ఆసంబంధమైన విషయాసక్తునిగా జేయును. అందువలన (ఆకామమువలన) సంభవించెడి క్రోధమువలన హింసాదులగు పాపములను జేయవలసి వచ్చుచున్నది.

(10 జ్ఞానయోగోపదేశము)

4 — 35.

జ్ఞానమనగా నీవు దేనిని తెలిసికొనుటవలన మఱల విషయములందు మోహమును పొందవో, సకలభూతములును మొదట నీయందును తరువాత నాయందును జూడ గలవో అదియే జ్ఞానము లేక ఆత్మజ్ఞానము

4 — 39.

శ్రద్ధకలవాడు, జ్ఞానమునందాసక్తి కలవాడు ఇంద్రియనిగ్రహము గలవాడును జ్ఞానమును పొందును. ఆ తరువాత శీఘ్రకాలములో మోక్షమును పొందును.

5 — 16. 17.

ఆత్మజ్ఞానముచేత నెవరి యజ్ఞానము పోవునో అట్టివాని జ్ఞానము పరమాత్మను తెలిసికొనునట్లు చేయును. ఆత్మజ్ఞానముచే పాపమును పోగొట్టుకొనిన వారు పరమాత్మయందు బుద్ధిగలవారై జన్మరాహిత్యమును పొందుదురు.

5 — 18.

ఆత్మజ్ఞానముగల పండితులు ప్రకృతివికారమున వివిధరూపములుగ ననగా చదువుకొనిన బ్రాహ్మణుడు, ఆవు, ఏనుగు, కుక్క, కుక్కమాంసమును పచనము జేయువాడు, (భక్షించువాడు) మొదలగు భిన్నరూపములుగ పైకి గనుబడు సమస్తభూతములయందును ఏకముగనున్న యేకైకమగు ఆత్మను దర్శింతురు.

18 — 20.

జ్ఞానమనగా ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞానమెప్పుడును సాత్త్వికజ్ఞానమనబడును.

13 — 8 నుండి 12 వఱకు.

ఆత్మజ్ఞానికి ఈ క్రింది లక్షణములుండును.

1. అహంకారరాహిత్యము. (నేను అను గర్వములేకుండుట) 2. అహింసా స్వభావము. 3. ఇంద్రియనిగ్రహము. 4. ఇష్టానిష్టములు ప్రాప్తించినప్పుడు కలతనొందకుండుట, 5. ఏకాంతనివాసమున కోరికగలిగియుండుట. 6. ఓర్పు. 7. గురుసేవ. (అజ్ఞానమును పోగొట్టువాడు గురువు). 8. చిత్తస్థైర్యము. 9. జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనము. 10. దంభాభిమానరాహిత్యము. 11. పరమాత్మయందు అనన్య నిశ్చలభక్తిని గలిగియుండుట 12. ప్రకృతిసంబంధములైన దారాపుత్రగృహాదులయందు నిర్మమత. 13. విషయవాంఛావిరక్తి. 14. శుచిత్వము. 15. సత్ప్రవర్తనము.

18 — 29, 30.

సత్త్వప్రధానియైన స్థితప్రజ్ఞునికి అవసరమైన పైఁ జెప్పిన జ్ఞానముగాక మిగత విషయములగు బుద్ధి, ధృతి, సుఖములు ప్రకృతిసంబంధములై సత్త్వరజస్తమో గుణములననుసరించి మూడు విధములుగ నుండును.

విషయము.	సాత్త్వికము.	రాజసము.	తామసము.
18—30, 31, 32. బుద్ధి	ప్రవృత్తి నివృత్తి మార్గములను కార్యాకార్యములను భయాభయములను బంధమోక్షములను తెలిసికొనిన బుద్ధి.	ధర్మాధర్మములను, కార్యాకార్యములను గ్రహింపలేకుండు బుద్ధి.	ధర్మాధర్మములను కార్యాకార్యములను అజ్ఞానముచే వ్యత్యస్తముగా గ్రహించు బుద్ధి.
18—33, 34, 35. ధృతి (మనోధైర్యము)	ఏ ధృతి (will) చేత పురుషుడు తన మనస్సుయొక్కయు, ఇంద్రియముల యొక్కయు, ప్రాణముల యొక్కయు, వివిధమైన వ్యాపారములనెల్ల నిశ్చలమైన యాత్మజ్ఞానముచె నియమించుచున్నాడో అట్టి ధృతి సాత్త్వికధృతి.	ఏ ధారణాశక్తిచే ఫలమునపేక్షించు పురుషుడు (మోక్షముమాట తలంపక) ధర్మార్థకామములను ఆసక్తితో అనుభవించుచుండునో ఆ ధారణాశక్తి రాజస ధృతి.	ఎవడు దుర్బుద్ధికలవాడై నిద్ర, భయము, శోకము, విషాదము, మత్తత, అను దోష గుణములను విడువజాలక యున్నాడో అట్టివాని ధృతి తామస ధృతి.

18 — 36

మానవుడు తన దినచర్యయందు కలుగు దుఃఖవిముక్తికై కోరుసుఖము మూడు విధములు.

18 — 37, 38, 39,

సాత్త్వికము.	రాజసము.	తామసము.
తన సొంతబుద్ధిని ఉపయోగించుటవలన గలిగినదియు జ్ఞానసాధనకై బుద్ధిని విషయేంద్రియాదులనుండి మరల్చునపుడు తొలుత కష్టముగా నున్నను తుదకు (ఆత్మయోగలగ్నమైనప్పుడు) సుఖముగా కనుబడునట్టిదియు. నగు సుఖము సాత్త్వికసుఖము.	విషయేంద్రియ సంయోగము వలన కలిగెడి సుఖము, తొలుత అమృతమువలెను, తుదకు విషపరిణామము గలదియు నగు సుఖము రాజససుఖము.	ఆరంభమునందును అంతమునందును ఆత్మకు మోహము గలుగజేయునదియు నిద్రవలనను, అలసత్వమువలనను ప్రమాదము (మత్తు) వలనను కలుగు సుఖము తామససుఖము.

18 — 40.

ప్రకృతినుండి పుట్టుచున్న ఈ సత్త్వాదిత్రిగుణములతో గూడియుండని వస్తువు ఎక్కడను లేదు.

పురుషకాండము— 4. అనుభూతిద్వికము.

(11. యోగసమాధి)

6 — 6.

తనను తాను గెలిచిన వానికి అనగా ప్రకృతితో నైక్యము నొందిన తనను (జీవాత్మను) ప్రకృతితో సంబంధములేని నిజమైనతాను (పురుషుడు—ఆత్మ) వశపరచుకొనిన యెడల నాజీవాత్మ తాను చేయు ప్రాపంచిక కర్మలను, పురుషుని యిష్టప్రకారముచేసి బంధువై, ఆ పురుషుని మోక్షమునకు సాయపడును. లేని యెడల ననగా నిజమైనతాను (పురుషుడు) ప్రకృతిబద్ధమైన తనను (జీవాత్మను) వశపరచుకొనని యెడల ఆ జీవాత్మ ప్రకృతి సంబంధమైన విషయవాంఛలచే నిజమైన తనకు శత్రువై మోక్షమును పొందనీయదు.

6 — 10.

కర్మయోగి, తాను ఒంటరిగానుండి ఆత్మనిగ్రహమును పూని, ఆశల విడచి, దేనిని గైకొనక, ఎల్లప్పుడును ఆత్మయోగమును బూనవలయును. అనగా తాను ఆత్మయను భావముకు జ్ఞాపక ముంచు కొనవలయును.

6 — 11, 12.

శుభ్రమైన స్థలమునందు, మిక్కిలి యెత్తును, పల్లమును గానిచోటను తన ఆసనము నేర్పరచుకొని యా యాసనము మీద దర్భలను, మృగ (జింక) చర్మమును, వస్త్రమును గ్రమముగా నుంచి మనస్సును, ఇంద్రియములను స్వాధీనము జేసికొని, మనస్సును, ఏకాగ్రముచేసి యాయాసనము మీద గూర్చుండి యాత్మశుద్ధికొఱకు యోగాభ్యాసము చేయవలయును.

6 — 13, 14, 15.

అటుల ధ్యానయోగపరుడైన కర్మయోగి, తన యొక్క దేహమును, మెడను, తలను, కదలకుండ స్థిరముగా నిలుపుచు దృష్టిని ఇతరపదార్థములయందు ప్రసరింప జేయక భ్రూమధ్యభాగమున నిలుపుచు, భయరహితుడును, శాంత

స్వభావుడును, బ్రహ్మచర్యవ్రతమునందున్నవాడునునై, మనస్సును స్వాధీనము చేసికొని నాయందు చిత్తము కలిగి నాకు భక్తుడై యుండవలయును. ఈ విధముగా నిశ్చలచిత్తుడై తను నెల్లప్పుడు నియమించుకొనిన కర్మయోగి నా స్థితిరూపమైన మోక్షమును, శాంతిని బొందును.

5 — 27, 28.

ఎవడు దేహము వెలుపల బుట్టి దేహమందు ప్రవేశించియున్న శబ్ద స్పర్శరూప రసగంధములైన విషయములను వెలుపలకు బంపివైచి, తన దృష్టిని రెండు కనుబొమల నడుమ నుంచి, ప్రాణాపాన (ఎగశ్వాస దిగశ్వాస) వాయువులను ముక్కురంధ్రములలో సమముగా సంచరించునటుల జేసి యింద్రియములను, మనస్సును, బుద్ధిని జయించి; కోరిక, భయము, కోపము, అనువానిని విడిచి మోక్షమునందు ఆసక్తిగలిగి ధ్యానపరాయణుడై యుండునో అతడు ఈ దేహమునందును దేహమును విడిచిన పిదపను ముక్తుడే యగును.

(12. జ్ఞాన సమాధి)

6 — 24, 25.

సంకల్పమువలన బుట్టిన సర్వకామములను పూర్తిగా విడచి మనస్సుచేతనే యింద్రియ సమూహమును సర్వవిషయములనుండి నిగ్రహించి ధైర్యముతో గూడిన బుద్ధితో మెల్లమెల్లగా విషయ వైరాగ్యమును బొందవలయును. మనస్సును ఆత్మయందు బాగుగా నిలిపి యేమియు చింతింపక యుండవలయును.

6 — 28, 29.

ఈ రీతిగా నెల్లప్పుడును, తనను ఆత్మయోగమునందుంచు కొనుచున్న జ్ఞానయోగి పాపరహితుడై సులభముగా బ్రహ్మత్వమును, నిరతిశయ బ్రహ్మానందమును (మోక్షమును) పొందును. అట్టి ఆత్మయోగి అంతటను ఆత్మదర్శనము చేయును. తాను సర్వభూతములయందును, సర్వభూతములు తనయందును, ఆత్మస్వరూపమున నున్న విధమును గ్రహించును.

18 — 50.

ఆత్మయోగ సిద్ధిని పొందినవాడు బ్రహ్మమును పొందెడి విధమును ఉత్తమమైన జ్ఞానసిద్ధాసాధనమును సంక్షేపముగ జెప్పెదను.

18 — 51, 52, 53.

1. సాత్త్వికబుద్ధితో గూడినవాడై సాత్త్వికధృతిచేత తనను నియమించుకొని,

2. శబ్దాదీంద్రియ విషయములను రాగద్వేషములను విడచి,

3. పవిత్రమును, నిర్జనమును అగు ప్రదేశమునందుండి,

4. మితముగ భుజించుచు, మనోవాక్కాయములను నియమించుకొనుచు,

5. నిత్యమును ధ్యానయోగపరుడై వైరాగ్యము నవలంబించి.

6. అహంకారమును, బలదర్పములను, కామక్రోధములను, ద్రవ్యసంగ్రహమును విడచి,

7. మమకారములేక, శాంతిని బొందుచు ఉన్నట్టివాడు బ్రహ్మసాక్షాత్కారమునకు దగినవాడు.

6 — 37, 38.

అర్జునుడు :— ఓ కృష్ణా! యోగమునందు శ్రద్ధమాత్రము గలిగి మనోనిగ్రహశక్తి చాలక, చలించి, యోగసిద్ధిని బొందజాలనివాడు ఏమగును? మఱియు మిక్కిలి మూఢుడగువాడు బ్రహ్మప్రాప్తి మార్గమున స్థిరమగు నాశ్రయము లేక రెంటికిని చెడినవాడై అనగా కామ్యబుద్ధితో జేయు కర్మఫల భోగముగాని, నిష్కామబుద్ధితో జేయు కర్మఫలత్యాగ - ఆత్మజ్ఞానముగాని పొందలేక చెదరిన మేఘమువలె నశించడుగదా!

6 — 40, 41, 42, 43.

శ్రీకృష్ణుడు :— ఓ అర్జునా! అట్టి యోగభ్రష్టునకు ఇహలోకమునందును, పరలోకమునందును, ఎప్పుడును వినాశము గలుగదు. శుభకర్మములను చేయువాడు ఎన్నడును దుర్గతిని బొందడు. ఆతడు స్వర్గమున చాల కాలముండి, సదాచార సంపన్నుల గృహమందు మఱల బుట్టి, పూర్వజన్మజ్ఞానమును పెంపొందించుకొనుచు తిరిగి యోగసిద్ధికొఱకు ప్రయత్నించును.

6 — 47

కర్మయోగులలోను, జ్ఞానయోగులలోను, ఎవడైతే నాయందు (పరమాత్మయందు) అంతఃకరణము గలవాడై శ్రద్ధతో నన్ను సేవించునో అనగా భక్తియోగి కూడ నగునో అట్టి యోగి శ్రేష్ఠుడు.

పురుషోత్తమకాండము—5. వివేకత్రికము.

(13. వివేకోపదేశము)

7 — 1.

శ్రీకృష్ణుడు:— అర్జునా! నాయందు మనస్సుంచి నన్నాశ్రయించి యోగములను అనగా కర్మజ్ఞాన యోగములను ఆచరించుచు పరిపూర్ణుడగు నన్ను నిస్సందేహముగ నెట్లు తెలిసికొనగలవో ఆ జ్ఞానమును నీకు తెలిపెదను.

7 — 3

వేలకొలదిమనుష్యులలో ఎవడో ఒకడుమాత్రమే అట్టి సిద్ధికొఱకు ప్రయత్నించును. ఆ ప్రయత్నించు వారలలో ఎవడో ఒకడుమాత్రమే నన్ను తెలిసికొనగలడు.

7 — 4, 5, 6, 7.

భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము అని నా ప్రకృతి ఎనిమిది విధములుగ నున్నది. భూతస్వరూపమైన యీ నా ప్రకృతి (అపరాకృతి) నికృష్టమైనది. దీనికి భిన్నమైనదియు, నీ ప్రపంచము నంతటిని ధరించునదియు నైన నా యుత్తమప్రకృతి పరాప్రకృతి. ఈ ద్వివిధము లైన రెండు ప్రకృతులు (అపరా; పరా) సకలభూతములకు మూలములు. సమస్తమైన జగత్తుయొక్క సృష్టికిని, సంహారమునకును, కారణభూతుడు నేనే. నాకంటె వేరైన దేదియు ప్రకృతియందు లేదు. మణిహారమందలి యనేక మణులు ఏకసూత్రమునందు కూర్పబడినట్లు ప్రపంచమందలి సమస్త భూతములును, ఏకైక ఆత్మయగు నాయందు కూర్పబడియున్నవి.

7 — 24.

అవివేకులు, నాశనరహితమైనదియు, పరమోత్తమమైనదియు నగు నా పరాప్రకృతిని తెలిసికొనలేక నామరూపములుకలిగి వ్యక్తరూపమును బొందిన నా

అపరాప్రకృతిని మాత్రమే చూచుచున్నారు. అనగా నిత్యమైన ఆత్మ స్వరూపమును మఱచి అనిత్యమైన దేహమును మాత్రమే నా ప్రకృతిగా దలచుచున్నారు.

9 — 4, 5, 6.

నిర్గుణుడనైన నాచేత నీజగత్తంతయు వ్యాప్తమైయున్నది. భూతము లన్నియు నా యాధారమున నున్నవి. నాకు భూతములు ఆధారములు కావు. భూతములు నాయందును లేవు. మఱియు, నా ఆత్మ భూతములను బుట్టించు నట్టిదియు, రక్షించునట్టిదియునైనను, భూతములయం దుండునది కాదు. అనగా ఆత్మ నిత్యమైనది. భూతములు అనిత్యములు. సర్వసంచారియగు వాయువు నిత్యముగా నాకాశమునందున్న విధమున సకల భూతములు నాయందున్నవి.

9 — 8.

నా ప్రకృతిననుసరించి, యస్వతంత్రమైన సమస్తభూతములను వాని వాని ప్రకృతివశమున నేను మఱల మఱల పుట్టించుచున్నాను. (ఆ పనిచేయు ఆత్మ బ్రహ్మయనబడును.)

8 — 20, 21.

సకలభూత సమూహమునకు కారణభూతుడై అవ్యక్తుడై యుండిన బ్రహ్మకంటె వేఱు లక్షణములుగల పరబ్రహ్మము, అవ్యక్తము, సనాతనము, అగోచరమునై యున్నది. ఆపరబ్రహ్మము సర్వభూతములు నశించినను నశించదు. అవ్యక్తమైన పరబ్రహ్మము సర్వోత్తమమగు మోక్షస్థానము. అట్టి నాయొక్క పరమపదమును పొందినవానికి మఱల జన్మలు లేవు.

15 — 7.

నిత్యుడనగు నా అంశమే జీవలోకమునందు జీవుడై ప్రకృతియందున్న త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణములను పంచ జ్ఞానేంద్రియములను, ఆఱవ దగు మనస్సును ఆకర్షించుచున్నది.

15 — 8, 9, 10.

అట్టి నా అంశమైన యీశ్వరుడు ప్రకృతి సంబంధమైన శరీరమునందు ప్రవేశించునపుడును, శరీరమునుండి విడిపోవునపుడును, వాయువు ఏవిధముగా

పరిమళద్రవ్యములనుండి వాసనలను గొనిపోవునో ఆవిధముగా నా యీశ్వరుడు (జీవాత్మ) ఆ శరీరసంబంధమైన కర్మేంద్రియములయొక్క కర్మ సూక్ష్మ వాసనలను గొనిపోవును. జీవుడు దేహమునందు, మనస్సును, శ్రోత్రాది పంచ జ్ఞానేంద్రియములను ధరించి యుండుటచే తద్ద్వారా బయటనుండు పంచ మహాభూతముల యొక్క తన్మాత్రలగు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను అనుభవించును. జీవాత్మ దేహమును విడుచునపుడుగాని, యందుండునపుడుగాని, సత్వరజస్తమో గుణములతో కూడి విషయముల ననుభవించుచున్నపుడుగాని, అజ్ఞానులు ఆ జీవాత్మను చూడజాలరు. జ్ఞానులు మాత్రమే చూడగలరు.

15 — 16.

ఈలోకమునందు రెండు విధములైన పురుషులు (పరమాత్మ అంశములైన ఆత్మలు) గలరు.

(1) క్షరమైన శరీరముతో నైక్యమునొందిన యాత్మ (జీవాత్మ)

(2) అక్షరమై, కూటస్థుడై యుండిన ఆత్మ (పురుషుడు).

15 — 17

ఈ యిద్దరు పురుషులు గాక వేరైన మూడవ పురుషుడు గలడు. అతడు పరమాత్మ.

15 — 18.

నేను, క్షర, అక్షర పురుషులకంటె నుత్తముడ నగుటచేత పురుషోత్తముడనబడుచున్నాడను.

10 — 4, 5.

లోకమునందు సకలభూతములకును, వివిధములైన భావములు నావలననే కలుగుచున్నవి. భూతములకు యుక్తాయుక్తవివేకము, విషయజ్ఞానము, ఓరిమి, సత్యము, నిగ్రహము, సుఖదుఃఖములు, జననమరణములు, భయాభయములు, భూతదయ, సర్వసమత్వము, సంతుష్టి, తపస్సు, దానము, కీర్తి, అపకీర్తి, మొదలగు వివిధభావములు నావలననే కలుగుచున్నవి.

7 — 12.

సత్త్వగుణమువలన గలిగిన శమదమాది భావములు,
రజోగుణమువలన గలిగిన యహంకార దర్పాదులును,
తమోగుణమువలన గలిగిన శోకమోహాదులును,

నావలన బుట్టినవి. అట్టి త్రిగుణములయొక్క భావములు నావశమునం దుండును. కాని నేను వానికి వశుడను గాను.

15 — 14.

నేను వైశ్వానరుడను. జఠరాగ్నిరూపుడనై ప్రాణుల దేహమునాశ్రయించి ప్రాణాపాన వాయువులతోఁగూడి నాలుగు విధములైన యన్నమును పక్వము చేయుచున్నాను. అవి

(1) ఖాద్యము—నమలదగిన యన్నము, పప్పు, కూర మొదలైనవి.
(2) చోష్యము—జుఱ్ఱదగిన చారు, మజ్జిగ, పాయసము మొదలైనవి.
(3) లేహ్యము—నాకదగిన పచ్చడి మొదలైనవి.
(4) పేయము—త్రాగదగిన మంచినీరు మొదలైనవి.

4 — 7.

ఎప్పుడెప్పుడు ధర్మమునకు హానియును, అధర్మమునకు అభివృద్ధియు, కలుగునో, ఆ యా సమయములందు, నేను అవతరించుచుందును.

(11. విభూత్యుపదేశము)

10 — 17.

అర్జునుడు :— ఓకృష్ణా! నిన్ను తెలిసికొనుటకు నిన్నేరీతిని ధ్యానము చేయవలయును? ఏ యే భావములందు నిన్ను నేను ధ్యానింపగలను?

10 — 19.

శ్రీకృష్ణుడు :— ఓ అర్జునా! నా విభూతులు అనంతములు. అయినను నా దివ్య విభూతులందు ముఖ్యములైన వానిని దెలిపెదను.

10 — 20.

సకల భూతములయొక్క హృదయములందున్న యాత్మను నేను. భూతములయొక్క ఉత్పత్తి స్థితి లయ కారకుడను నేను.

10 — 21. నుండి 38.

సకల జాతుల భూతముల లోను, ఆ యా జాతులలో నేవి గొప్పవో అవి నా దివ్య విభూతులు.

'మఱియు,

7 — 8, 9, 10.

నీటియందలి రుచి ; సూర్య చంద్రుల యందలి కాంతి ; ఆకాశమందలి ధ్వని ; పురుషుల యొక్క పౌరుషము ; భూమియందలి సువాసన ; అగ్నియందలి తేజస్సు ; భూతములయందలి ప్రాణము ; తపశ్శాలుల తపస్సు ; ధీమంతుల వివేకము ; తేజస్వుల తేజస్సును నేను.

10 — 41.

లోకమునందు ఐశ్వర్య యుక్తమై బలపరాక్రమ యుక్తమై, ఉత్సాహ యుక్తమై, యే యే వస్తువులు కలవో, వానినెల్ల నా తేజోభాగ సంభవమైనవిగా నెఱుంగుము.

10 — 7.

ఎవడు పై జెప్పిన, నా విభూతిని యోగమహిమను చక్కగా తెలిసికొనునో ఆతడు చలించని యోగసిద్ధిని నిస్సంశయముగా పొందును.

(15. విశ్వరూప సందర్శనము.)

11 — 1.

అర్జునుడు :— ఓకృష్ణా ! నీవు నన్ననుగ్రహించి చేసిన, ఉత్తమమైనదియు రహస్యమైనదియు, ఆత్మవిద్యారూపమైనదియు, నగు ఉపదేశము నా యవివేకమును బోగొట్టినది.

11 — 3.

ఓ పరమేశ్వరా ! నిన్నుగురించి నీ వే ప్రకారము చెప్పితివో అది యంతయు సరియే. ఓ పురుషోత్తమా ! నీయొక్క ఈశ్వర స్వరూపమును చూడ గోరుచున్నాను.

11 — 5.

శ్రీకృష్ణుడు :— అర్జునా! అనేకవిధములైన రంగులును ఆకారములును కలవియును, దివ్యములైనవియు, వందలువేలు తరబడి గలవియగు నా రూపములను చూడుము.

11 — 8.

నీవు నన్ను సామాన్యమైనకన్నులతో జూడజాలవు. నా ఈశ్వరయోగమును చూచుటకు నీకు దివ్యదృష్టి నిచ్చుచున్నాను; చూడుము అని.

11 — 10, 11.

అనేక ముఖములు కన్నులు కలదియు, అనేక చిత్రములు కలదియు, అనేక దివ్యాభరణములు కలదియు, పైకెత్తబడిన యనేక దివ్యాయుధములను గలదియు దివ్యములైన పుష్పమాలలను, వస్త్రములను ధరించినదియు, దివ్యమైన గంధపు పూత గలదియు, సర్వాశ్చర్యమయమును, అంతము లేనిదియు, అంతటను ముఖములు గలదియు, స్వయం ప్రకాశమును నయిన విశ్వరూపమును జూపెను.

11 — 13.

అప్పుడు బహువిధములుగా విభజింపబడియున్న జగత్తునంతయును దేవదేవునియొక్క ఆ శరీరమునందొక్క చోటనున్న దానినిగ, అర్జునుడు చూచెను.

11 — 38.

అర్జునుడు :— ఓ అనంతరూపా! నీవు ఆదిదేవుడవు. పురాణపురుషుడవు; సమస్త జగత్తునకును ఆశ్రయుడవు; సర్వజ్ఞుడవు; వేద్యవిషయమవు; ఉత్తమస్థానమవు; నీచేత నీ చరాచర ప్రపంచమంతయును నావరింపబడియున్నది.

11 — 52.

శ్రీకృష్ణుడు :— ఓ అర్జునా! నీవు చూచిన యీ విశ్వరూపము చూడ శక్యముకానిది. దేవతలుసైతము ఎల్లప్పుడును దీనిని చూడ గోరుచుందురు.

11 — 53.

నీవు చూచిన నా విశ్వరూపము వేదాధ్యయనము వలనగాని, యజ్ఞదాన తపస్సుల వలనగాని, సందర్శన సాధ్యముకాదు.

11 — 54.

ఓ అర్జునా ! విశ్వస్వరూపుడనైన నన్ను యథార్థముగ తెలిసికొనుటకును, చూచుకొనుటకును, నాలో ప్రవేశించుటకును, అనన్యమైన భక్తియే సాధనము.

పురుషోత్తమకాండము — 6. ఉపాయత్రికము.

(16. స్వరూపోపదేశము)

7 — 13.

శ్రీకృష్ణుడు :— త్రిగుణముల వికారమైన సమస్తప్రపంచమును ఆ గుణములచే సమ్మోహమును పొందుచున్నదై వీనికి పరుడును, అవ్యయుడును నగు నన్ను కనుగొన జాలకున్నది.

7 — 14.

దైవసంబంధమై, త్రిగుణాత్మకమైన నా మాయను ఎవరును విడిపించుకొన జాలరు. నన్నెవరు శరణుజొచ్చెదరో వారుమాత్రము ఈ మాయను తప్పించుకొన గలుగుచున్నారు; అనగా ఆత్మయోగులు ఈ మాయను తరింప జాలుదురు.

9 — 12.

వ్యర్థమైన కోరిక గలవారును, వ్యర్థమైన కర్మలను చేసెడివారును, అజ్ఞానులు, అవివేకులును నా మాయ యను ప్రకృతిలో మునిగిపోవుచున్నారు.

7 — 16.

ఓ అర్జునా ! నాలుగు విధములైన సుకృతులు, నన్ను భజించుచున్నారు. వారు సకాములు, నిష్కాములు, అను రెండు భేదములను గలిగియున్నారు.

సకాములు :— (1) ఆర్తుడు; గజేంద్రుడు మొదలైనవారు
(2) జిజ్ఞాసుడు; జనకుడు మొదలైనవారు
(3) అర్థార్థి; విభీషణుడు — ఇహ సుఖమును గోరువారు
ధ్రువుడు — పరసుఖమును గోరువారు

నిష్కాములు :— (4) ఆత్మజ్ఞాని ; ప్రహ్లాదుడు మొదలైనవారు.

7 — 17, 18.

ఈ పైజెప్పిన నాలుగు విధములైన భక్తులలో, యోగియును, ఏకాంత భక్తియుక్తుడును అగు ఆత్మజ్ఞాని శ్రేష్ఠుడు. ఏలననగా నతడు ఆత్మయోగపరుడై నన్నే ఉత్తమ ప్రాప్యముగా నమ్మియున్నాడు.

7 — 20.

మానవులు, తమతమ జన్మాంతర సంస్కార జనిత స్వభావమునుబట్టి, వాంఛలను గోరుచు, అజ్ఞానముచేత, నావరింపబడిన వారై వారివారి కోరికలకు తగిన దేవతలను ఆరాధించుచు, ఆ యా దేవతలనే చేరుచున్నారు.

7 — 13.

అట్టి దేవతలను పూజించువారు అట్టి దేవతలనే పొందుచున్నారు. అల్ప బుద్ధిగల యట్టివారికి లభించెడి ఫల మంతము గలది. అనగా నాశనమును బొందు నది. నా భక్తులన్ననో వారు శాశ్వతమైన నన్ను పొందుదురు.

9 — 25.

(1) దేవతలను బూజించెడివారు దేవతలను పొందుదురు.

(2) పితృదేవతలను బూజించెడివారు పితృదేవతలను పొందుదురు.

(3) భూతముల నారాధించెడివారు భూతములను పొందుదురు.

(4) నన్ను సేవించెడివారు మాత్రమే శాశ్వతమైన నన్ను పొందుదురు.

9 — 26.

నేను దేవతలలో మాత్రమేగాక ప్రాణముగల వృక్షములలోను, జంతువుల లోను, మానవులలోను గూడ నుండుటచే దేవతలతోబాటు మిగిలిన మూడింటిని గూడ సేవించుట నన్ను సేవించుటయే. అనగా జంతువులయందున్న నాకు పత్రము లను (ఆకులను), దేవతలయందున్న నాకు పుష్పములను, మానవులయందున్న నాకు ఫలములను, వృక్షములయందున్న నాకు తోయములను, (ఉదకమును) ఇచ్చి దేవ మానవ స్థావర తిర్యగ్వర్గములను నాల్గింటిని తృప్తి నొందించుటవలన నన్ను తృప్తి నొందించినట్లే నేను సంతోషించెదను.

9 — 32, 33.

నన్ను మిక్కిలి యాశ్రయించినవారు, ఎంతపాపాత్ములై యుండినను ఉత్తమ గతిని క్రమముగా పొందెదరు. అదేవిధముగా నితర కారణములచే ననగా సంఘ సేవక వృత్తులలో నిమగ్నులై యుండి, తీరిక లేక వేదములను స్వయముగా చదివి యందలి యాత్మవిషయములను స్వయముగా దెలిసికొనుట కవకాశములేని స్త్రీలు వైశ్యులు, శూద్రులుకూడను, నా భక్తులై మోక్షమును పొందగలుగు చుండగా, నింక తీరికగల్గి వేదాధ్యయన పరులగు వారు అనగా బ్రాహ్మణులు క్షత్రియులు, మోక్షమును పొంద గలుగుదురని వేరుగ జెప్పవలయునా ?

7 — 30.

ప్రపంచమున గల

(1) అధి భూతము— నశ్వరమైన సమస్త పదార్థము.

(2) అధి దైవము— అనశ్వరమైన పురుషుడగు జీవాత్మ.

(3) అధియజ్ఞము—ఎవరికొఱకు సమస్తకర్మలు జరుపబడుచున్నవో అట్టి పరమాత్మ ఈమూడును నేనే అని ఎవ రెరుగుదురో వారు మరణకాలమందును మతి చలింపక నన్ను జ్ఞాపకముంచుకొందురు.

10 — 8.

జగత్తంతయు నావలనగలిగినదనియు, నావలన నడుచుచున్నదనియు, నను పరమార్థము నెఱిగిన జ్ఞానులు నన్ను సేవింతురు.

13 — 29.

అన్ని భూతములయందును నిండియున్న యీశ్వరుని సమానముగా జూచు వాడు ఒక భూతమందలి తాను (ఆత్మ) వేఱొక భూతమునందలి తననే (ఆ ఆత్మనే) హింసించుకొనడు. కావున నట్టిమానవుడు పరమగతియగు మోక్షమును పొందు చున్నాడు.

శ్లో॥ సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరమ్ ।
న హినస్త్యాత్మనాఽఽత్మానం తతో యాతి పరాం గతిమ్ ॥

13 — 29.

హి, సర్వత్ర, సమం, సమవస్థితం, ఈశ్వరం, పశ్యన్, ఆత్మనా, ఆత్మానం, న హినస్తి (హింసచేయడు) తతః, పరాంగతిం, యాతి.

(17. చరమ సమాధి.)

8 — 1, 2.

అర్జునుడు :— ఓకృష్ణా ! (1) బ్రహ్మము (2) అధ్యాత్మము. (3) కర్మము (4) అధిభూతము. (5) అధిదైవము. (6) అధియజ్ఞుడు అనగానేమి ?

8 — 3, 4.

శ్రీకృష్ణుడు :— అర్జునా ! వినుము

(1) బ్రహ్మము అనగా నిరతిశయమై, నాశనరహితమై, సృష్టివర్తియైన పరమాత్మ.

(2) అధ్యాత్మము — ఆ పరమాత్మ స్వరూపము.

(3) కర్మము—భూతములను సృష్టిచేసెడి యా పరమాత్మ వ్యాపారము.

(4) అధిభూతము — దేహములందు నశించెడు స్వభాముగల ప్రకృతి వికారము.

(5) అధిదైవము — ప్రకృతివికారములతోగూడి జీవాత్మయైన పురుషుడు అను పరమాత్మ అంశము.

(6) అధియజ్ఞుడు — పరమపురుషుడును, పరమాత్మయు నైన నేను.

8 — 10.

మరణకాలమందు నిశ్చల మనస్సుతోడను, భక్తితోడను, యోగ బలము తోడను, రెండు కనుబొమల నడుమను, ప్రాణమును లెస్సగా నిలిపి యా పరమ పురుషు నెవ్వడుస్మరించునో అట్టివాడు అతనిని పొందును. అనగా బంధవిముక్తుడై మోక్షము నందును.

8 — 12.

దేహమందలి తొమ్మిది ద్వారములను బాగుగ్గనరికట్టి మనస్సును హృద యమునందు నిలిపి, తన ప్రాణవాయువును శిరస్సునందుంచి, యోగము నాచరించి

యున్నవాడు, పరమగతిని బొందును. ఇది హఠయోగసాధనము. అనగా మానవ శరీరమందున్న వెన్నెముక మధ్యభాగమున హృదయగ్రంథియను నొకముడిగలదు. హఠయోగసాధకుడు మరణకాలమున భగవంతుని దయవలన నా ముడిని త్రెంపి తద్ద్వారా దేహములో శిరస్సువరకు వ్యాపించియున్న 'సుషుమ్న' నాడిగుండా మాత్రమే (నవ ద్వారములు నరికట్టబడియుండుటవలన) తన ప్రాణవాయువును శిరస్సును భేదించుకొని బ్రహ్మరంధ్రముగుండా పోవునట్లు చేయగలుగును.

8 — 13.

ఎవడు పరబ్రహ్మ వాచకమగు 'ఓం' కారము నుచ్చరించుచు, నన్ను స్మరించుచు దేహమును వదలిపోవునో, అనగా మరణించునో, అతడు సర్వోత్తమమగు మోక్షస్థానమును పొందుచున్నాడు. ఉపనిషత్తులయందు 'ఓం' అను అకార, ఉకార, మకారములను మూడక్షరముల సముదాయపదము, పరమాత్మ యొక్క మూడు క్రియలగు సృష్టి, స్థితి, లయ కర్తృత్వమును సూచించునదిగ తెలుపబడినది. ఈ యర్థముతో పరమాత్మను, తన గమ్యస్థానముగ స్మరించుటవలన నా పరమాత్మలో జేరి ముక్తుడగును.

8 — 23.

ఈ శ్లోకములో ముక్తులగుటకు, వారు మరణించిన కాలస్వభావములు కారణములుగ చెప్పదలచెను కాని తరువాతిశ్లోకములలో మార్గములను గురించి చెప్పుటచూడగా నిచ్చట కాలమనగా మార్గమనియర్థముచెప్పికొనవలసియుండును. మఱియు, నెవని హృదయము భక్తిపూరితమైయుండునో, ఎవడు ఫలాసక్తి రహిత కర్ముడో, వాడు, ఎప్పుడు, ఎన్నడు మరణించినను మోక్షము నొందునని భగవద్గీత యొక్క బోధ సారాంశము.

8 — 24.

కావున నీశ్లోకమున బేర్కొనబడిన అగ్ని, తేజస్సు, పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణము (సూర్యుడు ఆర్యులస్థానమునందు ప్రకాశముగా తిరుగుకాలము) తమ తెలుపుదనముచే జ్ఞాన సూచకములు, మోక్షసాధనములు —(మహాత్ముని వాఖ్య.)

8 — 26.

ఈ శ్లోకములో స్పష్టముగా శుక్లకృష్ణపక్షములు, జ్ఞాన అజ్ఞాన ద్యోతకము లైనట్లును, శుక్లగతియనగా జ్ఞానమార్గము నవలంబించిన వారు తిరిగి రాకుండుట; అన్యగతి (కృష్ణగతి) అనగా అజ్ఞానమార్గ మవలంబించిన వారు తిరిగి పుట్టుట యేర్పడునని చెప్పబడినది.

(18. భక్తి యోగోపదేశము)

12 — 1.

అర్జునుడు :— ఓ కృష్ణా ! కొందరు భక్తులు ఎల్లప్పుడును (వ్యక్తమూర్తి యైన) నీయందు చిత్తమును నిలిపి, నీ ప్రీతికి కర్మలనుచేయుచు నిన్నుపాసించు చున్నారు. మఱికొందరు ఇంద్రియ గోచరము కాని యవ్యక్తమైన పరబ్రహ్మము నుపాసించుచున్నారు. వీరిద్దరిలో శ్రేష్ఠులెవరు ?

12 — 2.

శ్రీకృష్ణుడు :— నాయందు మనస్సు నిలిపి, నిత్యయుక్తులై అధిక శ్రద్ధతో నన్నుపాసించు భక్తులు సగుణోపాసకులై నను (ఉపాసించని వారికంటె) శ్రేష్ఠులు.

12 — 3, 4, 5.

ఎవరైతే ఇంద్రియనిగ్రహమును సమత్వబుద్ధిని గలిగి సకల భూతముల యొక్క హితమునందు నిరతులై, అవ్యక్తంబును, అవాఙ్మనసగోచరంబును, నిత్యంబును, సత్యంబును, సకలాధారంబునయిన అక్షర (నాశములేని) పరబ్రహ్మ మును ఉపాసించుచున్నారో, వారుకూడ మొదటి వారివలెనే నన్నే పొందు చున్నారు. అయినను ఈ రెండవ మార్గము, చాల కష్టసాధ్యము. (అందువలన నొక విధమున నెక్కువ శ్రేష్ఠము.)

12 — 6, 7.

నాయందు చిత్తమునుంచి, నాయందాసక్తులై, తాముచేయు సకల కర్మలను నాకే అర్పించి (ఫలాసక్తిరహితులై), ఏకాంతయుక్తులై, నన్ను ధ్యానిం చుచు, సేవించెడివారలను, జనన మరణ రూపమైన సంసారసాగరమునుండి నేను త్వరగా నుద్ధరించెదను.

10 — 10, 11.

నిరంతరము ఆత్మయోగయుక్తులై, నన్ను భక్తితో భజించెడివారలకు, నన్ను పొందగల బుద్ధి యోగమును ఇచ్చుచున్నాను. నేను వారి నుద్ధరించుటకే

వారి యాత్మలయందు నిలిచి స్వయంప్రకాశ మానమైన జ్ఞానదీపముచేత నజ్ఞాన జనితమైన చీకటిని పోగొట్టెదను.

14 — 26.

ఎవడు ఏకాంతమైన భక్తియోగముతో నన్ను సేవించుచున్నాడో అతడు ప్రకృతి సంబంధమైన గుణత్రయమును అతిక్రమించి బ్రహ్మత్వమును పొందుట కర్హుడగుచున్నాడు.

12 — 8, 9, 10, 11.

(1) నీవు నీమనస్సును నాయందే నిలిపి నీబుద్ధిని నాయందే నియోగింపుము.

(2) ఆవిధముగా వెంటనే నీవు చేయలేనియెడల క్రమముగా నభ్యాసము చేత నన్ను పొందుటకు ప్రయత్నింపుము.

(3) అట్టి అభ్యాస యోగము కూడ నీకు సాధ్యము కానియెడల నా నిమిత్తమైన కర్మయందే నిరతుడవు కమ్ము; అనగా నీవు చేయు సకలకర్మలను నాకొఱకు చేయుచున్నాననియే దృఢముగా నమ్మి చేయుము.

(4) అదియును చేయజాలవేని యాత్మనిగ్రహమును బూని నన్నాశ్రయించుచు, ఫలాపేక్ష విడిచి, నీ కైనందిన కర్మలను చేయుచుండుము.

12 — 12.

(1) కేవలము అజ్ఞానముతో గూడిన యభ్యాసముకంటె, జ్ఞానము (ఆత్మజ్ఞానము) మంచిది

(2) కేవలము జ్ఞానముకంటె, ధ్యానము మంచిది

(3) కేవల ధ్యానముకంటె నిష్కామ కర్మ మంచిది.

ఎందువలన ననగా నిష్కామకర్మాచరణవలన శాంతి కలుగును.

18 — 60.

నీవు అజ్ఞానముచేత నీకు స్వాభావికముగా లభించిన పనిని చేయుటకు, ఇచ్ఛగించకున్నను, నీ కర్మానుసారమైన స్వభావము చేత బద్ధుడవై నీవు తప్పక చేయవలసిన వాడవగుదువు.

18 — 61.

ఈశ్వరుడు, యంత్రములవలె నున్న సమస్త భూతములను, తన 'మాయ' యను శక్తిచే ఇష్టమువచ్చినట్లు త్రిప్పుచు సమస్త భూతముల యొక్క హృదయము లందున్నాడు.

18 — 63.

ఓ అర్జునా! జ్ఞానము లందెల్ల రహస్యమైన జ్ఞానమును నీకు చెప్పితిని. దీని నంతయును నీవు బాగుగా విమర్శించి, తరువాత, నీకు తోచినటుల చేయుము. (ఏలననగా పరులు బలవంతముగా నీమీద రుద్దిన ధర్మమును చేయుట మంచిది కాదు. పరధర్మో భయావహః ; ౩—౩౫,) పరధర్మ మనగా పరుల యొక్క ధర్మమే గాక, పరులు విధించిన ధర్మముకూడ నగును. అటువలెనే స్వధర్మ మనగా తనకు తాను విధించుకొనిన ధర్మము.

18 — 66.

మఱియు, సర్వ ధర్మములను (సర్వ కర్మములను) విడిచి, నన్నొక శరణు పొందినయెడల నేను నిన్ను సర్వ పాపముల నుండియు విడిపించెదను. (నన్ను ఒక్కనినే = అన్య దేవతా పూజమాని — శంకరభాష్యము)

18 — 67.

నేను నీకుచెప్పిన యీ గీతా శాస్త్రమును,

(1) తపశ్శీలురు కానివారికి, అనగా తమ ధర్మములయందు శ్రద్ధలేనివారికి (2) భగవద్భక్తులు కానివారికి, (3) చెప్పవలసినదని నిన్ను కోరనివారికి, (4) దైవ దూషణ చేయువారికిని ఎన్నడును చెప్పకుము.

18 — 68.

పరమ రహస్యమైన యీ గీతా శాస్త్రమును నా భక్తులకు చెప్పెడి వాడు, నా భక్తుడై, నిస్సంశయముగా నన్నే పొందును.

18 — 73.

అర్జునుడు :— ఓ కృష్ణా! నీ యనుగ్రహమువలన నా యజ్ఞానము నశించినది, సందేహ రహితుడనైతిని, నీ యాజ్ఞను నిర్వర్తించెదను.

శ్రీ వేంకటేశ్వర సాహితీ వైభవము

సంస్కృత గ్రంథములు

ముద్రితములు

1. శ్రీ వేంకటాచలమాహాత్మ్యగ్రంథము. తెలుగు లిపి. శ్రీమహంతు రామకిశోర దాస్‌జీవారిచే ప్రకటితము. క్రి. శ. 1896.
2. భవిష్యోత్తరపురాణాంతర్గత వేంకటేశ్వరమాహాత్మ్యము — టి. బి. క్రిష్ణాచార్య, తిరువళిక్కేణి.
3. భవిష్యోత్తరపురాణాంతర్గత వెంకటేశ్వరమాహాత్మ్యము. కన్నడ వ్యాఖ్యాన సహితము. బెల్గామ్.
4. శ్రీ వేంకటాచలమాహాత్మ్య, సంపుటములు 1, 2. దేవనాగరి లిపి. హింది భాషా వివరణ సహితము. తిరుమల తిరుపతి దేవస్థానమువారిచే ప్రచురితము నెం. 1.
5. ,, తెలుగు లిపి ,, 2.
6. ,, దేవనాగరి లిపి ,, 3.
7. శ్రీ వేంకటేశ్వర స్తుతి తెలుగు లిపి ,, 5.
8. వేంకటేశ్వర సుప్రభాతమ్ దేవనాగరి లిపి—తెలుగు లిపి ,, 6.
9. వేంకటాచల ఇతిహాసమాల ,, 14.
10. ,, బొంబాయి ముద్రణము నాగర లిపి.
11. శ్రీవేంకటేశ్వరకావ్యకలాపము. శ్రీమాన్ డి. టి. తాతాచార్యులువారిచే సంపాదితము. శ్రీవేంకటేశ్వరప్రాచ్యపరిశోధనాలయప్రచురణములు నెం1.
12. శ్రీవేంకటేశకల్యాణచరితమ్ శ్రీమాన్ టి. వీరరాఘవాచార్య విరచితము.

లిఖితగ్రంథములు.

(మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకాలయములోనివి)

1. వేంకటగిరిమాహాత్మ్యం— నెం (18835–50) 9 తెలుగు లిపి 2 కన్నడ లిపి 4 గ్రంథ లిపి
2. వేంకటాచలమాహాత్మ్యం— 1 గ్రంథ లిపి 2 నందినాగరి లిపి
3. వేంకటేశ గద్యం— తెలుగు లిపి
4. వేంకటేశనృపప్రశస్తి— గ్రంథ లిపి
5. వేంకటేశస్తోత్రం— 3 తెలుగు లిపి 4 గ్రంథ లిపి
6. వేంకటేశనామావళి— గ్రంథ లిపి
7. వేంకటేశమాహాత్మ్యం— 1 తెలుగు లిపి 1 దేవనాగరి లిపి
8. వేంకటేశస్తోత్రం— కన్నడ లిపి
9. వేంకటేశాష్టపంచాశన్నామస్తోత్రం— గ్రంథ లిపి
10. వేంకటేశాష్టోత్తరశతనామస్తోత్రం— తెలుగు లిపి 4 గ్రంథ లిపి
11. వేంకటేశాష్టోత్తరశతనామావళి— 2 తె 3 కన్న 1 గ్రంథ
12. వేంకటేశ్వరశతకం. నరసింహ విరచితము. గ్రంథ
13. వేంకటేశ్వరస్థలమాహాత్మ్యం— తెలుగు
14. వేంకటేశాష్టకం— తెలుగు లిపి
15. వేంకటేశకవచం— తెలుగు లిపి
16. వేంకటేశతూణకం— తెలుగు లిపి
17. వేంకటేశదయితా సుప్రభాతం.
18. వేంకటేశద్వాదశనామస్తోత్రం— 1 తె. 3 గ్రంథ
19. వేంకటేశ పంచకం.
20. వేంకటేశప్రపత్తి.
21. వేంకటేశ మంగళాశాసనం 3 తె. లిపి 4 గ్రంథ లిపి
22. వేంకటేశమహిషీమహాలక్ష్మీ చతుర్వింశతినామస్తోత్రం— గ్రంథ లిపి
23. వేంకటేశ విజయస్తోత్రం— ప్రతివాదిభయంకర
24. వేంకటేశ సుప్రభాతం— 3 తెలుగు లిపి 6 గ్రంథ

25. వేంకటేశ సేవాక్రమం— శఠకోపదాస విరచితం
26. వేంకటేశస్తోత్రం.
27. శ్రీనివాసగుణాకరము— అభినవరామానుజ వరదరాజ కావ్యం
28. శ్రీనివాసస్తోత్రం.

(నెం 15 మొదలు 28 వరకుగల గ్రంథములు "వేంకటేశ్వరకావ్యకలాప" మనుపేర వేంకటేశ్వరగ్రంథమాల. 1 నెం గా ముద్రితములై ప్రకటితములై యున్నవి.)

29. శ్రీనివాసగురుమంగళాశాసనం— కన్నడ లిపి
30. శ్రీనివాస గురుస్తోత్రం— కన్నడి లిపి
31. శ్రీనివాసచూర్ణిక— తెలుగు లిపి
32. శ్రీనివాసమాహాత్మ్యం. పురాణం— గ్రంథ లిపి
33. శ్రీనివాసముని యాత్రావిలాసచంపూః—గోవిందదాస విరచితం, గ్రంథలిపి
34. వేంకటేశ ప్రహసనం. వేంకటేశ విరచితం
35. శ్రీనివాసరథవిజయనాటిక— నరసింహవిరచితం దేవనాగరి లిపి
36. శ్రీనివాసస్తవిభక్తి— వెంకటవరద విరచితం
37. శ్రీపాదతీర్థగ్రహణం— గ్రంథ లిపి
38. శ్రీపాదతీర్థవైభవం.
39. శ్రీపాదస్తుతిః— నారాయణవిరచితం. స్తోత్రం. దేవనాగరి లిపి

(శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల పుస్తకభాండాగారములోనివి)

1. వేంకటగిరి మాహాత్మ్యము— (సంపూర్ణము)
2. వేంకటాచలమాహాత్మ్యం.
3. వేంకటాచలమాహాత్మ్యం— (భవిష్యోత్తరే)
4. వేంకటనాథాష్టోత్తరశతనామావళి.
5. వేంకటాచలయాత్రా నిరూపణం.
6. వేంకటేశప్రముఖస్తోత్రం.

7. వేంకటేశరంగనాథ గురుచరిత నాటకం. నారాయణ విరచితం.
8. వేంకటేశసుప్రభాతం.
9. వేంకటేశఅష్టోత్తరశతనామస్తోత్రం.
10. వేంకటేశఅష్టోత్తరశతనామావళి.
11. పద్మావతీపరిణయనాటకం— (తెలుగు లిపి) సంపూర్ణము.
12. వేంకటేశచంపూః — ధర్మరాజ విరచితము
13. వేంకటేశమాహాత్మ్యం— (ఆదిత్యపురాణాంతర్గతం)
14. వేంకటేశ స్తవరాజః
15. శ్రీనివాససుప్రభాతం
16. వేంకటేశకల్యాణం— (మరాటి)
17. పద్మావతీ పరిణయచంపు.

తమిళము.

తమిళవాఙ్మయమున 'వేంగడ' ప్రశంస

(తమిళవాఙ్మయమున వేంకటాచలము 'వేంగడం' అను పేరబరగుచున్నది.)

1. తొల్కాప్పియం— "వడవేంగడం తెన్కుమరి"
2. ప్రాచీన తమిళసంఘ వాఙ్మయము
   అగనానూరు—
   (1) కల్లాదనార్—83
   (2) నక్కీరార్— 209, 253.
   (3) కణక్కాయనార్—27.
   (4) మామూల్నార్ — 61, 295, 281, 393.
3. శిలప్పదికారం — XI 41–51.
4. ఆళ్వారుల ప్రబంధములలో వేంగడమును గూర్చిన ప్రశంస.
   నాలాయిరప్రబంధము—
   1. పొయ్గై యాళ్వార్లు—నాలవ సహస్రములో మొదటి శతకము.
      ముదల్ తిరువన్దాది:—26, 37, 38, 39, 40, 68, 76, 77, 82.

2. భూతత్తాళ్వార్లు:—నాల్గవ సహస్రములో రెండవ శతకము.
ఇరణ్డాన్ తిరువన్తాది:— 25, 28, 33, 45, 46, 53, 54, 72.
3. పేయ్ఆళ్వార్లు:—మూడవశతకము— 14, 26, 30, 32, 39, 40, 45, 58, 61, 62, 63, 69, 70, 71, 72, 73, 75, 89.
4. తిరుమలిశై ఆళ్వార్లు:—నాన్ముకంతిరువన్తాది:—34, 39, 40, 41, 42, 43, 44, 48, 90. తిరుచ్చందవిరుత్తం— 60, 81.
5. శ్రీనమ్మాళ్వార్లు:— తిరు విరుత్తం— 8, 10, 15, 31, 50, 60, 67, 81.

పెరియ తిరువన్దాది :— 68.

తిరువాయ్ మొళ్ఱి:— 3 పత్తు— 3తి; 6 పత్తు. 10తి; 1. ప. 8. తి. 3; 2ప. 6. తి. 9; 2. ప. 6. తి. 10; 2ప. 7తి—11; 3ప. 5తి—8; 4ప. 5తి. 11; 6. ప. 9. తి—5, 11; 8ప. 2. తి—1; 9ప. 3. తి. 9; 10ప. 7తి. 8.

6. పెరియాళ్వార్లు :— తొలి సహస్రం — 5వ భాగములో
7. ఆణ్డాళ్:— నాచ్చియార్ తిరుమొళ్ఱి— తొలి సహస్రం — 2, 3 భాగములలో. 8 - వ తిరుమొళ్ఱి.
8. తిరుమఙ్గైయాళ్వార్లు:—పెరియతిరుమొళ్ఱి. 8తి— 1పత్తు, 9తి. 1పత్తు, 10తి. 1పత్తు, 1తి. 2పత్తు.
9. కులశేఖరప్పెరుమాళ్ :— పెరుమాళ్ తిరుమొళ్ఱి. 4వ. తిరుమొళ్ఱి

తమిళకావ్యములు.

1. తిరువేంగడస్థలపురాణం — మధురకవి వీరరాఘవస్వామి అయ్యంగారు రచించినది. శ్రీ. టి. పి. పలనియప్ప పిళ్లెగారిచే సంపాదితము. తిరుపతి వేంకటేశ్వర గ్రంథమాల. నెం. 18గా ప్రకటితము.
2. తిరువేంకట ఉలా:— శ్రీ టి. పి. పలనియప్ప పిళ్లెగారిచే సంపాదితము. శ్రీ. వేం. పరిశోధనాలయ గ్రంథమాల నెం. 23గా ప్రకటితము,

3. తిరువేంకట అంతాది } దీని రచయిత అళగియ మణవాళదాసర్.
4. తిరువేంకటమాలై }
5. మణవాళ నారాయణ శతకం — నారాయణ భారతిచే విరచితము
6. వడ వేంకట నారాయణ శతకం :— కర్త. నారాయణ దాసర్.

లిఖితగ్రంథములు.

మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమందలివి.

1. వేంకటాచలమహిమన్ వణ్ణం — కాగితము. R. 519.
2. వేంకటేశర్ తిరువనందల్ — తాళ పత్రప్రతి. D. 1763
3. వేంకటేశర్ తోత్తిరం — తాళ. D. 1764
4. వేంకటేశ రెట్టన్ శోభనం — కాగి. R. 583.
5. వేంకటేశ రెట్టన్ పిళ్లైత్తమిళ్. కాగి. R. 583
6. వేంకటేశ రెట్టన్ భూధర విలాసం. R. 583.
7. తిరువేంకట కలంబకం — D. 296.
8. తిరువేంకట ప్పాట్టు — D. 759.
9. తిరువేంకట మాలై — D 347
10. తిరువేంకట ఉలా. D 274, 275.

కన్నడము

కన్నడభాషలో రచింపబడిన గ్రంథములు.

1. పద్మినీకల్యాణ. సాంగత్యములో రచింపబడినది.
   శృంగారమ్మ (క్రి. శ. 1685) ఈమె శ్రీ వైష్ణవ స్త్రీ — కవయిత్రి. తండ్రి—చింతామణిదేశికేంద్రులు. గురువు, శ్రీనివాసదేశికులు. మైసూరు రాజు చిక్కదేవరాజు (1672—1704) పోష్యవర్గమునకు జేరినదిగా తెలియవచ్చుచున్నది.
2. వెంకటగిరి మాహాత్మ్య, చంపు. బ్రహ్మాండ పురాణాంతర్గత భృగునారద సంవాద రూపమగు తిరుపతి మాహాత్మ్యము. తిమ్మకవి విరచితము (1677). చిక్కదేవరాయుని ఆశ్రితుడు.

3. వేంకటగిరి మాహాత్మ్య, గద్య రూప రచన. చిక్కుపాధ్యాయ రచితము (1672)

4. హస్తిగిరిమాహాత్మ్య, శ్రీ వైష్ణవకవి, యజుర్వేది. ఈతని కులదేవత కాంచి వరదరాజ. మైసూరురాజు చిక్క రాయలయొద్ద మంత్రియై యుండెనట.

5. వేంకటేశ్వర ప్రబంధ, చంపువు, వెంకటకవి విరచితము. (క్రీ. శ. 1650) బెట్టిద కోటెయ వేంకటేశ్వరస్వామికి సంబంధించిన విషయముగల గ్రంథము.

6. క్రిష్ణ లీలాభ్యుదయ, షట్పదీకావ్యము (భాగవత దశమస్కంధకథ — క్రిష్ణలీలలు) వెంకయ ఆర్యుడను మాధ్వ బ్రాహ్మణునిచే రచింప బడినది. తిరుపతి కృష్ణరూప దేవుని కంకిత మీయబడినది. క్రీ. శ. 17. శతాబ్ది.

7. వేంకటేశ్వర శతక. — చెన్నరాజ (A.D. 1750)

శ్రీ వేంకటేశ్వ రాంధ్ర సాహిత్యము

తొలి తెలుగు శాసనము :—

1. శ్రీ మహామండలేశ్వర మీసరగండ (సాళువ) మంగిదేవ మహారాజులు "తిరుమలదేవరకు సువర్ణ శిఖర మెత్తించిన"ట్లు తెలుపబడిన తెలుగు శాసనము. తిరుపతి దేవస్థాన శాసనములు 1-వ సంపుటము నెం. 179, శక. 1281, క్రీ. శ. 1359. శ్రీ వేంకటేశ్వరస్వామిని గూర్చిన రచనలలో మొదటి తెలుగు శాసనము.

2. ఎఱ్ఱాప్రెగ్గడ :— నృసింహపురాణము—ఇందు "వేంకటేశ్వరస్థాయి గొలిచి" — అని వేంకటాచల మొక పుణ్యక్షేత్రముగా చేర్కొన బడినది.

* 3. సింధుమతీవిలాసము :— కర్త—గోపణమంత్రి. శ్రీ వేంకటేశ్వర కరుణా కలిత కవితావిలాసుడు. వేంకటేశ్వరస్వామి కృపాకటాక్షమునకు పాత్రుడైన మొట్టమొదటి తెలుగుకవి.

---

* ఈ గుర్తుగలవి అముద్రితములు.

4. తాళ్ళపాకవారి కృతులు — అన్నమాచార్యుల కృతులు :—

1. శృంగారమంజరి — తాళ్ళపాక కవుల గ్రంథములు (మైనర్ వర్క్సు) Vol 1 లో ప్రకటితము.

2. అలుమేలుమంగ శతకము :— 'వేంకటేశ్వరా' అను మకుటము కలది.

3. శృంగార సంకీర్తనలు :— తిరుమల — తిరుపతి దేవస్థానము వారి ప్రచురణములు. సంపుటము 1. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యగ్రంథ మాల నెం 11.

4. అధ్యాత్మ సంకీర్తనలు :— శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య గ్రంథమాల సంపుటము నెం. 11.

5. తిమ్మక్క :— (అన్నమాచార్యుల భార్య) — సుభద్రాకల్యాణము (ద్విపద) శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయ ప్రచురణము నెం. 20.

6. తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు :—

(1) శృంగారాధ్యాత్మ్యసంకీర్తనలు.
(2) చక్రవాళమంజరి. (మంజరీద్విపద)
(3) నీతి సీసపద్యములశతకము.
(4) వేంకటేశోదాహరణము.
(5) సుదర్శనరగడ.
(6) శృంగారదండకం.
(7) శృంగారవృత్త పద్యాల శతకం.
(8) రేఫ అకారములు
(9) వైరాగ్య వచనమాలికా గీతాలు.

2 - 9 తిరుపతి దేవస్థాన తాళ్ళపాకంవారి కృతులు (Minor works) Vol. I. లో ప్రకటితములు.

(10) వేంకటేశ్వరవచనములు. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయ ప్రచురణము. నెం. 10.

*(11) ఆంధ్రహరివంశము.

*(12) ఆంధ్రవేదాంతము (ద్విపద).

(13) భగవద్గీతవచనము.

(14) వేంకటేశ ప్రభాత స్తవము.

7. చినతిరుమలాచార్యుడు :— (అన్నమయ్య మనుమడు—పెదతిరుమలాచార్యుని మొదటి కుమారుడు).

(1) అధ్యాత్మసంకీర్తనలు, శృంగారసంకీర్తనలు.

(2) అష్టభాషా దండకం.

(3) సంకీర్తన లక్షణము. (తెనుగున)

2-3 తిరుపతి దేవస్థానం తాళ్ళపాకంవారి కృతులు (Minor works) Vol. I. లో ప్రకటితము.

8. చిన్నన్న అనే తిరువేంగళనాథుడు :— (పెదతిరుమలాచార్యుని నాల్గవ కుమారుడు) సదాశివరాయల వలన ననేకాగ్రహారముల బడసి స్వామి కర్పించినాడు.

(1) పరమయోగి విలాసము :— (ఆళ్వారులచరిత్ర) ద్విపద. తిరుమల-తిరుపతి దేవస్థానమువారిచే ప్రకటితము. నెం. 19.

(2) అష్టమహిషీ కల్యాణము :— (ద్విపదకావ్యము) తిరుమల-తిరుపతి దేవస్థానమువారిచే ప్రకటితము. నెం. 18.

(3) ఉషాపరిణయము : — తిరుమల — తిరుపతి దేవస్థానము వారిచే ప్రకటితము. నెం. 20.

(4) అన్నమాచార్య చరిత్ర :— శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయ ప్రచురణము. నెం. 17.

9. తిరువేంగళప్ప (చినతిరుమలాచార్యుని కుమారుడు):—

(1) ఆంధ్రామరుకావ్యము.

(2) అమరవ్యాఖ్య, తెనుగున 'గురుబాల ప్రబోధిక' రచించిన దితడే.

(3) కావ్యప్రకాశవ్యాఖ్య — 'సుధానిధి' యనుపేరుగలది. వేంకటేశ్వరుని దేవి 'లక్ష్మి'కి సమర్పితము.

10. రేవణూరి వెంకటార్యుడు. (అన్నమాచార్యుని కూతురు తిరుమలాంబ కొడుకు):—

(1) శ్రీపాదరేణు ప్రభావము — 'నిస్పృహీయకావ్య' మన్నాడు దీనిని కవి. (6277)

(2) శకుంతలా పరిణయము.

11. పిల్లలమఱ్ఱి పిన వీరభద్రకవి. జైమినిభారతము. సాళువ నృసింహరాయల కంకితము. "శ్రీ వేంకటాద్రి నాథ దయావర్ధిత రాజ్య" — అని సంబోధనము.

12. నందిమల్లయ — ఘంట సింగయలు, — వరాహ పురాణము. తుళువ నరసింగరాయల కంకితము, "శ్రీ వేంకటాద్రి పతిసం సేవా హేవాకనిపుణ" అని సంబోధనము.

13. శ్రీ కృష్ణదేవరాయలు — ఆముక్తమాల్యద :— కృష్ణా తీరమునందలి శ్రీకాకుళాంధ్ర నాథుని (వల్లభుని) ప్రేరణమున శ్రీ వేంకటేశ్వర స్వామి కంకితముగా రచింపబడిన మొదటి యాంధ్ర ప్రబంధ రాజము.

14. ముక్కుతిమ్మన్న — పారిజాతాపహరణము. ఇందు "వేంకటస్వామి కృతార్థుజేయు నరసక్షితినాథుని కృష్ణరాయునిన్" అని వేంకటస్వామిని స్మరించినాడు.

15. ధూర్జటి — కాళహస్తిమాహాత్మ్యము. ఇందు సువర్ణముఖరీవర్ణనా సందర్భమున "వేంకటాచలాలంకారంబై — కాళహస్తి పురలక్ష్మి బాల్కిత్రామణికి మణిమాలికయై" — అని వేంకటాచలము స్మరింప బడినది.

16. పింగళిసూరన్న — కళాపూర్ణోదయము. గంధర్వుడు తీర్థయాత్రలజేయుచు వేంకటేశునగరుజేరి స్వామినిజూచి స్తుతించినాడు. వేంకటేశ్వరుని గూర్చిన స్తుతి యిందుగలదు.

17. సిద్ధిరాజు తిమ్మరాజు — పరమ యోగి విలాసము. మంగళగిరి నృసింహ స్వామి కంకితము. వేంకటేశ్వరస్వామిని గూర్చిన స్తుతిపద్య మొకటిగలదు.

18. తెనాలి రామకృష్ణుడు — ఘటికాచల మాహాత్మ్యము :—
ఇందు "శుక్రవారపు సేవల సొగసు వాని మానినుల గోరి వలపించు మా యలాని దిండి మెండయగారిని దిగళ గురునిగాంచి సేవించి" నట్లు వర్ణిం చి నాడు.

19. తరిగొప్పుల మల్లన — చంద్రభాను చరిత్రము. ఈతడు వెంకటపతి రాయ లకాలమున రాయసముగ నియుక్తుడై యుండినవాడు. మాహురపురమం దలి దత్తాత్రేయునకంకితము. తిరుపతి కొండనుగూర్చి, కొండనెక్కు జనుల గుంపులనుగూర్చి విపులముగా చమత్కారముగ వర్ణించినాడు.

20. మాదయగారి మల్లన—రాజశేఖర చరిత్రము. నాదిండ్ల అప్పయ దండాధి పున కంకితము—"వేంకటగిరిగ్రావ వ్యాగ్రంబునన్। దావిర్భూత జనాను రాగమునం బ్రత్యక్షకృతిన్ బొల్చు నద్దేవోత్తంసుడు ప్రోచుగాత" అని ప్రార్థించినాడు.

21. ధరణిదేవుల రామమంత్రి—దశావతారచరిత్ర. 'వేంకటేశు డెంతే గృప పద్మనాభ సచివేశ్వరు గృష్ణ సుధీంద్రు బోవుతన్'! "శ్రీ యలుమేల మంగవలె జెల్వగు రంగమ గర్భవార్ధి చంద్రాయిత వేంకటేశ సచివాగ్రణి కృష్ణ సుధీవరున్" — అని స్మరించినాడు.

* 22. కూచిరాజు ఎఱ్ఱన — సకల నీతి కథానిధానము. కొండపల్లీ పుట భేదన మంత్రి — కుంటము క్లపిన భైరవుడు — తనకిష్టదైవమగు 'వెంకటాద్రి శేఖర వాసున' కర్పణముగా రచింపుమని కవిని ప్రోత్సహించినాడు. క్రిష్ణరాయల తరువాత శ్రీ వేంకటాచలపతి కంకితముగా జెప్పబడిన ప్రా ధాంధ్ర ప్రబంధ మిదియే గావచ్చును.

23. రాయసం వేంకపతి — లక్ష్మీ విలాసము. శ్రీ రంగరాయలు చంద్రగిరిని పాలించుచున్న కాలము. ఈతడు ప్రబంధ మొకటి రచింపంబూని కృతిపతి నన్వేషించుచుండగా "శ్రీ భామాసక్తుడు వేంకటేశ్వరుడు స్వప్న ప్రాప్తుడై 'లక్ష్మీ విలాస కథ' కృతి యొనర్పుము నాకు నంకితముగాగ" యని చెప్పి దీవించి చనెను. వేంకటేశ్వరుడు తెలుగు కవులకు స్వప్నమున సాక్షాత్కరించి తెలుగు ప్రబంధములను కృతిగొనుట కిదే మొదలుగా గనబడుచున్నది.

24. కాకమానిమూర్తి — రాజవాహన విజయము. కలలో ప్రత్యక్షమై "కవితలో ప్రతిపద్య చమత్కృతి గలుగగ బలుకనేర్చు కృతిపీవు మహాకృతి మా కొనరుచు భాషాకృతి భారవి కాకమాని శ్రీ మూర్తి కవీ" అని యడుగగా, 'కొండమీాది తిమ్మప్పనివంటి కావ్యపతి యబ్బుట యబ్బుర మిబ్బుధాళికిన్ ' అని నిశ్చయించి కృతి ఘటించినాడు.

* 25. ఎఱ్ఱగుడిపాటి వేంకటకవి — విష్ణుమాయా విలాసము. (7229) బిట్రగుంట — వేంకటేశ్వర స్వామి కంకితము.

* 26. ఉకుమళ్ల రంగశాయికవి—వాణీవిలాసము. సర్వవిషయ సంగ్రహ మన దగిన యొక బృహద్గ్రంథము. శ్రీ వేంకటేశ్వర స్వామి కంకితము.

27. గణపవరపు వేంకటకవి — ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసము. — వేంకటేశ్వరున కంకితము.

28. నెల్లూరి వీరరాఘు కవి — యాదవ రాఘవ పాండవీయము. మొదట ఇంటిపేరు దేశిరాజు వారట. కాశ్యప గోత్రుడు. వెంకపతి పుత్రుడు. వేంటేశ్వరుని కంకితము. క్రీ. శ 1715 ప్రాంతమువాడు.

* 29. తక్కెళ్లపాటి లింగన్న — మదనమోహినీవిలాసము, సూర్యతనయా పరిణయము, విద్యు త్ప్రభావిలాసము (యక్షగానము). "వేంకటేశ్వర శ్రీ రామవిభుల కెలమినంకితంబుగమును జెప్పినా" డట.

* 30. సిరిప్రగడ ధర్మనామాత్యుడు—నలచరిత్రము. 6 ఆశ్వాసముల ప్రబంధము. వేంకటేశ్వరుల కంకితము. "విను మనఘాత్మ ధర్మసుకవీ భవదీయవచో

విలాసముల్ ఘనకవి హృద్వికాసములు గావె చమత్కృతిమీర నీవు నేర్చి నగతి నిప్పుడా నలచరిత్రము వేంకటశైలరాణి వాసునకు సమర్పణంబుగను శోభనలీల రచింపు పెంపుగన్ ”

* 31. గూళికల్లు వేంకటరమణకవి :—
కనకరంజిత శిఖామణి పరిణయము—(విక్రమార్కుని కథ.) 6 ఆశ్వాసముల ప్రబంధము. వెంకటామాత్యుని పుత్రుడు. తల్లి రంగమాంబ. కవినిగూర్చి వేంకటేశు డన్నాడట “ నీయిష్టదైవంబ నిను బ్రోచుచుండెడు శ్రీ వేంకటేశుండ నీవెరుంగు ” శ్రీ వేంకటేశున కంకితము.

* 32. చేతపూడి కృష్ణయ్య :— అలుమేలుమంగా వివాహము.

* 33. చల్లాపల్లి వెంకనార్యుడు :— శ్రీ కృష్ణవిలాసము.
“ నీ కావ్యాంకిత మిమ్మటంచు గృపతో నాయిష్టదైవంబు తా నా కాంక్షింపుచు వేంకటేశ్వరుడె డాయన్ వచ్చి వేడన్ ! భళా నాకోర్కుల్ సమకూరె ” నంచు నీ గ్రంథమా దేవునికి కృతియిచ్చెను.

* 34. చింతలపల్లి వీరరాఘవకవి :— మధురవాణీవిలాసము.
శ్రీ వేంకటేశ్వర వరప్రసాదలబ్ధ కవితాచాతురి గలవాడు. వెంకటార్య పుత్రుడు, తల్లి లక్ష్మణాంబ. చిత్రకవితా నానావిధావధానలాఘువుడు. వెంకటనాయక నాటక వేషధారి. హరి కలలో గానవచ్చి క్లిష్టకల్పన గాకుండ నొక ప్రబంధము దనపేర రచింపుమని ప్రబోధించినాడు. ఈతని యార్గురు పుత్రులును గవులే.

* 35. కట్టా వరదరాజు :— పరమభాగవతచరిత్ర — (S.V.O.I. Li. 7294)

* 36. దామెర చినవేంకటరాయకవి :— వేంకటాచలమాహాత్మ్యం.

* 37. చిత్రకవి రమణకవి :— సాంబవిలాసము — శ్రీ వేంకటేశ్వరుల కంకితము.

38. ములుపాక బుచ్చన్న శాస్త్రి :— వేంకటేశ్వర మాహాత్మ్యము.

39. తరిగొండ వెంకమ్మ :— వేంకటాచల మాహాత్మ్యము.

* 40. శ్రేష్ఠలూరి వెంకటార్యుడు :— శ్రీనివాస విలాససేవధి (ద్విపద)

41. చల్లపిళ్ళ నరసకవి :— వేంకటేశ్వర విలాసం (ప్రబంధం).

* 42. తెన్నేటి సీతారామకవి :— నీలాచలమాహాత్మ్యం. (O.M.L.R. 577)

* 43. సింగనార్య :— వేంకటాచల విలాసము (S.V.O.I. Ms-7299)

* 44. సింగనార్య :— అలుమేలుమంగావిలాసము (S.V.O.I. Ms-7109)

* 45. వెంకటరాయకవి :— వేంకటేశ్వరమాహాత్మ్యం (O.M.L. Madras No.12-6-10)

* 46. వెంకటరాయకవి :— శ్రీనివాసవిలాసం (O.M L. Madras R. 457)

* 47. మారెళ్ళ సుబ్బరాయదాసు :— గరుడాచలవిలాసం (ఆం. సా. ప. గ్రం.)

* 43. పోతనామాత్యుడు :— గరుడాచల విలాసం (తంజా. గ్రం.)

* 49. కొటికలపూడి వెంకటకృష్ణ సోమయాజి :— శ్వేతాచలమాహాత్మ్యం. (O.M.L. Madras)

* 50. ,, వేంకటేశ్వరవిలాసము (O.M.L.R. 133)

* 51. ఆత్మకూరి తిమ్మన — సోమన :— ద్విపద భారతము. శ్రీ వేంకటేశ్వరుల కంకితము.

* 52. కాణాద పెద్దనసోమయాజి :— శేషశైలలీల, ముకుందవిలాసం.

53. కృష్ణకవి :— శకుంతలాపరిణయం. (18th Century A. D.) శ్రీ వేంకటేశ్వరుల కంకితము.

* 54. బద్దెపూడి ఎఱ్ఱభూపతి :— యువజన హృదయానందం. (ఆం.సా.ప.గ్రం. No. 364) శ్రీ వేంకటాచలపతి కంకితము.

* 55. కొట్ర బాలకవి :— విమలాంగీపరిణయము. (కళింగాంధ్రకవులు అడిదం. రా. రా.)

* 56. వద్దిపర్తి కోసరాట్కవి :— వేంకటేశ్వరోపాఖ్యానము. ,,

* 57. రేవణూరి వెంకటార్యుడు :— శ్రీ పాదరేణు ప్రభావము.

58. రెంటూరి రంగరాజు :— భానుమతీపరిణయము.

దేశిశాఖ రచనలు.

తాళ్ళపాకవారి రచనలన్నియు దేశిశాఖారచనలే. శతకము, ద్విపద, రగడ, ఉదాహరణము, సీసము, గీతము, దండకము, వచనములు, విన్నపములు, సంకీర్తనములు, యక్షగానములు మొదలగు రచనలన్నియు దేశి శాఖకు జెందినవిగా గ్రహింపదగినవే. శ్రీ వేంకటేశ్వర స్వామినిగూర్చి యిట్టి దేశి

రచనలను పెక్కు రచించినవారు తాళ్ళపాకవారే. ఆ యా గ్రంథనామములు తాళ్ళపాక వారి గ్రంథముల పట్టికలో గ్రహింపబడియున్నవి.

1. సంకీర్తనములు :— శృంగారాధ్యాత్మికములు. దేవస్థానము వారిచే 12 సంపుటములుగ ప్రకటితములు.

(1) తాళ్ళపాక సంకీర్తన గ్రంథావళి, 1-వ సంపుటము సంకీర్తనలక్షణాది మండితము.

(2) అధ్యాత్మ సంకీర్తనలు — 415 సంకీర్తనలు.

(3) శృంగార సంకీర్తనలు — 650 సంకీర్తనలు.

(4) శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు.

(5) అధ్యాత్మసంకీర్తనలు — 5-వ సంపుటము మొదలు 12 వరకు. సంకీర్తనల తరువాత హెచ్చుగా రచింపబడిన దేశిశాఖారచనలు.

2. శతకములు :—

(1) తిరుపతి వేంకటేశ్వర శతకము (అలుమేలుమంగ శతకము) :— తాళ్ళపాక అన్నమయ్య.

(2) వేంకటేశ శతకము (నీతి సీసపద్య శతకము) :— తాళ్ళపాక పెద తిరుమలాచార్యుడు.

(3) వేంకటరమణశతకము :— పత్రిరమణప్పకవి, (O.M.L.13-5-31) 1909.

(4) వేంకటరమణ శతకము :— రత్నమాంబ.

(5) తిరుమల శ్రీ వేంకటేశ శతకము :— భగవచ్ఛాస్త్రి.

(6) శ్రీ వేంకటేశ శతకము :— ఊడిమూడి సూరపరాజు.

(7) తిరుమలగిరి వేంకటేశ శతకము :— నల్లాన్ చక్రవర్తుల వెంకటాచార్లు.

(8) వేంకటనగాధిప శతకము :— మంచళ్ళ కృష్ణకవి.

(9) వేంకటాచల విహార శతకము :— శ్రీ వేంకటేశ్వర లఘుకృతులను (S·V.O. Series No. 16లో ముద్రితము.

(10) వేంకటరమణ శతకము :— వెచ్చా ధర్మపురి ,,

(11) వేంకటేశ్వర శతకము — ధర్మపురి వెంకటశాస్త్రి ,,

(12) పంకజ భవాండేశ శతకము:— (28 పద్య. తారావళి?) ముద్రితము
(13) వేంకటశైలనాయక శతకము:— ,,
(14) వేంకటాచలేశ శతకము:— ,,
(15) వేంకటాచలపతి శతకము:— ,,
(16) మేల్నాటి వెంకటేశ శతకము:— ,,
(17) వేంకటనగాధ్యక్ష శతకము: ,,
(18) వేంకటశైలనాయక శతకము:— గణపవరపు వేంకటేశ్వరకవి, (S.V.O.I. 7303). ,,
(19) శేషగిరీశ శతకము: — ఓబళయ్య, (O.M.L. 25-5-21).
(20) నీలనగాధినాయక శతకము:— (O.M.L. 10-5-10).
(21) బ్రహ్మపురి వేంకటేశ్వర శతకము:— పార్నంది సర్వేశ్వరశాస్త్రి.
(22) ఉపమాక వేంకటేశ్వర శతకము:— వైదర్సు అప్పయకవి.
(23) ఉపమాక వేంకటేశ్వర శతకము:— ఇంద్రకంటి వెంకటకవి.
(24) వేంకటరమణ శతకము:— కోనాటి నరసింహరాయుడు (1913)
(25) ,, తా. వెంకటకవి (1913)
(26) ,, లింగం వెంకటరావుపంతులు (1883)
(27) ,, ఆర్. రామబ్రహ్మము (1880)
(28) వేంకటేశ్వర శతకము:— సీరము సుభద్రమాంబ.
(29) ,, విద్వాన్ దర్భా కృష్ణమూర్తి.
(30) ,, నల్లా రెడ్డినాయుడు.
(31) వేంకటపతీశ శతకము:— పి. బలరామయ్య. (1915)
(32) వేంకటాచల నిలయ శతకము:— ఎస్. వెంకటసుదర్శనము (1892)
(33) వేంకటాచలరమణ శతకము:— యం. బుచ్చికామకవి (1904)
(34) ,, పి. శ్రీరాములునాయుడు (1919)
(35) ,, గా. నార్ల పేరయ్య (1914)
(36) ,, మావటిపల్లి బుచ్చికామకవి (1904)
(37) వేంకటాచల శతకము:— (1904)
(38) వేంకటశైలనాయక శతకము:— ఎ. వకుళాభరణ పరదేశి.

(39) వేంకటేశ్వర శతకము :— టి. చిన్నన్న (1886)
(40) వేంకటేశ్వర శతకము :— ఆర్. రామానుజసూరి (1915)
(41) ,, గబ్బిట యజ్ఞన్నశాస్త్రి (1911)
(42) ,, యన్. సుబ్బరాయుడు (1900)
(43) ,, వారణాసి సూర్యనారాయణ (1911)
(44) ,, పి. రామమూర్తి (1902)
(45) ,, సరికొండల నరసింహం (1911)
(46) ,, జలదంకి వేంకటదాసు (1911)
(47) ,, యన్. రామచంద్రయ్య —
(48) ,, వెంకటేశ్వరరెడ్డి (1886)
(49) ,, ఇంకొల్లు ఆదిశేషయ్య (1909)
(50) ,, చింతా సుబ్బయ్య (1919)
(51) ,, యన్. వెంకటశాస్త్రి (1888)
(52) తిరుపతి వేంకటేశ్వర శతకము :— పి. రామచంద్రరావు (1914)
(53) వేంకటరమణ శతకము :— పరవస్తు వెంకయ్య (1926)
(54) వేంకటేశ్వరస్వామి సీసపద్య శతకము :— మామిళ్ళపల్లె శేషశాస్త్రు (1926)
(55) శ్రీ వేంకటేశ శతకము :— చింతమనేని జగ్గయ్యచౌదరి (1926)
(56) ,, పిసిపాటి కోటీశ్వరశర్మ (1926)
(57) తిరుపతి వేంకటాచల శతకము :— కాటూరి రామరాజు (1920)

ద్విపద మంజరి దండక యక్షగానోదాహరణాదులు

1. శృంగారమంజరి :— తాళ్ళపాక అన్నమాచార్యులు.
2. సుభద్రాకల్యాణము :— (ద్విపద) ,, సుభద్రమ్మ.
3. చక్రవాళమంజరి :— ,, ,, పెదతిరుమలాచార్యులు.
4. వేంకటేశోదాహరణము ,,
5. సుదర్శనరగడ ,,
6. శృంగారదండకము ,,

7. వైరాగ్యవచన మాలికాగీతాలు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు.
8. వేంకటేశ్వర వచనములు ,,
9. అష్టభాషా దండకము :— తాళ్ళపాక చినతిరుమలాచార్యులు.
10. పరమయోగి విలాసము :— (ద్విపద) చిన్నన్న
11. అష్టమహిషీకల్యాణము ,, ,,
12. ఉషాపరిణయము ,, ,,
13. అన్నమాచార్య చరిత్ర ,, ,,
14. వేంకటాచలధామ తారావళి :— ధర్మపురి వెంకటశాస్త్రి శ్రీ. వేం. లఘుకృతులలో ముద్రితము.
15. శ్రీ వేంకటేశ్వరకల్యాణము :— (గేయము) (,, 13th)
16. ప్రసన్న వేంకటేశ్వర మంజరి (,, 15th)
17. శ్రీ వేంకటేశ్వర పంచ చామరములు (,, 16th)
18. శ్రీ వేంకటేశ్వర దండకము (,, 17th)
19. శ్రీ వేంకటేశ్వర దండకము :— (,, 18th) శ్రీ హేమాద్రిరంగేంద్రుడు.
20. శ్రీ రమా పరిణయము :— తరిగొండ వెంకమాంబ (,, 19th)
21. శ్రీనివాస తారావళి :— జూలూరు అప్పయ్య.
22. కోనేటిరాయాష్టకము :— (O. M. L. R. 128)
23. వేంకటేశ్వరాష్టకము ,,
24. వేంకటేశనక్షత్రమాల:— తూములూరి వెంకటరంగయ్య (ఆం.సా.ప. భాం)
25. తిరుపతి వేంకటాచలవల్లభాష్టకము (O. M. L.)
26. వేంకటాచలస్వామి వర్ణనం :— (రగడ) (O. M. L. 13-4-29)
27. అలుమేలుమంగా స్తవం :—(14 శ్రీ. వేం లఘుకృతులలో ముద్రితము).
28. గరుడాచలవిలాసం:— (యక్షగానం) ఓబయమంత్రి (O. M. L. 14-17-1, 12-1-11)
29. గరుడాద్రివిలాసం :— (ఆం. స. ప. భాం.)
30. వేంకటేశ కల్యాణం :— చెంచునాటకం (ఆం. సా. ప. భాం.)
31. పద్మవల్లీ వేంకటేశ్వర వివాహకథ :— (O. M. L.)
32. శేషగిరినాథ విన్నపములు :— (ఆం. సా. ప. భాం.)

33. వేంకటేశ విన్నపములు :— శాలమహారాజు.
34. వేంకటేశ వచనము :— (O. M. L. R. 249)
35. గొడుగుల వచనము :— (O. M. L R. 447 (c)
36. వేంకటేశ గణితము :— (O. M. L. R. 198)
37. వేంకటేశాంధ్రం :— (నిఘంటువు).
38. రేఫఱకార నిర్ణయం :— తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు.
39. అలుమేలుమంగా విలాసం :— (యక్షగానం) బద్దీ శ్రీనివాసామాత్యుడు.
40. వేంకట మేలుకొలుపులు :— లాలా కిష్టయ్యదాసు (పాట)
41. వేంకటరమణ తారావళి :— చె. రామచంద్రయ్య - స్తోత్రము 1905.
42. వేంకటరమణస్వామి కోర్టులో సాక్ష్యముచెప్పిన అద్భుత చరిత్రము.
43. వేంకటాచలపతి వేటలాడుట :— కె. చెంగయ్యదాసు 1921.
44. వేంకటాచల ప్రశంస :— జి. శ్రీనివాసరావు 1917.
45. ,, ఊటూ యతిరాజదాసు 1903.
46. ,, ఎం. అబ్బయ్యనాయుడు (పద్యకావ్యము) 1910.
47. వేంకటాచల యాత్ర :— కె. వెంకటదాసు 1904.
48. ,, కేసనపల్లి చెంగయ్య.
49. వేంకటాచల సేవ ప్రదీపిక :— రామానుజదాసు
50. వేంకటాద్రి స్వామి కీర్తనలు :— అల్లూరి వెంకటాద్రిస్వామి.
51. వేంకటాద్రి స్వామి చరిత్ర :— ఎన్.రామానుజరావు నాయుడు, (వచనము) 1897.
52. వేంకటాద్రిస్వామి చరిత్ర :— పి. రామదాసు 1878.
53. ,, కె. తులసీదాసు 1906.
54. వేంకటేశ్వర తారావళి :— సి. హెచ్. రామన్న 1900.
55. వేంకటేశ్వర దండకము :— జంకువరుతము సుబ్రహ్మణ్యకవి.
56. ,, వెంకటసుబ్రహ్మణ్యకవి 1873.
57. వేంకటేశ్వర నాటకము :— సూర్యనారాయణకవి 1882.
58. వేంకటేశ్వర పద్మావతీపరిణయనాటకము :— వి. రాజవేలుమొదలి 1909.
59. ,, నూతలపాటి అప్పయకవి.

60. వేంకటేశ్వర ప్రసన్నము :— కొత్తపల్లి సుందరరామయ్య 1912.
61. వేంకటేశ్వర ప్రార్థనవదనము :— పూసపాటి వీరపరాజు (పాటలు) 1910.
62. వేంకటేశ్వర భక్తవిజయము :— వెల్లనూరు నరసింహదాసు 1919.
63. ,, రంగప్రకాశదాసు 1914.
64. వేంకటేశ్వర భజనకీర్తనలు :— బి. నారాయణదాసు 1921.
65. ,, బి. నరసింహదాసు 1918.
66. వేంకటేశ్వర మాహాత్మ్యము :— పంచవటి వెంకటరామయ్య 1911.
67. వేంకటేశ్వర మాహాత్మ్య విన్నపము :— (వచనము) 1914.
68. వేంకటేశ్వర మేలుకొలుపులు :— కె. చెంగయ్యదాసు 1921.
69. వేంకటేశ్వర వజ్రకవచభూషణము :— సి. రంగయ్యనాయుడు.
70. వేంకటేశ్వర విజ్ఞప్తి :— సి. అప్పయ్యశాస్త్రి 1921.
71. ,, గాడె జగన్నాథస్వామి 1913.
72. వేంకటేశ్వర వేదాంతకీర్తనలు :— జి. తిమ్మదాసు 1920.
73. వేంకటేశ్వర స్తుతి తారావళి :— శృంగారకవి సర్వారాముడు.
74. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవవిలాసము :— పి. గరుడాచలం.
75. వేంకటేశ్వరాష్టకము :— బ్రం. లక్ష్మణాచారి.
76. వేంకటేశ్వరీయం :— శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి.
77. శ్రీనివాస కల్యాణము :— శ్రీ విక్రమదేవవర్మ 1906.
78. శ్రీనివాస పూజావిధానము :— చి. వెంకట జోగయ్యనాయుడు 1904.
79. శ్రీనివాసమూర్తి పలికిన హరికథ :— వెంకటరామానుజదాసు.
80. శ్రీనివాస రత్నావళి :— పి. శ్రీనివాసాచారి.
81. శ్రీనివాస విలాసము :— తిరుపతి వేంకటేశ్వరకవులు 1905.
82. శ్రీనివాస సంకీర్తనలు :— కె. రంగాచారి 1898.
83. శేషాచల మాహాత్మ్యము :— బి. నరసింహదాసు.
84. వరాహ వేంకటేశ్వరమాహాత్మ్యము :— సి. రంగయ్యనాయుడు 1917.
85. ప్రసన్న వేంకటేశ్వర క్షేత్రమాహాత్మ్యం :— టి. ఆదినారాయణస్వామి.
86. పద్మావతీదేవి శృంగారదరువులు :— సి. రంగయ్యనాయుడు.
87. పద్మావతీపరిణయ నాటకము :— టి. వెంకటరామయ్య 1916.

88. పద్మావతీపరిణయము :— యస్. నారాయణయ్య
89. ,, రామపుత్రి (పాట) 1909.
90. తిరుపతి క్షేత్రమాహాత్మ్యము :— ఇంకొల్లు ఆదిశేషశర్మ 1909.
91. తిరుపతి భక్తవిజయము :— సి. రంగయ్యనాయుడు 1915.
92. తిరుపతి మాహాత్మ్యము :— రంగప్రకాశదాసు 1910.
93. తిరుపతి రథోత్సవమాహాత్మ్యము :— ,, 1912.
94. తిరుపతి వేంకటేశ్వర కర్ణామృతము :— ఎన్. సూరిదాసకవి (స్తుతి) 1920
95. తిరుపతి వేంకటేశ్వర సాక్ష్యము :— పొడుగు రామబ్రహ్మము 1918
96. తిరుపతి వేంకటేశ్వర స్తవము :— ద్రోణంరాజు సీతారామరావు 1914.
97. తిరుపతి స్థలమాహాత్మ్యము :— సి. రంగయ్యనాయుడు 1915.
98. తిరుమల తిరుపతి యాత్ర :— ఎన్. వి. లక్ష్మీనరసింహారావు 1919.
99. తిరుమల పద్యములు :— ఎన్. తేవప్పెరుమాళ్ళయ్య 1891.
100. వేంకటాచలమాహాత్మ్యము :— ఎ. వెంకటరామయ్య 1926.
101. వేంకటాద్రీశ్వరస్తోత్రము :— ఎస్. సుబ్బారావు 1927.
102. వేంకటేశాక్షరమాల :— రామానుజ 1926
103. వేంకటేశస్తోత్ర పంచకము.
104. వేంకటాచల దివ్యక్షేత్రమాహాత్మ్యము :— యస్. రుద్రయ్యనాయుడు 1926
105. పద్మావతీ శ్రీవేంకటేశ్వరక్షేత్రమాహాత్మ్యము.
106. నారాయణాచలమాహాత్మ్యము :— అల్లంరాజు రంగనాథకవి.
107. వేంకటేశ్వరకల్యాణము :— పి. యస్. శర్మ 1927.
108. వేంకటేశాదిపూజాపంచరత్నమాల :— మలయాళస్వామి.
109. శ్రీవేంకటేశ్వరరథచక్రప్రార్థనచరిత్రము :— యం. వి. రుద్రయ్యనాయుడు
110. వేంకటేశచిద్విలాసరసము :— సి. ఆర్. చెన్నకేశవులునాయుడు 1927.
111. వేంకటేశ్వర పద్మావతీమనోరంజిత పెండ్లిపాటలు :—వి. నారాయణదాసు 1926.
112. శ్రీనివాసవిలాసము:— వాడాడ అప్పారావు 1926.

113. పద్మావతీ వేంకటేశ్వరుల మేలుకొలుపులు మంగళహారతులు గొబ్బి పాటలు 1926.

114. గరుడాచలము :— ఓబయకవి. (యక్షగానము) 1872.

115. గరుడాచలము :— (వచనము) వి. వాసుదేవశాస్త్రి 1889.

116. ,, యాదవదాసు (యక్షగానము) 1885

117. అలమేలుమంగమ్మకథ :— కె. చెంగయ్య 1920.

118. అలమేలుమంగమ్మ లక్ష్మీపద్మావతమ్మ అను చవతుల కొట్లాట: కె. చెంగయ్య 1921.

119. దారాషాకో — (నాటకం) :— భమిడి సూర్యనారాయణ,
వెంకటేశ్వరులకు అంకితము.

120. అమృతానందము :— శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి ,,

121. తోమాలియ :— శ్రీమతి కాంచనపల్లి కనకమ్మ ,,

122. శ్రీ వేంకటేశ్వర స్తుతిరత్నమాల :— Part. I. శ్రీ వెం. ప్రా. ప. అ. ప్రకటితము No. 26.

123. శ్రీ వేంకటేశ్వర స్తుతిరత్నమాల :— Part. 2. శ్రీ వెం. ప్రా. ప. అ. ప్రకటితము. No. 34.

JOURNAL
OF
SRI VENKATESVARA ORIENTAL INSTITUTE, TIRUPATI

1. The JOURNAL is the official organ of the Sri Venkatesvara Oriental Institute and the Oriental College, Tirupati.
2. The JOURNAL appears twice a year, in January and July.
3. Contributions are accepted mainly from the members of the Institute and the staff of the College.
4. Each contribution must be clearly written or typewritten on one side of the paper only and must be completely press-ready. No additions other than corrections of printer's errors will be admitted after its acceptance for publication.
5. The Editor reserves to himself the right of accepting, rejecting or modifying any contribution received for publication. Contributors are advised to keep copies of their articles as the Editor does not undertake the responsibility to return the rejected articles.
6. Authors will receive twenty-five reprints of their contributions free of charge.
7. The annual subscription to the JOURNAL is Rs. 10/- post free, (inland) and 20 Sh. or 6 Dollars (foreign) to be paid strictly in advance.
8. Books on Indology in English, Sanskrit and Dravidian Languages, are reviewed in the JOURNAL. All books intended for review are to be sent to the Editor.
9. Advertisement charges &c. may be obtained on application from the Editor.
10. All communications regarding the JOURNAL should be addressed to :—

THE EDITOR,

JOURNAL OF SRI VENKATESVARA ORIENTAL INSTITUTE,

TIRUPATI (SOUTH INDIA).

Printed by: Sri C. Anna Rao, B.A., at the T. T. Devasthanams Press, Tirupati, 175 Copies 282 Pages—3-10-52.

Published by: Sri P. V. Ramanujaswami, M.A., Director, Sri Venkatesvara Oriental Institute, Tirupati.